
అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 01-10-2024



రాజకీయాలకు దేవుళ్లనైనా
దూరంగా ఉంచండి
లడ్డూలో కల్తీ నెయ్యి వాడారనే
ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై
సుప్రీం ఆగ్రహం

వివరాలు 3లో

కుప్పకూలిన మార్కెట్లు
రూ.3.5 లక్షల కోట్ల సంపద ఆవిరి
సెన్సెక్స్ 1250 పాయింట్ల పతనం
రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 3 శాతం క్షీణత



వివరాలు 13లో

సంపుటి : 10 | సంచిక : 273 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



పారిశ్రామికవేత్తల కోసమే
మోడీ సర్కార్
కార్పొరేట్ విధానాలతో
ప్రగతి అసాధ్యం
కాంగ్రెస్ వస్తేనే మార్పు :
హర్యానా ర్యాలీలో రాహుల్

చండీగఢ్: మోడీ సర్కార్ పారిశ్రామిక వేత్తల కోసమే పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే.. హర్యానాలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలను నామరూపాల్లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. రైతుల సంక్షేమం, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం వంటి అంశాల్లో కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా రాహుల్ ఎండగట్టారు. హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు అంబాలా జిల్లాలోని నరైన్‌గఢ్‌లో జరిగిన ర్యాలీలో ...6లో



కూల్చివేతలు కాదు.. చెరువుల పునరుద్ధరణే లక్ష్యం
మూసీకి ఇరువైపులా సర్వేలతో
హైడ్రాకు సంబంధం లేదు :
కమిషనర్ రంగనాథ్ ప్రకటన

13లో



డీఎస్సీ ఫలితాలను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు

టీచర్ కొలువు

ఉపాధ్యాయ అభ్యర్థులకు
9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు

ఉద్యోగం కాదు..భావోద్వేగం
11,062 కుటుంబాల్లో దసరా పండుగ సంతోషం

- త్వరలో గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు
- వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలు
- రూ.125 కోట్లతో వర్సిటీల స్థాయిలో 25 ఎకరాల్లో నిర్మాణం
- 56 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు
- అన్ని శాఖల్లో జాబ్ క్యాలెండర్ ప్రకారం ఖాళీలు భర్తీ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 29న డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా 2,79,838 మంది దరఖాస్తు చేశారు. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు రాతపరీక్షలను నిర్వహించాం. 2,46,584 మంది హాజరయ్యారు. 56 రోజుల్లో ఫలితాలు విడుదల చేశాం. తెలంగాణలో దసరా పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకుంటారు. ఈనెల తొమ్మిదిన డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను అందిస్తాం. దసరా పండుగ సందర్భంగా 11,062 మంది ఉపాధ్యాయుల కుటుంబాల్లో సంతోషం తేవాలని భావిస్తున్నాం.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎస్)ను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, ...13లో

ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై
క్షేత్ర పరిశీలన
3 నుంచి 7 వరకు పైలెట్ ప్రాజెక్ట్ :
సీఎం రేవంత్ రెడ్డి



వివరాలు 6లో

టీజీపీఎస్సీ ప్రక్షాళన

బీఆర్ఎస్ హయాంలో టీజీపీఎస్సీ అంగడిసరుకుగా మారిందని రేవంత్‌రెడ్డి అన్నారు. దాన్ని ప్రక్షాళన చేశామనీ, చైర్మెన్, సభ్యులను నియమించామని చెప్పారు. త్వరలోనే గ్రూప్-1 ఫలితాలను విడుదల చేస్తామన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం చేస్తామని వివరించారు. నిరుద్యోగులకు అండగా నిలుస్తామనీ, ఉద్యోగ నియామకాలే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలను అందించామని గుర్తు చేశారు. మొదటి ఏడాదిలోనే 65 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తు న్నామని అన్నారు. అన్ని శాఖల్లో ఖాళీ పోస్టులను జాబ్‌క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తామని వివరించారు.

కూల్చివేతలే లక్ష్యమా?
హైకోర్టునూ కూల్చేస్తారా?
హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం | స్టేటస్ కో జారీ





నవతెలంగాణ-హైదరాబాద్

అక్రమ కట్టడాల కూల్చివేత విషయంలో హైడ్రా తీసుకుంటున్న చర్యలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కూల్చివేతలే ఏకైక లక్ష్యమా? అని నిలదీసింది. విపత్తుల నిర్వహణ, ట్రాఫిక్ వంటి సమస్యలు కూడా హైడ్రా చేయాలని నిబంధనల్లో ఉంటే కూల్చివేత చర్యలు మాత్రమే తీసుకోవడ మేంటని ప్రశ్నించింది. అమీన్‌పూర్ తహసీల్దార్ సెప్టెంబర్ 21న శనివారం మెన్ అండ్ మెటీరియల్ కావాలని కోరితే ఆ తరువాత రోజు 22న ఆదివారం ఎలా పంపుతారని ప్రశ్నించింది. శని, ఆదివారాలు కూల్చకూడదని విస్తృత ధర్మాసనం తీర్పు ఇచ్చిందని తెలియదా? అని నిలదీసింది. తాము కేవలం నోడల్ ఏజెన్సీగా మాత్రమే విధులు నిర్వహిస్తున్నామని హైడ్రా కమిషనర్ చెప్పడాన్ని తప్పుబట్టింది. కూల్చివేతలకు మెన్ అండ్ మెటీరియల్ కావాలనే తహసీల్దార్‌కు ఆదివారం కూల్చాలని చెప్పే బాధ్యత లేదా? అని ప్రశ్నించింది. కావూరి హిల్స్‌లో ఫలానా విధంగా చేశామని కమిషనర్ చెప్పబోగా విషయాన్ని పక్కదారి పట్టించొద్దని మందలించింది. అడిగితే మెన్ అండ్ మిషన్స్ పంపేస్తారా? ఎందుకు పంపుతున్నారో తెలుసుకోరా? రేపు చార్మినార్ తహసీల్దార్ కోరితే మెన్ అండ్ మిషనరీ పంపిస్తారా? చార్మినార్, హైకోర్టులను కూల్చేస్తే ఏం చెబుతారు? అని ప్రశ్నించింది. హైకోర్టు కూల్చివేతలకు ఎందుకు పంపుతామని కమిషనర్ రంగనాథ్ ప్రశ్నించారు. అంటే, అమీన్‌పూర్ ప్రజలకు ఒక న్యాయం, హైకోర్టుకు మరో న్యాయం తరహాలో మీచర్యలు వివక్షపూరితంగా ఉంటాయా? అంటూ మందలిం చింది. గత విచారణలో ఆదేశించిన మేరకు సోమవారం హైడ్రా కమిషనర్ ఆర్.రంగనాథ్ ఆన్‌లైన్‌లో, అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. అమీన్‌పూర్‌లోని సర్వే నెం.164లోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను 48 గంటల్లో తొలగించాలంటూ ఈనెల 20న తహసీల్దార్ ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ మహమ్మద్ రఫీ, అమీన్‌పూర్‌కు చెందిన గణేష్ కన్‌స్ట్రక్షన్స్, పటేల్‌గూడలో విల్లాల కూల్చివేతలపై మరికొందరు వేసిన పిటిషన్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారించారు. వాళ్లను పలు ప్రశ్నలతో హైకోర్టు ఊపిరి సలపకుండా చేసింది. ఇలాగా హైడ్రా పనిచేస్తూ ఉంటే హైడ్రా ఏర్పాటు జీవో 99 అమలును నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు ఇస్తామని చెప్పింది. రాజకీయ బాస్‌లు, పైస్థాయి అధికారుల మాటలు వింటే తీవ్రంగా నష్టపోతారనీ, ...2లో

మంత్రి సురేఖపై
ఇష్టానుసారంగా పోస్టులా?

కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహం
- బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైడ్రా పేరిట గత కొద్ది రోజులుగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నేతల మధ్య కొనసాగుతున్న విమర్శలపర్వం సోమవారం తీవ్రస్థాయికి చేరింది. మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్‌కు చెందిన సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా, అవమానకరరీతిలో పోస్టులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం ...5లో

చేనేతల ఓట్లతో గెలిచి
పద్మశాలి ఆడబిడ్డను వేధిస్తారా?
కేటీఆర్‌కు మంత్రి కొండా సురేఖ ప్రశ్న



వివరాలు 5లో

కార్మిక హక్కులు కాలరాయడం దేశద్రోహమే
వారి శ్రమేలేకుంటే అభివృద్ధి అసాధ్యం

- శ్రామికులు బాగుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగు
- కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగభద్రత, హక్కులు కల్పించాల్సిందే : సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు
- యాజమాన్యాల ఒత్తిడితోనే కనీస వేతనాలు పెంచడం లేదు : పాలడుగు భాస్కర్
- సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల కోసం పాలకులు కార్మికుల హక్కులను కాలరాయడం దేశద్రోహమే అవుతుందని సీఐటీయూ అఖిలభారత కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. దేశంలో కార్మికులకు భద్రత లేకుంటే పారిశ్రామిక రంగానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం ఉండదని నొక్కి చెప్పారు. కార్మికులు, కూలీలు లేకుండా దేశ అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దేశాభివృద్ధిలో కీలకంగా మారిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, హక్కులు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ...13లో



పేదల ఇండ్లు కూల్చొద్దు
బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం :
సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్
సీపీఐ(ఎం), మూసీ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో
హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-అంబర్‌పేట

మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చే ప్రతిపాదనను విరమించుకోవాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. సీపీఐ(ఎం), అంబర్‌పేట మూసీ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గోల్నాక డివిజన్‌లోని మూసీ పరివాహక ప్రాంతంలో ఎన్నో ఏండ్లుగా పేదలు చిన్న చిన్న ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూలుస్తామనడం సరికాదన్నారు. పైసా పైసా కూడబెట్టుకుని స్థలం కొని ఇండ్లు నిర్మించుకున్నారని, వాటిని తొలగించకుండా మూసీని అభివృద్ధి చేయాలని సూచించారు. సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు మహేందర్ మాట్లాడుతూ.. 2000లో వచ్చిన వరదలకు కూడా ఇండ్లు మునగలేదని, చాలా ఎత్తు ప్రదేశాల్లో ఇండ్లు ఉన్నాయని తెలిపారు. వారి వద్ద ఇంటి స్థలం పట్టా, ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని, ప్రభుత్వానికి కరెంట్ బిల్లు, నల్లా బిల్లు, ప్రాపర్టీ ట్యాక్స్ కడుతున్నారని చెప్పారు. హైడ్రా పేరుతో ఇండ్లను ...13లో

మూసీ బాధితులు ఐక్యంగా పోరాడాలి
రైతుల పోరాటంతో మోడీనే దిగొచ్చాడు
బాధితులకు అండగా ఉంటాం
బుల్డోజర్లకు అడ్డుగా నిలబడుతాం
అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్తాం
ముందు సీఎం రేవంత్‌రెడ్డి, సోదరుడు తిరుపతిరెడ్డి ఇండ్లు కూల్చండి : కేటీఆర్



వివరాలు 5లో

అగాథంలో కీలక రంగాలు
ఆగస్టులో మైనస్ 1.8 శాతానికి పతనం
మూడున్నరేండ్లలో తొలిసారి ప్రతికూల వృద్ధి



వివరాలు 5లో

సిద్ధరామయ్యపై ఈడీ కేసు
ఎఫ్ఐఆర్‌లో కర్నాటక సీఎం ప్రథమ నిందితుడిగా నమోదు
జాబితాలో సతీమణి, బావమరిది సహా మరొకరి పేరు



వివరాలు 6లో

పండుగ పూట ధరా భారం
లీటరు నూనెపై రూ 20 నుంచి 45 పెంపు
- మళ్లీ కొండెక్కిన కోడి
- కిలోరూ 60 దాటిన ఉల్లి
- రూ.400పైనే వెల్లుల్లి
- ఇబ్బందుల్లో ప్రజలు

దసరా పండుగకు 15 రోజుల ముందే ప్రజలపై ధరల పిడుగు పడింది. అన్ని రకాల వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కాయగూరలు, ఆకు కూరలు, నూనెలు, మాంసం, పప్పుల ధరలు అమాంతం పెరిగాయి. వారం రోజుల కిందట లీటర్ నూనె ధర రూ.20 నుంచి 45కు పెరిగింది. గతంలో రూ.110 ఉన్న నూనె ప్యాకెట్ ధర రూ.140కి చేరుకుంది. వెల్లుల్లి దిగిరానంటూ రూ.400పైనే ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మరోసారి ఈ ధరలు మంట పెడుతున్నాయి.



నవతెలంగాణ- కల్వకుర్తి టౌన్

కిలో చికెన్ రూ.240కి చేరువైంది. ఉల్లి ధర నెల రోజులుగా కిలో రూ.60కిపైగానే పలుకుతోంది. మరో మూడూ నాలుగు రోజుల్లో కిలో రూ.80కి చేరుకునే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు తెలిపాయి. వెల్లుల్లి కిలో రూ.400కు పైగా పలుకుతుండగా.. అల్లం కిలో రూ.180 వరకు ఉంది. ఎండు మిరపకాయల ధర సైతం పెరిగింది. వాటికి తోడు అన్ని రకాల పప్పుల ధరలు కిలో రూ. 20 నుంచి 30కు పైగానే పెరిగాయి. దీంతో ఈ ఏడాది దసరా పండుగ చేసుకునేది ఎలా అంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నూనె ధరలపై ఎక్సైజ్ సుంకం 12 నుంచి 32 శాతానికి పెంచడంతో నూనె ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఏ కూర చేయాలన్నా నూనె తప్పనిసరి ...13లో

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



ఇటీవల అన్ని రకాల వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ధరల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలి. నరేంద్ర మోడీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. నూనెపై ఎక్సైజ్ సుంకం గతంలో 12 శాతం ఉంటే 32 శాతానికి పెంచడంతో నూనె ధరలు అమాంతం పెరిగాయి. ఎన్నికల సమయంలో ధరలు తగ్గించి ఆ తర్వాత పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్నారు.

- అంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు

హైడ్రా టార్గెట్ భూబకాసురులే

- భారీ వర్షాలు వచ్చి హైదరాబాద్ మునిగిపోవాలా? : బీఆర్ఎస్‌కు మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైడ్రా లక్ష్యం భూబకాసురులేననీ, మూసి పరిసర ప్రాంతాల్లో ఒక్క గుడిసె కూడా కూల్చలేదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మల్లన్నసాగర్ నిర్వాసితులను సీఆర్పీఎఫ్ జవాన్లతో నిర్బంధించిన సిరిసిల్ల వీరుడు కేటీఆర్ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. సోషల్ మీడియాను బీఆర్ఎస్, బీజేపీ సోషల్ సెన్స్ లేకుండా వాడుతున్నాయని దుయ్యబట్టారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకప్పుడు 3,500 చెరువులతో కళకళలాడిన హైదరాబాద్ ఇప్పుడెలా ఉందని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ పాలనలో కూడా కబ్జా జరిగి ఉండొచ్చనీ, అయితే బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో విధ్వంసం పెరిగిందని తెలిపారు. హైదరాబాద్‌కు భారీ వర్షాలు వస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. జల ప్రళయంతో కొట్టుకుపోవాలని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. గుట్టలన్ని మాయం చేసి రియల్ ఎస్టేట్ చేస్తున్నారని విమర్శించారు. ప్రక్షాళనలో పేదలు నష్టపోతే నష్టపరిహారం ఇస్తామని తెలిపారు. మూసీ ప్రక్షాళన జరగపోతే రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు కూడా ప్రమాదమేనని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పెయిడ్ ఆర్టిస్టులు ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు. ప్రక్షాళన జరిగితే కోట్లాది రూపాయల పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ పాతనగరాన్ని మాజీ సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.

జేఎల్ తుది ఫలితాలు ప్రకటించాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టుల భర్తీకి సంబంధించిన తుది ఫలితాలను ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. 1,392 జూనియర్ లెక్చరర్ల పోస్టుల నియమకానికి 2022, డిసెంబర్‌లో టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో రాతపరీక్షలను నిర్వహించారని పేర్కొన్నారు. అదే ఏడాది అక్టోబర్ ప్రాథమిక 'కీ'ని విడుదల చేశారని వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిపుణుల కమిటీ సూచనల మేరకు తుది కీని విడుదల చేశారని తెలిపారు. జులైలో జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎల్)ను ప్రకటించారని పేర్కొన్నారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన కూడా పూర్తయ్యిందని తెలిపారు. అప్పటి నుంచి తుది ఫలితాల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని వివరించారు. 15 ఏండ్ల తర్వాత జేఎల్ పోస్టులకు నియమకాలు జరుగుతున్నాయనీ, ఇంటర్ విద్య బలోపేతం చేయడానికి టీజీపీఎస్సీ జేఎల్ పోస్టులకు తుది ఫలితాలు ప్రకటించి పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కూల్చివేతలే లక్ష్యమా? హైకోర్టునూ కూల్చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)



రేపు మీరే బదిలీలు ఇతర చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లకు పంపాల్సిన పరిస్థితులు వస్తాయని కూడా వ్యాఖ్యానించింది. శని, ఆదివారాలు, సెలవులు, సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చారని ప్రశ్నించింది. హైడ్రా పనితీరు సంతృప్తికరంగా లేదని చెప్పింది. హైడ్రా ఏర్పాటైనప్పటి నుంచి కూల్చివేతలే లక్ష్యంగా పనిచేస్తోందని తప్పుపట్టింది. సర్వే చేసినప్పుడు పిటిషనర్లకు ఎందుకు నోటీసు ఇవ్వలేదని ప్రశ్నించింది. ఉరి వేసే ముందు కూడా చివరి కోరిక అడుగుతారు కదాని ప్రశ్నించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా చర్యలు తీసుకోవడం సబబు కాదని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జరిగిందని అభిప్రాయపడింది. నోటీసులకు వారు ఇచ్చిన వివరణ పరిశీలించరా? కోర్టు ఉత్తర్వులనూ పట్టించుకోరా? స్టేలు ఉన్నా చర్యలు ఎలా చేపడతారు? ఐదు నెలలు ఆగినవారు మరో రెండు రోజులు ఆగకుండా కూల్చివేతలు చేపడతారా? అని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సర్వే చేసే విధానం ఏమిటో తెలుసా? భవన నిర్మాణ అనుమతులు రద్దు, విద్యుత్తు కనెక్షన్ రద్దులపై పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించి స్టేలు పొందిన విషయం కూడా తెలియకుండా ఉన్నారా? కోర్టు అంటే లెక్కలేదా? అని ప్రశ్నించింది. స్టే ఉత్తర్వులను తొలగించకుండా చర్యలు ఎలా చేపడతారన్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. పిటిషనర్లు 15న లేఖ రాస్తూ 15 రోజులు గడువు కోరినప్పటికీ ఏప్రిల్ 18న వివరణ ఇచ్చారనీ, దాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు అని అడిగింది. 48 గంటల్లో భవనాన్ని ఖాళీ చేయాలని 20న నోటీసు ఇచ్చినపుడు 48 గంటల సమయం కూడా ఇవ్వకుండా ఆదివారం ఎలా కూల్చివేతలు చేపడతారని ప్రశ్నించింది. శని, ఆదివారాలు కూల్చొద్దనే హైకోర్టు ఫుల్ బెంచ్ ఉత్తర్వులను చదివారా? అన్ని రకాలుగా స్టేలున్నపుడు వాటిని తొలగించకముందే మీరెలా చర్యలు తీసుకుంటున్నారు? అన్ని నోటీసులు ఒకే రోజు ఇచ్చి చర్యలు చేపడతారా? ఇదేనా చట్టం? ఇన్ని ఉల్లంఘనలకు ఎందుకు పాల్పడాల్సి వస్తోంది? నిబంధనలకు విరుద్ధంగా వెళ్లాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారా? అలాగైతే చెప్పండి ఆయన్ని పిలిపించి వివరణ అడుగుతాం..అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. కోర్టు ఉత్తర్వులు అమలు చేయనపుడు జైలుకు పంపితే అప్పుడు తెలుస్తుంది అంటూ చురకలు అంటించింది.

రంగనాథ్‌పై ప్రశ్నల వర్షం

తహసీల్దార్ లేఖ రాస్తే నిబంధనలను పరిశీలించకుండా గుడ్డిగా యంత్రాలను పంపేస్తారా? అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. హైకోర్టు, చార్మినార్‌లను కూల్చివేయడానికి యంత్రాలను పంపాలని అడిగితే పంపుతారా అంటూ నిలదీసింది.

పేట్ బషీరాబాద్‌లోని ప్రభుత్వ స్థలంలో పోలీసు స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలున్నాయనీ, వాటిని కూల్చివేసి తరువాత సామాన్యుల ఇండ్ల వద్దకు వస్తారా? అంటూ ప్రశ్నించింది. ఆదివారం కూల్చివేతలు చేపట్టరాదన్న విషయం తహసీల్దార్‌కు తెలియకపోతే ఉన్నతాధికారిగా మీకు తెలియదా అంటూ నిలదీసింది. తమది సమన్వయం చేసే ఏజెన్సీ మాత్రమేనని, తహసీల్దార్ లేఖ రాయడంతోనే యంత్రాలను పంపామని రంగనాథ్ చెప్పే ప్రయత్నం చేయగా అడ్డుకుంది.

మీడియా సమావేశాలు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యమా అని ప్రశ్నించింది. పిటిషనర్లు కొనుగోలు చేసిన సేల్‌డీడ్, నిర్మాణానికి అనుమతులు, నీరు, విద్యుత్తు కనెక్షన్‌లు అన్నీ ఉన్నా కూల్చివేయడం ఏంటని ప్రశ్నించింది. ప్రభుత్వ ఆస్తులను రక్షించే విధానం ఇదేనా అంటూ నిలదీసింది. హైడ్రా పనితీరును తప్పుబట్టింది.

జీవోలో సీఎం, మంత్రులతో కూడిన కమిటీ ఉందనీ, అయితే అందులో ఎలాంటి విధానం లేదని పేర్కొంది. ఒక శాఖకు మరో శాఖకు మధ్య సమన్వయం ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించింది. రాత్రికి రాత్రే పరిస్థితుల్లో మార్పులు తీసుకురావాలంటే ఎలా అని నిలదీసింది. వాదనల తర్వాత అన్ని పిటిషన్లల్లో స్టేటస్‌కో కొనసాగిస్తూ మధ్యంతర ఉత్తర్వులను న్యాయమూర్తి జారీ చేశారు. కౌంటర్లు దాఖలు చేయాలని తహసీల్దార్, హైడ్రా కమిషనర్లను ఆదేశించారు. తదుపరి విచారణను అక్టోబరు 15కు వాయిదా వేశారు.

హైడ్రాను స్వాగతిస్తున్నాం

పునరావాసం తర్వాతే పేదల ఇండ్లు తొలగించండి

- ఆర్డినెన్స్ ద్వారా పార్లమెంటు రద్దుకు బీజేపీ కుట్ర : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైడ్రాను స్వాగతిస్తున్నామనీ, అయితే మూసీతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్న పేదల ఇండ్లను తొలగించే ముందు వారికి పునరావాసం కల్పించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చట్టబద్ధంగా ఏ పని చేసినా సీపీఐ సమర్థిస్తుందనీ, కానీ పేదలకు పునరావాసం కల్పించకుండా వారిని తరలించడం సమంజసం కాదని అన్నారు. చెరువులు, కుంటలు ఉంటే భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో పాటు కాలుష్యాన్ని సైతం నివారించగలుగుతామనీ, అందుకే వాటిని పరిరక్షించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. వాటిని ఆక్రమించి నిర్మించిన వాణిజ్య భవనాలు విల్లాలను తక్షణమే కూల్చివేయాలని ప్రభుత్వానికి సూచించారు. అలాగే వికారాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఉన్న ఫిరంగి నాలాపై ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టవిరుద్ధంగా ఆర్డినెన్స్ తెచ్చి పార్లమెంటు రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నదని విమర్శించారు. వన్ నేషన్, వన్ రేషన్, వన్ ఓట్, వన్ ఎలక్షన్ పేరుతో ప్రధాని మోడీ అప్రజాస్వామిక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, బీహార్ సీఎం నితీశ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణాలకు అభ్యంతరం చెప్పడం లేదనీ, అయితే అవి అందరికీ ఉపయోగపడేలా నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి భూములను సేకరించి చివరికి వారికే దారిలేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్ల నిర్మాణ సమయంలోనే రైతులు తమ పొలాలు, చేన్లకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ పాల్గొన్నారు.

దసరాకు ఆరువేల ప్రత్యేక బస్సులు

- హైదరాబాద్ శివార్ల నుంచే...
- ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరుకు సర్వీసులు
- కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు : టీజీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఆరువేల ప్రత్యేక బస్సుల్ని నడుపుతున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా శివారు ప్రాంతాల నుంచే ఈ ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించామన్నారు. సొంతూళ్లకు వెళ్లేవారి కోసం ఎమ్‌జీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, సంతోష్‌నగర్, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల నుంచి స్పెషల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు బస్సులను నడిపేలా ప్రణాళికలు చేశామన్నారు. దసరా పండుగకు ప్రత్యేక బస్సులు, ప్రయాణీకులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సోమవారంనాడాయన క్షేత్ర స్థాయి అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. గత ఏడాది దసరాతో పోల్చితే, ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు వల్ల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని తెలిపారు. ప్రయాణీకుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని వివరించారు. అక్టోబర్ 12న దసరా పండుగ ఉన్నందున 9, 10, 11 తేదిల్లో ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందనీ, ఆయా రోజుల్లో అవసరాలకు అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను నడపాలని అధికారుల్ని ఆదేశించారు. రద్దీ రోజుల్లో నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి ఆర్టీసీ బస్సులకు టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక లైన్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్బీ నగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ ఏడాది దసరాకు కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో కాలుష్యరహిత కొత్త ఎలక్ట్రిక్ సూపర్‌లగ్జరీ బస్సులను వినియోగించుకోవాలన్నారు. దసరా, మహాలక్ష్మి పథకంతో పాటు అక్టోబర్ నెలలో 11 శుభముహూర్తాలు కూడా ఉన్నాయనీ, ఆ రద్దీని కూడా దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. పోలీస్, రవాణా, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సంస్థ అధికారిక వెబ్‌సైట్ "స్రంటీఎబం.ఙఅలో ముందస్తు రిజర్వేషన్లు చేసుకోవాలని సూచించారు. దసరా స్పెషల్ సర్వీసుల పూర్తి సమాచారం కోసం కాల్ సెంటర్ నెంబర్లు 040-69440000, 040-23450033లో సంప్రదించాలని కోరారు.

మిథున్ చక్రవర్తికి దాదా సాహెబ్ ఫాల్కే



హైదరాబాద్ :చలన చిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాకరమైన 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారం ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తికి లభించింది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ సోమవారం ఒక ప్రకటనలో ఈ సంగతి వెల్లడించింది. అక్టోబర్ 8న జరిగే జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనకు ఈ అవార్డు అందజేయనున్నట్లు కేంద్ర, సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌లో తెలిపారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు తనకు దక్కడం ఎంతో గర్వంగా ఉందని మిథున్ సంతోషం వ్యక్తం చేశారు. దీనిపై తన స్పందన తెలియజేయడానికి మాటలు రావడం లేదు. ఈ అవార్డును నా కుటుంబానికి, ప్రపంచవ్యాప్తం గా ఉన్న అభిమానులకు అంకితం చేస్తున్నా అని మిథున్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మిథున్ చక్రవర్తి.. బాలీవుడ్‌లో అనేక చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. హీరోగానే కాకుండా సహాయనటుడు, విలన్‌గా కూడా ఆయన విశేషంగా రాణించాడు. 1976లో 'మృగాయ'తో నటుడిగా ఎంట్రీ ఇచ్చిన మిథున్ తొలి చిత్రంతోనే ఉత్తమ జాతీయ నటుడిగా ఎంపికయ్యాడు. 'ముక్తి', 'బన్సారీ', 'అమర్‌దీప్', 'కిస్మత్', 'వాంటెడ్', 'బాక్సర్', 'త్రినేత్ర', 'భీష్మ', 'సుల్తాన్', 'గురు', 'కిక్', 'బాస్', డిస్కోడాన్సర్ వంటి చిత్రాలు ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. హిందీ, బెంగాలీ చిత్రాలతోపాటు కన్నడ, తెలుగు, ఒరియా, భోజ్‌పురి చిత్రాల్లోనూ ఆయన నటించారు. 'ఐ యామే డిస్కో డాన్సర్' అన్న పాట ఆయనకు దేశవిదేశాల్లో మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఈ ఏడాది ఆరంభంలో ఆయనకు పద్మభూషణ్ అవార్డు లభించిన సంగతి తెలిసిందే.

సైబర్ నేరస్థులకు సీబీఐ ఉచ్చు

- హైదరాబాద్‌లో ఐదుగురు అరెస్ట్
- దేశంలోని నాలుగు ప్రాంతాల్లో 170 మంది నేరస్థుల కోసం వేట
- ఇంటర్‌పోల్ సమాచారంతో రంగంలోకి అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

దేశంలో హైదరాబాద్‌తో సహా నాలుగు ప్రాంతాల్లో సైబర్ నేరస్థులకు సీబీఐ ఉచ్చు బిగించింది. హైదరాబాద్, వైజాగ్, పూణే, అహ్మదాబాద్ కలిపి మొత్తం 170 మంది సైబర్ నేరస్థుల కోసం సీబీఐ అధికారులు వేటను కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయంగా ఇంటర్‌పోల్ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ నేరస్థులను పట్టుకోవటానికి సీబీఐ అధికారులు వ్యూహరచన చేసి ఏకకాలంలో రంగంలోకి దిగారు. ఈ సైబర్ నేరస్థులంతా అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియాతో పాటు మరికొన్ని యూరప్ దేశాలకు చెందినవారిని మోసగించి కోట్లాది రూపాయలను దండుకున్నట్టు ఇంటర్‌పోల్ నుంచి సీబీఐకి సమాచారమందింది. ఈ మేరకు రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు హైదరాబాద్‌లో తీవ్రంగా గాలించి ఐదుగురు సైబర్ నేరస్థులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, వైజాగ్‌లో మరో 11 మందిని కూడా సీబీఐ అధికారులు పట్టుకున్నారు. మొత్తమ్మీద, నాలుగు ప్రాంతాలు కలిపి 26 మంది సైబర్ నేరస్థులను కస్టడీలోకి తీసుకున్నట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఇంకా మిగతావారి కోసం వేట కొనసాగుతున్నదని అధికార వర్గాలు చెప్పాయి.

సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణను అరెస్ట్ చేసిన ఈడీ

- చంచల్‌గూడ జైలుకు తరలింపు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో ప్రీలాంచ్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం నడిపించి, బాధితులకు కోట్లాది రూపాయల కుచ్చుటోపీ తొడిగిన సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణను అరెస్ట్ చేసినట్టు సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రకటించారు. ఆదివారం అదుపులోకి తీసుకున్న లక్ష్మీనారాయణను విచారించిన ఈడీ అధికారులు సోమవారం నాంపల్లిలోని ఈడీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. కేసును విచారించిన న్యాయమూర్తి.. లక్ష్మీనారాయణకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌ను విధించారు. ఈ మేరకు నిందితుడిని ఈడీ అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, లక్ష్మీనారాయణ కారణంగా మోసపోయిన బాధితులకు న్యాయం చేకూర్చాలని వారి తరఫు న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దాదాపు రూ.3 వేల కోట్లకు పైగా మొత్తాన్ని బాధితుల నుంచి వసూలు చేసి, మోసం చేసిన నిందితుడి నుంచి తిరిగి వారి డబ్బులను వాపసు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకోసం, లక్ష్మీనారాయణకు చెందిన ఆస్తులను జప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.

'జమిలీ' కోసం మూడు బిల్లులు

పార్లమెంట్ సమావేశాలలో ప్రవేశపెట్టే అవకాశం | ప్రస్తుత సంఖ్యాబలంతో ఆమోదం కష్టమే



న్యూఢిల్లీ : మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు 'ఒకే దేశం... ఒకే ఎన్నిక' ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ వారం రోజుల క్రితం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి రాబోయే పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో కానీ లేదా వచ్చే సంవత్సరంలో జరిగే బడ్జెట్ సమావేశాలలో కానీ మూడు బిల్లులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిపి, ఆ తర్వాత వంద రోజుల లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా రాజ్యాంగంలో అవసర మైన సవరణల కోసం ప్రభుత్వం రెండు బిల్లులు ప్రవేశ పెడుతుంది.

ఇవి కూడా...

మూడవ బిల్లు సాధారణమైనది. కేంద్ర పాలిత ప్రాంతాలు, వాటి శాసనసభలకు సంబంధించి ఈ బిల్లు ద్వారా నిబంధనలను సవరిస్తారు. గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ ఆఫ్ ఢిల్లీ చట్టం-1991, గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెర్రిటరీస్ యాక్ట్-1963, జమ్మూకాశ్మీర్ రీఆర్గనైజేషన్ యాక్ట్-2019ని కూడా సవరించాల్సి ఉంటుంది.

2029 నుండే అమలు చేస్తే...

తొలి దశలో లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు, తదుపరి దశలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని కోవింద్ కమిటీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. రెండు రాజ్యాంగ సవరణ బిల్లుల ద్వారా రాజ్యాంగానికి పదిహేను సవరణలు తీసుకురావాలని కోవింద్ కమిటీ సూచించింది. కమిటీ ప్రతిపాదనలను 2029 నుండే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన పక్షంలో 17 రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మూడు సంవత్సరాల లోపే ముగిసిపోతుంది.

సవరణలకు మద్దతు ఏది?

రాజ్యాంగంలోని మూడు అధికరణలకు సవరణలు చేయాలని కోవింద్ కమిటీ ప్రతిపాదించింది. ప్రస్తుతం అమలులో ఉన్న అధికరణలకు కొత్తగా 12 ఉప క్లాజులు చేర్చాలని, కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల శాసనసభలకు సంబంధించిన మూడు చట్టాలను సవరించాలని సూచించింది. మొత్తంమీద 18 సవరణలు, చేర్పులు చేయాల్సి ఉంటుంది. రాజ్యాంగ సవరణ బిల్లులు సభ ఆమోదం పొందాలంటే కనీసం మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమవుతుందని నిపుణులు తెలిపారు. అంటే ప్రభుత్వానికి 362 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే ప్రస్తుతం సభలో ఎన్డీఏకు 292 మంది సభ్యుల బలం మాత్రమే ఉంది. అనేక ప్రతిపక్షాలు, బీజేడీ వంటి తటస్థ పార్టీలు బిల్లులను వ్యతిరేకిస్తున్నందున ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పేలా లేవు.

స్థానిక ఎన్నికల కోసం...

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు ముగిసిన తర్వాత వంద రోజులలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి వీలుగా తీసుకురావాల్సిన రాజ్యాంగ సవరణ బిల్లుకు మాత్రం కనీసం యాభై శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్లతో సంప్రదించి కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాలను రూపొందిస్తుంది. దీనికి సంబంధించి కూడా రాజ్యాంగ నిబంధనలు సవరించేందుకు బిల్లు ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఒకేసారి పోలింగ్ నిర్వహిస్తారు. ఇందుకోసం రాజ్యాంగంలో ఆర్టికల్ 324-ఏను చేర్చాలి.

సవరణలు...చేర్పులు

కమిటీ సిఫార్సుల మేరకు...'అప్పాయింటెడ్ తేదీ'కి సంబంధించి ఆర్టికల్ 82-ఏ సవరించి, అందులో సబ్-క్లాజ్ (1)ను చేర్చాల్సి ఉంటుంది. అలాగే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల పదవీకాలాలు ముగియడానికి సంబంధించి ఆర్టికల్ 82-ఏలో సబ్-క్లాజ్ (2)ను చేర్చాలి ఉంటుంది. లోక్‌సభ పదవీకాలం, రద్దుకు సంబంధించి ఆర్టికల్ 83 (2)ను సవరించి, అందులో కొత్త సబ్-క్లాజులు (3), (4)లను చేర్చాలి. బిల్లులో రాష్ట్రాల శాసనసభల రద్దుకు సంబంధించిన నిబంధనలను కూడా ఉంటాయి. 'ఒకేసారి ఎన్నికలు' అనే పదాన్ని చేర్చడానికి వీలుగా ఆర్టికల్ 327ను సవరించాలి. అయితే ఈ బిల్లును కనీసం యాభై శాతం రాష్ట్రాలు ధృవీకరించాలన్న నిబంధన ఏదీ లేదని కమిటీ తెలిపింది.



నిర్మలమ్మపై ఎఫ్ఐఆర్

ఎన్నికల బాండ్ల కేసులో కర్నాటక కోర్టు ఆదేశం

బెంగళూరు : ఎన్నికల బాండ్ల పథకానికి సంబంధించి వచ్చిన ఫిర్యాదును పురస్కరించుకొని కర్నాటకలోని ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు సెక్షన్ 384 (దోపిడీ), 120-బీ (క్రిమినల్ కుట్ర) రెడ్ విత్ 34 కింద ఆర్థిక మంత్రి, ఈడీ అధికారులు, కేంద్ర రాష్ట్ర స్థాయిలలోని బీజేపీ ఆఫీస్ బేరర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఎన్నికల బాండ్ల పేరుతో ఆర్థిక మంత్రి దోపిడీకి పాల్పడ్డారని, ఎనిమిది వేల కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక ప్రయోజనం పొందారని జనాధికార సంఘర్ష పరిషత్ (జేఎస్‌పీ) సహ అధ్యక్షుడు ఆదర్శ్ ఆర్ అయ్యర్ ఫిర్యాదు చేశారు. ఈడీ అధికారుల రహస్య సాయం, మద్దతుతో నిర్మలా సీతారామన్ కేంద్ర, రాష్ట్ర స్థాయిలలోని ఇతరుల ప్రయోజనాల కోసం కోట్లాది రూపాయలు ఆర్జించారని అయ్యర్ తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ దోపిడీ రాకెట్‌తో వివిధ స్థాయిలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

మసీదులు, దర్గాలు కూల్చివేత

• పలు మతాల పవిత్ర నిర్మాణాలు, ఇండ్లు నేలమట్టం • ఆక్రమణలంటూ బలవంతపు తొలగింపులు

- గుజరాత్‌లో గిర్ సోమ్‌నాథ్ జిల్లా యంత్రాంగం తీరు
- పటిష్ట బందోబస్తు నడుమ సోమ్‌నాథ్ ఆలయం దగ్గర అధికారుల చర్యలు
- నేలమట్టమైనవాటిలో కొన్ని వందల ఏండ్ల పురాతనమైనవి
- బీజేపీ సర్కారు చర్యలపై కాంగ్రెస్, ముస్లిం వర్గం నేతల ఆందోళన



గాంధీనగర్ : ఆక్రమణల పేరుతో గుజరాత్‌లోని గిర్ సోమ్‌నాథ్ జిల్లా యంత్రాంగం ప్రభాస్ పటాన్ ప్రాంతంలోని సోమ్‌నాథ్ ఆలయం వద్ద కూల్చివేత డ్రైవ్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా తొమ్మిది మసీదులు, పవిత్ర కట్టడాలు, 45 ఇండ్లను నేల మట్టం చేసింది. ఇందులో కొన్ని వందల ఏండ్ల చరిత్రను కలిగి ఉన్న నిర్మాణాలు కూడా ఉండటం గమనార్హం. ఈ కూల్చివేత కార్యక్రమాన్ని ఆరు గంటలకు పైగా కొనసాగించినట్టు జిల్లా కలెక్టర్ డి.డి జడేజా తెలిపారు. రూ.60 కోట్ల విలువ చేసే 15 హెక్టార్లలో ఆక్రమణలు తొలగించినట్టు చెప్పారు. అక్రమంగా నిర్మించిన 40 రూమ్‌లు కలిగిన లాడ్జిని ఈ కూల్చివేత కార్యక్రమంలో నేలమట్టం చేసినట్టు తెలిపారు. శ్రీ సోమ్‌నాథ్ ట్రస్ట్‌కు చెందిన భూభాగంలోని నిర్మాణాలను కూల్చివేసినట్టు జిల్లా కలెక్టర్ చెప్పారు. ఆక్రమణలకు వ్యతిరేకంగా పలు కోర్టు ఆదేశాల ఆధారంగా అక్రమ నిర్మాణాలను తొలగించినట్టు వివరించారు. కూల్చివేతలు చట్టపరంగానే జరిగాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా జిల్లా యంత్రాంగం సోమ్‌నాథ్, వెరావల్ పట్టణాల్లో జిల్లా యంత్రాంగం పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది. వందలాది మంది పోలీసులను మోహరించినట్టు జిల్లా ఎస్పీ మనోహర్‌సిన్హా జడేజా తెలిపారు. ఒక లొకేషన్లో కూల్చివేత డ్రైవ్‌లో భాగంగా స్థానికుల నుంచి ప్రతిఘటన ఎదురైందనీ, దీంతో పోలీసులు స్వల్ప బల ప్రయోగం చేశారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 150 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ చర్య అన్యాయం
గుజరాత్ మైనారిటీ కోఆర్డినేషన్ కమిటీ

కూల్చివేతలపై గుజరాత్ మైనారిటీ కోఆర్డినేషన్ కమిటీ స్పందించింది. ఈ మేరకు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు లేఖ రాసింది. ముస్లింలకు న్యాయం చేయాలని సీఎంను కోరింది. ప్రభాస్ పటాన్‌లోని పలు పురాతన దర్గాలైన హాజీ మాగ్రోల్ దదర్గా, షాహ్ సిలార్ దర్గా, గరీబ్ షా దర్గా, జాఫర్ ముజఫర్ దర్గాలను జిల్లా యంత్రాంగం కూల్చివేసిందని కమిటీ ఆరోపించింది. హాజీ మాగ్రోల్ షా దర్గా జునాగఢ్ రాష్ట్ర రెవెన్యూ రికార్డుల్లో 1924లో నమోదైందని లేఖలో పేర్కొన్నది. కేసులు హైకోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్నప్పటికీ.. కూల్చివేత డ్రైవ్‌ను చేపట్టారనీ, ఇది అన్యాయమైన చర్య అని కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. తమ అనుమతి లేకుండా దేశవ్యాప్తంగా అక్టోబర్ 1 వరకు కూల్చివేతలను నిలుపుదల చేస్తూ సెప్టెంబర్ 17న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను గుజరాత్ మైనారిటీ కోఆర్డినేషన్ కమిటీ లేఖలో ప్రస్తావించింది.

కూల్చివేతలు చట్టవిరుద్ధం : కాంగ్రెస్

కూల్చివేత చర్యలపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్య చట్టవిరుద్ధమని గుజరాత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నూస్రత్ పంజా ఆరోపించారు. కూల్చివేతలు జరిగిన కట్టడాలకు 700, 800 ఏండ్ల చరిత్ర ఉన్నదనీ, అవి వక్ఫ్ ఆస్తులుగా రక్షించబడు తున్నాయని నూస్రత్ అన్నారు. అయితే, న్యాయస్థానం తీర్పులను కలెక్టర్, ప్రభుత్వం తప్పుగా ఆపాదించి ఈ నిర్మాణాలను కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వెరవల్ న్యాయస్థానం ఆదేశాల మేరకు వక్ఫ్ ట్రిబ్యునల్ అక్టోబర్ 11న విచారణ చేపట్టే అవకాశమున్నదని తెలిపారు. బలవంతపు చర్యలకు వ్యతిరేకంగా రక్షణ కోరుతూ ఈ కేసులో కొందరు గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారనీ, అక్టోబర్ 8న న్యాయస్థానం విచారణకు తేదీని నిర్ణయించిందని నూస్రత్ గుర్తు చేశారు. అయితే, ఈ విచారణకు ముందుగానే జిల్లా కలెక్టర్ కూల్చివేతలకు ఆదేశాలిచ్చారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

కానరాని స్వచ్ఛ భారత్ !

- పట్టణాలలో పేరుకుపోతున్న చెత్త
- సవాలుగా మారుతున్న వ్యర్థాల తొలగింపు
- సగం యార్డులలో ప్రారంభం కాని తొలగింపు పనులు



న్యూఢిల్లీ : స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) అర్బన్-2లో భాగంగా పెద్ద నగరాలలోని డంపింగ్ యార్డులలో పేరుకుపోతున్న చెత్తను ఐదు సంవత్సరాలలో పూర్తిగా తొలగించి, ఆ ప్రదేశాలను తిరిగి ఉపయోగంలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ గడువు 2026తో ముగుస్తుంది. అంటే మరో రెండు సంవత్సరాల సమయం మాత్రమే మిగిలి ఉంది. అయినప్పటికీ యాభై శాతం డంపింగ్ యార్డులలోని చెత్తను నేటికీ తొలగించలేదు. ఇప్పటి వరకూ కేవలం 38 శాతం చెత్తను మాత్రమే తొలగించడం జరిగింది. ఇవి ప్రైవేటు సంస్థలో, ఎన్‌జీఓలో చెబుతున్న లెక్కలు కావు. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని బయటపెట్టాయి.

గడువు సమీపిస్తున్నా...

కేంద్ర ప్రభుత్వం 2021లో ఎస్‌బీఎం అర్బన్-2ను ప్రారంభించింది. 2025-26 నాటికి దేశంలోని 2,400 డంపింగ్ యార్డులలో చెత్తను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఎస్‌బీఎం డాష్‌బోర్డును గత నెల 27న పరిశీలించగా తేలిందేమంటే పది లక్షలకు పైబడిన జనాభా కలిగిన నగరాలలో 69 డంపింగ్ యార్డులు ఉన్నాయి. వీటిలో 35 యార్డులలో మాత్రమే చెత్తను తొలగించారు. 3,354 ఎకరాలలో విస్తరించి ఉన్న ఈ 69 యార్డులలో 1,258 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను నింపేశారు. ఇప్పటి వరకూ 1,171 ఎకరాలలోని 475 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మాత్రమే తొలగించారు. కేంద్రం నిర్దేశించుకున్న గడువు రెండు సంవత్సరాల కంటే తక్కువగానే ఉంది. గడువు ముగిసే లోగా మిగిలిన 65 శాతం భూమిలోని 62 శాతం చెత్తను తొలగించడం సవాలుతో కూడిన పనే. దేశంలోని యార్డులలో డంప్ చేసిన మొత్తం చెత్తలో 57 శాతం ఈ 69 స్థలాలలోనే ఉండడం గమనార్హం.

ఇదీ పరిస్థితి...

దేశంలోని వివిధ నగరాలలో 2,421 డంపింగ్ యార్డులు 14,822 ఎకరాలలో విస్తరించి ఉన్నాయి. వీటిలో 2,211 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉంది. ఇందులో 41 శాతం చెత్తను తొలగించి 30 శాతం స్థలాన్ని తిరిగి వినియోగంలోకి తెచ్చారు. ఇరవై శాతం డంపింగ్ యార్డులలోని (474) చెత్తను పూర్తిగా తొలగించారు. ముంబయిలోని దియోనర్ డంపింగ్ యార్డు దేశంలోనే అతి పెద్దది. దీని విస్తీర్ణం 296.5 ఎకరాలు. దేశంలోని ఇలాంటి ప్రదేశాలలో నిల్వ చేసిన మొత్తం చెత్తలో ఇక్కడే 9 శాతం చెత్త పేరుకుపోయి ఉంది. ఇప్పటి వరకూ అక్కడి నుండి చెత్తను తొలగించడం కానీ, ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయడం కానీ జరగలేదు. రెండో అతి పెద్ద డంపింగ్ యార్డు అహ్మదాబాద్‌లోని పిరానాలో ఉంది. ఇప్పుడు అక్కడ చెత్తను తొలగిస్తున్నారు. చెత్త తొలగింపు 48 శాతం పూర్తయింది. దేశంలో మూడవ, నాలుగవ అతి పెద్ద డంపింగ్ యార్డులు రాజధాని ఢిల్లీలోనే ఉన్నాయి. మూడవ అతి పెద్ద డంపింగ్ యార్డు ఘాజీపూర్‌లో 26 శాతం, నాలుగో అతి పెద్ద డంపింగ్ యార్డు భలాస్వాలో 40 శాతం చెత్తను తొలగించారు. గుట్టలు గుట్టలుగా, ఎత్తుగా పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేశంలో ఐదవ అతి పెద్ద డంపింగ్ యార్డు ముంబయిలోని ములంద్‌లో ఉంది. అక్కడ 40 శాతం చెత్తను తొలగించినప్పటికీ ఆ స్థలాన్ని ఇంకా వినియోగంలోకి తేలేదు. ఆరవ అతి పెద్ద యార్డు అయిన చెన్నయ్‌లోని కొడంగయూర్‌లో ఎక్కడ ఉన్న చెత్త అక్కడే ఉంది. దానిని తొలగించడం కానీ, ఆ ప్రదేశాన్ని బాగు చేయడం కానీ జరగలేదు. ఢిల్లీలో మూడవది, దేశంలో అతి పెద్ద ఏడవ డంపింగ్ యార్డు అయిన ఓక్లాలో 56 శాతం చెత్తను తొలగించారు కానీ అక్కడి స్థలాన్ని ఖాళీ చేయలేదు.

712 యార్డుల సమాచారమే లేదు

గడచిన రెండు సంవత్సరాల కాలంలో 20 శాతం డంపింగ్ యార్డులలో చెత్తను పూర్తిగా తొలగించామని, ఇతర ప్రాంతాలలో పని వేర్వేరు దశలలో ఉన్నదని కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఇటీవల తెలిపారు. రాబోయే రెండు సంవత్సరాలలో పని పూర్తవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌బీఎం అర్బన్ 2.0 కింద నిధులు పొందాలంటే నగరాల నుండి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు కార్యాచరణ ప్రణాళికలు పంపాల్సి ఉంటుంది. యార్డు లలో చెత్తను తొలగించి, ఆ ప్రదేశాన్ని తిరిగి ఉపయోగిం చుకునేందుకు అనువుగా మార్చాల్సి ఉంటుంది. ఎస్‌బీఎం అందించిన సమాచారం ప్రకారం 1,235 ప్రదేశాలలో చెత్త తొలగింపు కొనసాగుతోంది. మరో 682 ప్రణాళికలకు ఆమోదం లభించింది. ప్రభుత్వ, ఇతర ఆర్థిక వనరులను ఉపయోగించి 49 ప్రదేశాలలో చెత్తను తొలగించారు. మిగిలిన 712 ప్రదేశాలకు సంబంధించి డాష్‌బోర్డులో ఎలాంటి సమాచారం లేదు.

పద్ధతులు, ప్రణాళిక సరిగా లేవు

ప్రణాళిక ప్రక్రియ సరిగా లేదని ఓ నిపుణుడు వ్యాఖ్యానించారు. 'దేశంలోని పట్టణ ప్రాంతాలలో చెత్తను తొలగించడం సవాలుగా మారింది. స్వచ్ఛ భారత్ మిషన్‌లో గణనీయ పురోగతి కన్పిస్తున్నప్పటికీ ఇంకా అనేక ప్రాంతాలలో భారీగా చెత్త పేరుకొని ఉంది. పర్యావరణ, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. చెత్తను డంప్ చేయడానికి తగిన స్థలం కూడా అందుబాటులో ఉండడం లేదు. చెత్త తొలగింపునకు అనుసరిస్తున్న పద్ధతులు సరిగా లేవు. సరైన ప్రణాళికలను కూడా రూపొందిం చడం లేదు' అని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎకానమీలో డిప్యూటీ ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేస్తున్న త్రిభువన్ సింగ్ బిషత్ తెలిపారు. ఓ వైపు చెత్తను తొలగిస్తుంటే మరో వైపు కొత్తగా చెత్తను తెచ్చి ఆ ప్రదేశాలలో కుమ్మరిస్తున్నారని, ఇది పెను సవాలుగా మారిందని ఆయన చెప్పారు. కొత్తగా వచ్చే చెత్తను ప్రాసెస్ చేసేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఎంచు కోకపోతే పరిస్థితిలో మార్పేమీ ఉండదని అన్నారు. యార్డులలో లభిస్తున్న వ్యర్థాలను కంపోస్ట్‌గా తయారు చేయడాన్ని ఆయన తప్పుపడుతూ భారీ లోహాల కారణంగా కలుషితమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

రాజకీయాలకు దేవుళ్లనైనా

దూరంగా ఉంచండి

లడ్డూలో కల్తీ నెయ్యి వాడారనే బాబు వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం

రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తులు బహిరంగ ప్రకటనలు ఎలా చేస్తారు?

- దర్యాప్తులపై ప్రభావం పడదా?
- కల్తీ నెయ్యి వాడారనడానికి ఎలాంటి ఆధారాల్లేవు
- సీఎం, టీటీడీ సీఈవో ప్రకటనలకు పొంతన లేదు
- లక్షలాది మంది భక్తుల మనోభావాలతో కూడిన అంశం
- తదుపరి విచారణ గురువారానికి వాయిదా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో ప్రసాదంగా అందించే లడ్డూల తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహిరంగంగా చేసిన ఆరోపణలపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు విచారణలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి ఇలాంటి ప్రకటనలు చేయడంలోని ఔచిత్యాన్ని సుప్రీం ప్రశ్నించింది. కల్తీ నెయ్యి వాడినట్టు ల్యాబ్ నివేదిక ప్రాథమికంగా చూపలేదని ధర్మాసనం మౌఖికంగా గమనించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవు పలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలేమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని ప్రశ్నించింది.

తిరుపతి లడ్డూ వివాదంపై కోర్టు పర్యవేక్షణలో లేదా విచారణ జరిపించాలని వైసీపీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు సుబ్రమణ్యస్వామి, చరిత్రకారుడు విక్రమ్ సంపత్, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు దుష్యంత్ శ్రీధర్, సుదర్శన్ న్యూస్ యాంకర్ సురేష్ చవాన్కే దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ఈ వివాదంపై సీబీఐ విచారణ అవసరమా? లేదా అనేదానిపై కేంద్రం నుంచి సూచనలు కోరాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం కోరింది. అనంతరం కేసును గురువారానికి వాయిదా వేసింది.

కల్తీ జరిగిందనే వాదనకు ఎటువంటి ఆధారం లేదు

ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించినప్పుడు ఈ అంశంపై బహిరంగ ప్రకటన చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ జరిగిందనే వాదనను ధ్రువీకరించడానికి ఎటువంటి ఆధారం లేదని పేర్కొంది. లడ్డూలను తయారు చేయడానికి జంతువుల కొవ్వును ఉపయోగించినట్లు కచ్చితంగా నిర్ధారించడానికి సీఎం వద్ద ఏవైనా ఆధారాలున్నాయా? అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. రిపోర్టు ప్రకారం నెయ్యి నమూనాలు తిరస్కరించబడ్డాయని జస్టిస్ విశ్వనాథన్ అన్నారు. మీరు విచారణకు ఆదేశించినప్పుడు మీడియా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఏంటి? అని ప్రశ్నించారు. కనీసం దేవుళ్లనైనా రాజకీయాలకు దూరంగా ఉంచాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారించారా? లడ్డూలను టెస్టింగ్‌కు పంపారా? కల్తీ జరిగిందని గుర్తించిన తరువాత ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారా? అలా వినియోగించినట్టు ఆధారాలు లేవు. విచారణ జరగకుండానే లడ్డూ కల్తీ జరిగిందని ప్రకటన చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోంది. బహిరంగంగా మాట్లాడే ముందు వాటిని పరీక్షించడం అవసరం కాదా? అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రకటనలు చేయొద్దు

లడ్డూల తయారీ ప్రక్రియలో కల్తీ నెయ్యిని ఉపయోగించినట్టు చూపించడానికి ప్రాథమిక ఆధారాలు లేవని సుప్రీం పేర్కొంది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఇలాంటి ప్రకటన చేసి ఉండాల్సింది కాదని, విచారణ పెండింగ్‌లో ఉన్నప్పుడు బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులు అటువంటి ప్రకటనలు చేసినప్పుడు, అది సిట్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుంది? అని ప్రశ్నించింది. గంటపాటు సుదీర్ఘంగా విచారణ జరిగిన అనంతరం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. "ఈ పిటిషన్ మొత్తం ప్రపంచంలో నివసించే కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసే మనోభావాలకు సంబంధించినది. గత పాలనలో తిరుపతి లడ్డూల తయారీకి జంతువుల కొవ్వును ఉపయోగించారని రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ ప్రకటన చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు ముందే ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. అయితే విచారణకు ఆదేశించినప్పుడు ఉన్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తులు ప్రజల ముందు మాట్లాడటం సముచితం కాదని ప్రాథమికంగా భావిస్తున్నాం. అయితే టీటీడీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) కూడా ఇలాంటి కల్తీ నెయ్యిని ఉపయోగించలేదని ఒక ప్రకటన చేసినట్టు కొన్ని పత్రికా నివేదికలు కూడా చెబుతున్నాయి. ఈ విషయంలో సీఎంతో టీటీడీ సీఈవో విభేదించారు. ఇద్దరి ప్రకటనలకు పొంతన లేదు. టీటీడీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కల్తీ నెయ్యి అంశంపై ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదని పేర్కొంది. మీరు ఇంకా సమాధానం చెప్పలేదు. నెయ్యి వాడినట్లు చూపించడానికి ఏమీ లేదు" అని సుప్రీం పేర్కొంది.

అయితే సిద్ధార్థ లూథ్రా స్పందిస్తూ టీటీడీ సీఈవో కొన్ని ట్యాంకర్లకు సంబంధించి ఆ ప్రకటన చేశారని అన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం "మీరు మీ వైఖరిని ఉంచే ముందు సూచనలు తీసుకోండి. కల్తీ నెయ్యి ఉపయోగించారని చెప్పడానికి ఏమీ లేదు. అది మీ స్వంత వైఖరి కాదు. ఈ రోజు మీ వద్ద సమాధానం లేదు. బహిరంగ ప్రకటనలకు అసలు ఆధారమే లేదు" అని పేర్కొంది. ఫిర్యాదులు ఉన్నట్లయితే, ప్రతి ట్యాంకర్ నుంచి నమూనాలు తీసుకోవాల్సి ఉంటుందని, కొన్నింటి నమూనాలు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. జూన్‌లో నెయ్యిని టీటీడీకి సరఫరాదారుడు పంపారని, జూలై 4 వరకు అదే సరఫరాదారుడు ఎన్‌డీడీబీకి నమూనాలు పంపలేదని ఆయన అన్నారు. అయితే జులై 6, 12 తేదీల్లో సరఫరా చేసిన ట్యాంకర్లలో వచ్చిన నెయ్యి మాత్రమే ఎన్‌డీడీబీకి పంపామని తెలిపారు. జూలై 6 సరఫరా చేసిన రెండు ట్యాంకర్లలోనూ, జూలై 12న రెండు ట్యాంకర్లలోనూ నమూనాలను తీసుకున్నారని అన్నారు. అది కల్తీ నెయ్యి అని తేలిందని, జూలై 6, జూలై 12 తేదీల్లో సరఫరా చేసిన ట్యాంకర్లకు సంబంధించి టీటీడీ సీఈవో సీఈవో చేసిన ప్రకటన అని అన్నారు.

సుబ్రమణ్యస్వామి తరపు సీనియర్ న్యాయవాది రాజశేఖర్ రావు వాదనలు వినిపిస్తూ తాను కూడా ఒక భక్తుడినేని, ఇది ఆందోళన కలిగించే విషయమని అన్నారు. కల్తీ నెయ్యికి సంబంధించి చేసిన ప్రకటన చాలా చిక్కులు కలిగి ఉందని, అనేక ఇతర సమస్యలను లేవనెత్తుతుందని పేర్కొన్నారు. మత సామరస్యానికి భంగం కలిగిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ఏ ప్రాతిపదికన అలాంటి ప్రకటన చేశారనే దానిపై ఆందోళన చెందుతున్నామని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన వ్యక్తి బహిరంగ ప్రకటన చేసినప్పుడు ఆధారాలు ఉండాలని, రాజకీయ జోక్యాన్ని అనుమతి స్తారా? అని అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ స్పందిస్తూ వ్యతిరేకించారు. ఈ పిటిషన్లు విశ్వసనీయమైనవి కావని, ప్రస్తుత ప్రభుత్వంపై దాడి చేయడానికి మాత్రమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను నియమించిందని తెలిపారు.

రిపోర్టుపై రెండో అభిప్రాయం తీసుకోవాలి

ఎస్‌జీ తుషార్ మెహతా జోక్యం చేసుకుని ఇది విశ్వాసానికి సంబంధించిన విషయమని, ఎవరు బాధ్యులు, ఏ ఉద్దేశంతో చేశారో దీనిని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. "ల్యాబ్ రిపోర్టులో కొన్ని అంశాలు అనుమతించినట్లుగా లేవు. రిపోర్టు స్పష్టంగా లేదు. మీకు జులైలో నివేదిక వచ్చింది. సెప్టెంబర్ 18న బహిరంగంగా మాట్లాడారు. మీకు కచ్చితంగా తెలియకపోతే, మీరు ఎందుకు బహిరంగంగా మాట్లాడారు?" అని జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు. లడ్డూల తయారీలో ఆ నెయ్యి వాడారా? అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. దీనికి స్పందించిన టీటీడీ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా విచారణకు ఆదేశించామని తెలిపారు. ఇలాంటి నివేదిక వచ్చినప్పుడు , రెండో అభిప్రాయం తీసుకోవాలనే వివేకం లేదా? ఇందులో మొదటిది, ఈ నెయ్యి ఉపయోగించినట్లు రుజువు కాలేదు. రెండోది రెండో అభిప్రాయం తీసుకోలేదు" అని జస్టిస్ విశ్వనాథన్ అన్నారు. దీని ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తును కొనసాగించడానికి అనుమతించాలా? లేదా దర్యాప్తును వేరే ఏజెన్సీకి బదిలీ చేయాలా? అనేది తెలియజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు ధర్మాసనం సూచించింది.

సంపాదకీయం

పడిపోతున్న డిపాజిట్లు



తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందన్నట్టుంది కేంద్ర సర్కార్ తీరు. గత 10 ఏండ్లుగా ఫ్రీ మార్కెట్ పేరుతో స్టాక్ మార్కెట్లకు అనుకూలంగా ప్రచారం ప్రారంభించింది. బ్యాంకింగ్ రంగ సంక్షోభానికి ఇది దారితీసింది. మొన్న బడ్జెట్‌పై జరిగిన చర్చకు సమాధానమిస్తూ నిర్మలా సీతారామన్ మధ్య తరగతి ప్రజలు చాలా స్మార్ట్‌గా తయారయ్యారని, తమ సేవింగ్స్‌ను స్టాక్ మార్కెట్లకు, రియల్ ఎస్టేట్‌కు మళ్లిస్తున్నారని అన్నారు. వారికి లాభం చేకూరేలా లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ఇండెక్సేషన్ పునరుద్ధరిస్తున్నామని అన్నారు. అదే నేడు బ్యాంకులకు ఉరితాడయ్యింది. ఇదంతా దాచి 'బండికి రెండు చక్రాలు ఎలాగో బ్యాంకింగ్ రంగానికి డిపాజిట్లు, రుణాలు కూడా అటువంటివే. దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన బ్యాంకింగ్ రంగం సజావుగా సాగాలంటే డిపాజిట్లు, రుణాల నడక కూడా సక్రమంగా ఉండాలి' అంటూ కొద్ది రోజుల క్రితం రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ సుద్దులు వల్లిస్తున్నారు. బ్యాంకింగ్ రంగం డిపాజిట్ల సంక్షోభం ఎదుర్కొంటోందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో జరిగిన రిజర్వుబ్యాంకు బోర్డు సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని, డిపాజిట్లుగా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా ఇవ్వాలని ఉచిత సలహా పడేశారు. ఈ సమావేశానికి హాజరైన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ డిపాజిట్ల సేకరణ కోసం ఆకర్షణీయమైన, వినూత్న పథకాలను ప్రవేశ పెట్టాలని చెప్పడంతో పాటు, మరికొన్ని సూచనలు చేశారు. రిజర్వుబ్యాంకు తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం జూన్ 2023 నాటికి మొత్తం దేశీయ డిపాజిట్లు 4.8 శాతం తగ్గినట్టు నివేదిక పేర్కొంది. 1995 తరువాత వార్షిక డిపాజిట్లలో ఈ స్థాయి తగ్గుదల నమోదు కావడం ఇదే మొదటిసారి. గత ఏడాది 43.5 శాతంగా ఉన్న కరెంటు అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (సిఎఎస్ఎ) డిపాజిట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 41 శాతానికి తగ్గాయి. ఇది దాదాపుగా కరోనా వ్యాప్తికి ముందున్న సంవత్సరాలకు సమానం! రిజర్వు బ్యాంకుతో పాటు ఎస్‌బీఐ నివేదిక కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. రానున్న రోజుల్లో ఈ క్షీణత మరింతగా కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ స్థాయిలో బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గడానికి దారితీసిన అసలైన కారణాలను రిజర్వుబ్యాంకు గానీ, ప్రభుత్వంగానీ గుర్తించిందా అన్నదే అసలైన ప్రశ్న!

> ఇటీవల విడుదలైన ఒక నివేదిక సామాన్యులపై ధరాఘాతం ఏ స్థాయిలో ఉందో తెలియచేస్తోంది. దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో ఈ సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం నిత్యావసరాల కోసం 2022వ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ (త్రైమాసికం)లో చేసిన ఖర్చుకంటే ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 18 శాతం అధికంగా భారతీయ కుటుంబాలు ఖర్చు చేశాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితులున్నాయని ఈ నివేదికలో పేర్కొన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో (ఏప్రిల్ నెలలో) రిజర్వుబ్యాంకు విడుదల చేసిన నివేదిక ప్రకారమే మన దేశంలో పొదుపు గణనీయంగా పడిపోయింది. దేశంలోని కుటుంబాల నికర పొదుపు 47 ఏండ్ల కనిష్టానికి పడిపోయిందని ఆ నివేదికలో రిజర్వుబ్యాంకే పేర్కొంది. 2022లో దేశ జీడిపిలో 7.3 శాతంగా ఉన్న పొదుపు 2023లో 5.3 శాతానికి పడిపోయింది. బ్యాంకుల డిపాజిట్లతో పాటు స్టాక్స్‌ను కూడా పరిగణలోకి తీసుకుని ఈ పొదుపు లెక్కలను ఆర్‌బీఐ రూపొందించడం గమనార్హం. ఆ నివేదికలోనే కుటుంబాల అప్పులు గణనీయంగా పెరుగుతున్నాయని కూడా ఆర్‌బిఐ పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాల మొత్తం దేశ జీడీపీలో 5.8 శాతంగా ఉంది. 1970 తరువాత కుటుంబాల రుణం ఈ స్థాయిలో పెరగడం ఇది రెండోసారి! అప్పులు పెరిగితే కష్టపడి సంపాదించినదంతా దానిని తీర్చడానికే సరిపోతుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక పొదుపు చేయడానికి అవకాశం ఎక్కడిది? ఒకప్పుడు పొదుపు చేయడమంటేనే వివిధ దేశాల్లోని ప్రజలు ఇండియాను గుర్తుచేసుకునేవారు. చుక్కలను దాటి పరుగులు తీస్తున్న ధరలు ఆ పరిస్థితిని మార్చివేస్తున్నాయి. కనీస అవసరాలను తీర్చుకోవడానికే సామాన్యులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఇటీవల విడుదలైన ఒక నివేదిక సామాన్యులపై ధరాఘాతం ఏ స్థాయిలో ఉందో తెలియచేస్తోంది. దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో ఈ సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం నిత్యావసరాల కోసం 2022వ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ (త్రైమాసికం)లో చేసిన ఖర్చుకంటే ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 18 శాతం అధికంగా భారతీయ కుటుంబాలు ఖర్చు చేశాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితులున్నాయని ఈ నివేదికలో పేర్కొన్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇంటి అద్దెలు, విద్య, వైద్యం ఇలా అన్నీ తడిసి మోపెడవుతున్నాయి. పెరిగిన ఖర్చులకు తగ్గట్టుగా ప్రజల నిజ వేతనాలు పెరగడం లేదన్నది సుస్పష్టం. కొంచెం అటుఇటుగా పట్టణ ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోనూ కొనసాగుతున్న ఈ పరిస్థితులను మార్చాలంటే ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. అధిక ధరలకు కళ్లెం వేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున కల్పించాలి. అప్పుడే ప్రజల చేతుల్లో డబ్బు ఉంటుంది. పొదుపు చేయడం సాధ్యమవుతుంది. ఈ చర్యలు తీసుకోకుండా వడ్డీ రేట్లను పెంచినా ఫలితం శూన్యం!

'హైడ్రా' చర్యలు : సామాన్యులే సమిధలా?



ఆర్. వెంకట్రాములు
8332975548

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు, పార్కులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల నుంచి విడిపించి, అక్రమ నిర్మాణాలను తొలగించి, సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ సర్కార్ హైదరాబాద్ విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణ సంస్థ (హైడ్రా)ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతించాల్సిందే. ఒకప్పుడు హైదరాబాద్ చెరువుల నగరంగా ఉండేదని, గతంలో పాలించిన ప్రభుత్వ పెద్దల, రాజకీయ నాయకుల అండదండలతో అవన్నీ కబ్జాలకు గురై, హైదరాబాద్ వరదల నగరంగా తయారైందన్నది వాస్తవం. అందుకోసం హైడ్రా ఏర్పాటు కావడం మంచిదే. కబ్జాదారులు ఎంతటి వారైనా వదలరాదు, ఎంత పెద్ద కట్టడమైనా నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేయాల్సిందే. అయితే ఇది పెద్దల నుంచి పేదల దాకా ఒకే దూకుడు ప్రదర్శిస్తూ, పేదలకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా ఇండ్లు కూల్చేయడం దారుణం. కూల్చివేతల పర్వం సంపన్నుల నుండి సామాన్యుల వరకు ఒకే విధంగా ఉండరాదు. గ్రామాల్లో పనుల్లేక పొట్టచేత పట్టుకొని హైదరాబాద్ వచ్చి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని బతుకుతున్నారు. మురికి కాలువల వెంట, నాలాలపై చిన్న చిన్న నిర్మాణాలు చేసుకున్న వారి పట్ల ప్రభుత్వం పునరాలోచన చేయాలి. వీరికి ప్రత్యా మ్నాయం చూపకుండా ఇలాంటి చర్యలు తీసుకురావడం సర్కార్‌కు చెడ్డపేరు తెస్తుందనే అంశం గమనించాలి.

ఏ ప్రభుత్వమైనా ప్రక్షాళన పేరుతో ఏ కార్యక్రమం చేపట్టినా మొదట సమిధలవుతున్నది పేదలే. కబ్జాదారుల నుంచి ప్రభుత్వ ఆస్తులను రక్షించేందుకు హైడ్రా ముందుకు సాగడం మంచిదే. కానీ అది పేదల ఇండ్ల కూల్చివేతల నుంచి మొదలు పెట్టడమే సరైంది కాదు. ఎందుకంటే వారి నిర్మాణాలు, 20, 30 గజాలు మహా అయితే వంద గజాల స్థలంలో మాత్రమే ఉంటాయి. కానీ రాజకీయ నాయకులు, కార్పొరేట్లు, సినీతారలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు, రియల్ఎస్టేట్ సంస్థల అధిపతులు వంటివారు అక్రమిం చుకున్న ఎకరాలు పక్కకు పెట్టి పేదల ఆస్తుల పైకి రావడమనేది చాలా దుర్మార్గమైన చర్య. అధికారులను నయానో, భయానో తమ గుప్పిట్లోకి తెచ్చుకొని, ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకుని ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లను ఆసాంతం ధ్వంసం చేసిన వారికేమో నోటీసులిచ్చి, కొంత సమయమిచ్చి, వారికి ఎలాంటి ఆర్థిక, సామాజిక ఇబ్బందులు కలగకుండా ఒకటో రెండో కూల్చి ఇదిగో ఎవ్వరివైనా కూల్చేస్తాం అంటూ ప్రజలను ఏమార్చే పనిచేస్తున్నది హైడ్రా. ఇది ఎవరూ గమనించడం లేదు, తాము ఏం చేసినా చెల్లుతుందనే అపోహలో హైడ్రా, ప్రభుత్వం భావించినట్లు ఉందనిపిస్తోంది. అందుకే పేదల ఇండ్లపైకి అర్ధరాత్రి పోలీసు బలగాలతో, ప్రొక్లెయిన్లతో వెళ్లి ఉన్నఫళంగా నేలమట్టం చేస్తున్నది. ఇప్పటివరకు హైడ్రా కూల్చిన వాటిలో ఎన్ని పెద్దల భవంతులు ఎన్ని కూల్చారు? పేదల ఇండ్లు ఎన్ని కూల్చారో చూస్తుంటేనే పరిస్థితి అర్థమవుతుంది. వ్యాపారులు, కార్పొరేట్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి భూములను అప్పనంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు ప్రభుత్వం లొంగకుండా ఉండాలి.

మూసీ సుందరీకరణ పేరుతో..!

నార్సింగి నుంచి నాగోల్ వరకు దాదాపు 25 కి.మీ పొడవునా మూసీకి ఇరువైపులా పన్నెండు వేలకు పైగా తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలున్నట్లు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఎంఆర్ఎఫ్‌సిఎల్) సర్వే తెలిపింది. ఆ సర్వే ప్రకారం వాటన్నింటినీ తొలగిస్తామంటున్నది. కానీ ఇప్పటికే అన్ని డిపార్ట్‌మెంట్ల భవన నిర్మాణాలకు అనుమతులు ఇంటి నిర్మాణాలు జరిగాయి. పేదలు నిర్మించుకున్న ఇండ్లకు కరెంట్, నీళ్లు, డోర్ నెంబర్లు, రోడ్లు, డ్రెయినేజీ లాంటి వసతులు కల్పించి, వారి నుంచి ఇంటి పన్నులు కూడా వసూలు చేశారు. ఇంత చేసి ఇప్పుడేమో ఉన్నఫళంగా ఇప్పటికిప్పుడు అక్రమ నిర్మాణాలు కాబట్టి కూలుస్తామంటే ప్రజలు తిరగబడరా? గ్రామాల్లో పనులు దొరక్క హైదరాబాద్‌కు వలసచ్చి చిన్న చిన్న ఇంటి నిర్మాణాలు చేసుకొని లక్షలాదిమంది బతుకుతున్నారు. ఇప్పటికే జీవో నెంబర్ 58 కింద లక్షలాది పేదలు ఇంటి స్థలాలకు దరఖాస్తులు చేసుకున్నారు. వారందరికీ ప్రభుత్వమే ఇండ్లు నిర్మించివ్వాలి.

ప్రభుత్వ భూముల్లో పేదలు జీవిస్తే వారికి ఆ స్థలాలపై హక్కులు కల్పించి, ప్రభుత్వమే ఆర్థిక సహాయం చేసి, ఇండ్ల నిర్మాణానికి వెంటనే పూనుకోవాలి. హైడ్రా చర్యల సందర్భంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నంలో భాగంగా భూ మాఫియా, రియల్ ఎస్టేట్ ఇండ్లు, ఇంటి స్థలాలు లేని పేదలకు 125 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసి ఇవ్వాలి. ఈ ఏడాదిలో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్, రాజీవ్ స్వగృహ, గృహకల్ప ఇండ్లను పేదలకివ్వాలి. ఇండ్లు, ఇంటి స్థలం లేనివారికి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ॥5లక్షలు ఇవ్వాలి. చెరువులు, కుంటలు బాగు చేసేందుకు బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించి, ఖర్చు చేయాలి. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. కబ్జాలు, ఆక్రమణలపై భవిష్యత్తులో తీసుకోబోయే చర్యలపై హైడ్రాకు ఒక ప్రణాళిక ఉండాలి. ఇలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేసి హైడ్రా కూల్చివేతలకు పూనుకుంటే సరేగాని, లేదంటే ప్రజల నుంచి తీవ్రమైన ప్రతిఘటన ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుంది.

సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటిస్తున్న పశ్చిమాఫ్రికా దేశాలు



ప్రభాత్ పట్నాయక్

పశ్చిమాఫ్రికాలో చాలాభాగం ఫ్రెంచి సామ్రాజ్యవాదుల వలస పెత్తనం కింద నడిచింది. ప్రస్తుతం అక్కడ అన్నీ స్వతంత్ర దేశాలే అయినా, భారతదేశం బ్రిటిష్ వలస పాలన నుండి విడగొట్టుకున్న మాదిరిగా ఆ దేశాలు ఫ్రెంచి సామ్రాజ్యవాద పెత్తనం నుండి విడగొట్టుకోలేదు. ఇప్పటికీ ఆ మాజీ ఫ్రెంచి వలస దేశాల కరెన్సీలు ఫ్రాంక్‌తో స్థిర మారకపు రేటును కొనసాగిస్తున్నాయి. దాని పర్యవసానంగా ఆ దేశాలు తమవైన స్వంత ఆర్థిక విధానాన్ని గాని, ద్రవ్య విధానాన్ని గాని అమలు చేయగలిగే స్థితిలో లేవు. ఒకవేళ అలా గనుక స్వంత విధానాలను అనుసరిస్తే ఫ్రాంక్‌తో ఉన్న స్థిర మారకపు రేటు దెబ్బతింటుంది. ఇక ఆ దేశాల విదేశీ మారకపు నిల్వలు అన్నింటినీ ఫ్రాన్స్ తన దగ్గరే అట్టిపెట్టుకుంది. భారతదేశం బ్రిటన్‌కు వలసగా ఉన్న కాలంలో మన విదేశీ మారకపు ద్రవ్య నిల్వలను బంగారం రూపంలో బ్రిటన్ తన వద్దే ఉంచుకునేది. ఇప్పుడు ఫ్రాన్స్ పశ్చిమాఫ్రికా దేశాల విషయంలో అదేవిధంగా వ్యవహరి స్తోంది. పశ్చిమాఫ్రికా దేశాలు స్వతంత్రం పొందినట్టు అంగీకరించినా, వాటి ఆర్థిక విధానాలను ఇప్పటికీ తానే అదుపు చేస్తోంది. ఇక ఆ దేశాల సహజ వనరులు, ఖనిజ సంపద యావత్తూ సామ్రాజ్యవాద దేశాలలోని బహుళజాతి కార్పొరేట్ల ఆధీనంలో ఉన్నాయి. అంతటితో ఆగలేదు. ఫ్రాన్స్ సైన్యాలు ఇప్పటికీ ఆ పశ్చిమాఫ్రికా దేశాలలో మోహ రించి వున్నాయి. మొదట్లో తమ ఆస్తులను, సంపదలను కాపాడుకోవడం కోసం ఆ సైన్యాన్ని అక్కడ ఉంచవలసి వచ్చిందని ఫ్రాన్స్ చెప్పింది. ఆ తర్వాత ఇస్లామిక్ ఉగ్రవాదం ప్రమాదం ముంచుకొస్తోంది గనుక దాని నుండి ఆ దేశాలను కాపాడడం కోసం తమ సైన్యాలను అక్కడ ఉంచవలసి వస్తోందని సమర్థించుకుంది. నిజానికి ఇస్లామిక్ ఉగ్రవాదం ఆ ప్రాంతంలో బలం పుంజుకోడానికి సామ్రాజ్య వాదులే కారణం. లిబియా నేత గడాఫీని అంతమొందించే కుట్ర అనంతరమే ఆ ప్రాంతంలో ఇస్లామిక్ ఉగ్రవాదం కొంత బలపడింది. నిజానికి ఆ సైన్యాలు అక్కడ ఉన్నది ఆ దేశాలన్నీ తమ అదుపాజ్ఞల్లో నడిచేలా చేయడం కోసమే. ఒకవేళ ఏ దేశమైనా ఫ్రెంచి సైన్యాలు తమ దేశాన్ని విడిచి పెట్టి వెళ్ళిపోవాలని ఆదేశిస్తే, ఆ విధంగా ఆదేశించిన ప్రభుత్వాన్ని కుట్ర ద్వారా కూలదోసి తమ తొత్తు ప్రభుత్వాన్ని అక్కడ ఏర్పాటు చేయడానికి ఫ్రాన్స్ వెనుకాడదు. బుర్కినా ఫాసో విషయంలో అదేమాదిరిగా జరిగింది.

ఆఫ్రికా దేశాలన్నీ సమైక్యంగా స్వతంత్రంగా ఉండాలని వాంఛించే మార్క్సిస్టు విప్లవకారుడు థామస్ సంకారా బుర్కినా ఫాసోలో అధికారాన్ని చేపట్టినప్పుడు ఫ్రెంచి సైన్యాలను తమ దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవాలని ఆదేశించాడు. అప్పుడు అతడి స్వంత పార్టీలోని వ్యక్తులతోనే అతడిని హత్య గావించే కుట్ర పన్నింది ఫ్రాన్స్. అయితే చాలా దేశాలలో తమకు అనుకూలంగా వ్యవహరించే పార్టీలనే అధికారంలో కూర్చోబెట్టి పరోక్షంగా తన పెత్తనాన్ని ఫ్రెంచి సామ్రాజ్యవాదం కొనసాగిస్తోంది. ఆ పార్టీలు ఏవి అధికారంలో ఉన్నా అవి ఫ్రెంచి సైన్యాలు తమ దేశంలో తిష్ట వేసుకుని వున్న విషయాన్ని చర్చలోకి రాకుండా చూసుకుంటాయి. ఆ విధంగా ఫ్రెంచి సైన్యాలు అక్కడి ప్రభు త్వాల ఆమోదంతోనే కొనసాగుతున్నట్టు ఒక ప్రజాస్వామ్య ముసుగు వేసుకుని వ్యవహారాన్ని నడుపుతోంది ఫ్రాన్స్.

అయితే ఇటీవల కొన్ని పశ్చిమాఫ్రికా దేశాల్లో సైన్యంలోకి ప్రవేశించి బలపడిన విప్లవకర శక్తులు అక్కడ ఎన్నికైన తొత్తు ప్రభుత్వాలను సైనిక కుట్రల ద్వారా కూలదోసి సామ్రాజ్యవాద వ్యతిరేక వెల్లువకు తెరతీశాయి. సామ్రాజ్యవాదులు మాత్రం అక్కడ ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగినట్టు గగ్గోలు పెడుతున్నాయి. కాని ఆ దేశాల్లోని ప్రజానీకం మాత్రం ఈ విప్లవకర సైనిక ప్రభుత్వాలకు మద్దతుగా ఉన్నారు. తాము ఎన్నికల ద్వారా గెలిపిం చిన ప్రభుత్వాలనే ఈ సైనిక శక్తులు కుట్ర ద్వారా కూలదోసినప్పటికీ ప్రజలు వాటికి తమ మద్దతు తెలుపుతున్నారు.

నిజానికి ఈ దేశాల్లోని పరిణామాలు ప్రస్తుతం అమలౌతున్న ఎన్నికల ప్రజాస్వామ్యానికి ఉన్న పెద్ద లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి. మామూలుగా సార్వత్రిక ఓటు హక్కు ద్వారా ఎన్నికల్లో గెలిచిన పార్టీ అధికారంలోకి రావడం అనేది ప్రజాస్వామ్య యుతంగా కనిపిస్తుంది. పౌరులెవరైనా, వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులతో నిమిత్తం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయవచ్చుని, అందరికీ సమాన హక్కులు ఉంటాయని, ఎవరైనా రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసు కోవచ్చునని చెప్తూ ఈ ఎన్నికల ప్రజాస్వామ్య విధానాన్ని సమర్థిస్తారు. ఐతే, ధన ప్రభావం విపరీతంగా పెరిగి సామాన్యులెవరూ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధం కాలేని పరిస్థితి నేడు నెలకొంది. అందుచేత ఎన్నికల విధానం అనేది నేటిపరిస్థితుల్లో అందరికీ సమాన అవకాశాలు గ్యారంటీ చేయలేకపోతోంది. ఐనప్పటికీ పైకి చూసినప్పుడు ఎన్నికల ప్రజాతంత్రం చాలా బాగా నడుస్తోందని సామ్రాజ్య వాదులు చెప్పుకోవచ్చు. ఆ ఎన్నికల్లో ప్రజలను నిజంగా కలవర పరిచే సమస్యలేవీ చర్చకే రావు. అదే మాదిరిగా పశ్చిమాఫ్రికా దేశాలలో ప్రజలందరూ తమ తమ దేశాల నుండి ఫ్రెంచి సైన్యాలు ఖాళీ చేయాలన్ని బలంగా కోరుతున్నా, అక్కడ ఎన్నికైన ప్రభుత్వాలు మాత్రం ఆ విషయాన్ని చర్చకే రానివ్వడం లేదు.

అయితే, ఇందుకు భిన్నంగా మూడు దేశాలు-బుర్కినా ఫాసో, నైగర్, మాలి-ఫ్రెంచి సైన్యాలు వెంటనే తమ దేశాలను ఖాళీ చేయాలని ఆదేశించాయి. అక్కడ ఇప్పుడు నడుస్తున్నవి సైనిక ప్రభుత్వాలు. అక్కడ ఎన్నికల ద్వారా అధికారం చేపట్టిన తొత్తు ప్రభుత్వాలను కూలదోసి ఈ దేశాల్లో సైన్యం అధికారం చేపట్టింది. ఇక ఇస్లామిక్ ఉగ్రవాదం ప్రమాదాన్ని నిలవరించే విషయంలో మాలి 'వేగ్నర్' అనే రష్యన్ సాయుధ బలగాల సహాయాన్ని తీసుకుంటోంది. ఇప్పుడు ఆ వేగ్నర్ బలగాలు రష్యన్ ప్రభుత్వ సైన్యంలో విలీనం అయాయి. జులై 2024లో ఈ మూడు దేశాలూ కలిసి "సాహెల్ దేశాల కూటమి"గా ఏర్పడ్డాయి. విశాల ఆఫ్రికా ఐక్యతకు, సామ్రాజ్యవాద వ్యతిరేకతకు ఈ కూటమి కట్టుబడి వుంది. ఇప్పుడు బుర్కినా ఫాసో మరో అడుగు ముందుకేసి తన దేశంలోని బంగారపు గనులను జాతీయం చేసింది. ఇంత వరకూ ఆ గనులు ఎండెవర్ మైనింగ్ కంపెనీ అనే బ్రిటిష్ బహుళజాతి కార్పొరేట్ ఆధీనంలో ఉండేవి. బుర్కినా ఫాసో ప్రపంచంలో అత్యధికంగా బంగారం ఖనిజపు నిల్వలు కలిగివున్న దేశాలలో 13వ స్థానంలో ఉంది. సాలీనా ఆ దేశం నుండి ఉత్పత్తి అయ్యే బంగారం వంద టన్నులకు పైబడి వుంటుంది. దాని విలువ 600 కోట్ల డాలర్లకు పైబడి ఉంటుంది. కాని అందులో అధిక భాగాన్ని మైనింగ్ కంపెనీలు కాజేస్తున్నాయి. అందుచేత ఇంత బంగారపు నిల్వలు ఉండి కూడా బుర్కినా ఫాసో స్థూల జాతీయోత్పత్తి కేవలం 1937 కోట్ల డాలర్లు మాత్రమే ఉంది. ఇబ్రహీం ట్రావోర్ నాయకత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం బంగారు గనులను జాతీయం చేయడంతోబాటు ముడి ఖనిజాన్ని శుద్ధి చేసే కర్మాగారాన్ని కూడా అక్కడ నెలకొల్పుతోంది. ఆ దేశంలో ఉత్పత్తి అయ్యే బంగారం విలువలో కేవలం 200 కోట్ల డాలర్ల వరకే పొందగలిగినా, ఆ మొత్తంతో ఆ దేశపు ప్రజల వైద్య, విద్యా, కనీస అవసరాల నన్నింటినీ తీర్చగల శక్తి ఆ ప్రభుత్వానికి వస్తుంది.



ఏ దేశానికైనా ఖనిజ వనరులు పునరుత్పత్తికి అవకాశం లేని విలువైన సంపదగా ఉంటాయి. అందువలన వాటిని వెలికితీయడం ద్వారా ఆ దేశం అత్యధిక ప్రయోజనాలు పొందగలిగేలా ప్రభుత్వ విధానం ఉండాలి. అలా కాకుండా, తక్షణ ప్రయోజనాలను ఆశించి ఖనిజ సంపద మీద పెత్తనాన్ని బహుళజాతి సంస్థలకు అప్పజెప్తే ఆ దేశం శాశ్వతంగా నష్టపోతుంది. మన పొరుగునే ఉన్న మయన్మార్ విషయంలో జరిగిందిదే. ఆ దేశంలో ఉన్న ముడిచమురు నిల్వలను బహుళజాతి కంపెనీలకు అప్పజెప్పడం వలన మొదట్లో కొంత ఆదాయం ఆ దేశానికి లభించింది. దాంతో ఒక తాత్కాలిక ఊపు అక్కడి ఆర్థిక వ్యవస్థకు వచ్చింది. లాభాల్లో అత్యధిక భాగం బహుళజాతి కంపెనీలు కాజేశాయి. అక్కడ చమురు నిల్వలు పూర్తిగా తరిగిపోయాక ఆ బహుళజాతి కంపెనీలు మూటాముల్లే సర్దుకుని వెనక్కి పోయాయి. మయన్మార్ ఇప్పుడు ఐరాస మాటల్లో చెప్పాలంటే అత్యంత హీనమైన వృద్ధి సాధించిన దేశాలలో ఒకటిగా ఉంది.

ఏ దేశానికైనా తన ఖనిజ సంపదపై పూర్తి అధికారం ఉండాలన్న సూత్రాన్ని బుర్కినా ఫాసో బాగా అర్థం చేసుకుంది. ఐతే ఈ విషయంలో పశ్చిమాఫ్రికా దేశాలను అంత తేలికగా సామ్రాజ్యవాదులు విడిచి పెడతారని అనుకోలేం. మూడవ ప్రపంచ దేశాల వనరుల మీద తమ ఆధిపత్యాన్ని ఎలాగైనా నిలుపుకోవడం కోసం సామ్రాజ్య వాదులు ఎంతవరకైనా పోగలరని గతానుభవాలు సూచిస్తున్నాయి. ఇరాన్‌లో మొస్సాద్ ప్రభుత్వాన్ని కూలగొట్టిన నాటి నుండీ అనుభవాలు మన ముందున్నాయి. సామ్రాజ్యవాదులు ఎంతకు తెగించడానికి సిద్ధపడినప్పటికీ, ఇప్పటికీ చాలా మూడవ ప్రపంచ దేశాలలోని సహజ వనరుల మీద సామ్రాజ్యవాదులు పట్టు ఇంతవరకూ సాధించలేక పోయారు. అందుచేతనే సామ్రాజ్యవాదులు మూడవ ప్రపంచ దేశాలను నయా ఉదారవాద చట్రం లోకి తెచ్చి ఉచ్చు బిగించి షరతుల పేరుతో ప్రభుత్వ రంగాన్ని తిరిగి బహుళజాతి గుత్త సంస్థల పరం చేయడానికి, వాటికే ఈ దేశాల సహజ వనరులను, ఖనిజ సంపదను ధారాదత్తం చేసేలా వత్తిడి చేయడానికి పూనుకున్నారు. సామ్రాజ్యవాదుల పన్నాగం ఏమిటో పశ్చిమ ఆఫ్రికా దేశాల ప్రభుత్వాలు, ప్రజలు గుర్తిస్తున్నారు. ఇది చాలా ప్రాధాన్యత గల పరిణామం. తమ వనరులమీద, తమ సహజ సంపద మీద తమకే పూర్తి ఆధిపత్యం ఉండాలని వారు పట్టుదలగా ఉన్నారు.

> మన దేశంలో ఉన్న ప్రయివేటు రంగం కూడా ఈ విషయంలో బహుళజాతి కార్పొరేషన్లకన్నా ఏ విధం గానూ మెరుగ్గా లేవు. అందుచేత ప్రభుత్వ రంగానికి ప్రత్యామ్నాయం లేదని, ఆ రంగం ద్వారా మాత్రమే మన దేశ సహజ వనరులను పూర్తిగా దేశ ప్రయోజనాల కోసం వినియోగించుకోగలుగుతామని గ్రహించాలి. ప్రభుత్వ రంగంలో ఎక్కడైనా అవినీతి ఉందనో, సామర్థ్యం కొరవడిందనో చెప్పి ఆ సాకులతో ప్రయివేటుపరం చేయడం సమర్థ నీయం కానేకాదు. అటువంటి లోపాలను సరిచేసుకుంటూ దేశాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉపయోగించుకోగలిగేది ప్రభుత్వ రంగం మాత్రమే. ప్రయివేటు రంగం ద్వారా ఆ పని జరగదు. ప్రభుత్వరంగాన్ని పరిరక్షించడం అనే లక్ష్యానికి కట్టుబడ్డ ప్రభుత్వానికి ఆ రంగంలోని లోపాలను సరిచేయడం కూడా సాధ్యమే.

భారతదేశంలో రాజకీయ స్వాతంత్ర్యం సాధించిన తర్వాత ఆర్థికంగా స్వంత కాళ్ల మీద నిలబడడానికి చేసిన పోరాటం చాలా ప్రాధాన్యత కలిగినటువంటిది. ఆ రోజుల్లో సోవియట్ యూనియన్ అందించిన తోడ్పాటు చాలా కీలకమైనది. మనం మన సహజ వనరులమీద తిరిగి అధికారం సాధించుకున్నాక ఇప్పుడు నయా ఉదారవాద చట్రంలో ఇరుక్కుని గతంలో సాధించిన సార్వభౌమాధికారాన్ని కోల్పోతున్నాం. సామ్రాజ్య వాదుల ముందు దాసోహం అంటున్నాం. పశ్చిమాఫ్రికా దేశాల అనుభవాలను చూసిన తర్వాతనైనా మన ప్రభుత్వాలకు జ్ఞానోదయం కలిగి ప్రభుత్వరంగాన్ని కాపాడుకుని, దేశ సహజసంపద మీద పట్టు నిలుపుకునేదిశగా పునరాలోచన చేయాలని కోరుకుందాం.

మన దేశంలో ఉన్న ప్రయివేటు రంగం కూడా ఈ విషయంలో బహుళజాతి కార్పొరేషన్లకన్నా ఏ విధం గానూ మెరుగ్గా లేవు. అందుచేత ప్రభుత్వ రంగానికి ప్రత్యామ్నాయం లేదని, ఆ రంగం ద్వారా మాత్రమే మన దేశ సహజ వనరులను పూర్తిగా దేశ ప్రయోజనాల కోసం వినియోగించుకోగలుగుతామని గ్రహించాలి. ప్రభుత్వ రంగంలో ఎక్కడైనా అవినీతి ఉందనో, సామర్థ్యం కొరవడిందనో చెప్పి ఆ సాకులతో ప్రయివేటుపరం చేయడం సమర్థ నీయం కానేకాదు. అటువంటి లోపాలను సరిచేసుకుంటూ దేశాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉపయోగించుకోగలిగేది ప్రభుత్వ రంగం మాత్రమే. ప్రయివేటు రంగం ద్వారా ఆ పని జరగదు. ప్రభుత్వరంగాన్ని పరిరక్షించడం అనే లక్ష్యానికి కట్టుబడ్డ ప్రభుత్వానికి ఆ రంగంలోని లోపాలను సరిచేయడం కూడా సాధ్యమే.

(స్వేచ్ఛానుసరణ)

లౌకికతత్వం-భారతీయ జీవన విధానం



షేక్ కరిముల్లా
9705450705

రాజ్యాంగబద్ధ తమిళనాడు రాష్ట్ర ప్రథమపౌరుడు, గవర్నర్ ఆర్ఎన్ రవి కన్యాకుమారిలో హిందూ ధర్మ విద్యాపీఠ్‌లో జరిగిన కార్యక్రమంలో 'భారతదేశంలో లౌకిక విధానానికి స్థానం లేదు. ఇది యూరోపియన్ భావన' అంటూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని తిరస్కరిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇది అత్యంత తీవ్రమైన విషయం. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని ప్రమాణం చేసి, అధికారం చేపట్టిన ఈ గవర్నర్ ఒక్కక్షణం కూడా ఆ పదవిలో కొనసాగటం తగదు.

'భారత దేశ ప్రజలమైన మేము, ఈ దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్యం, గణతంత్ర రాజ్యాంగా నిర్మించుకో వడానికి, భారత ప్రజలందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించి వారిలో భావ ప్రకటన, విశ్వాసం, ధర్మంతో ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సమానత్వాన్ని సాధించి, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ, సోదరభావం పెంపొందిం చుకోవడానికి మనం రాజ్యాంగంలో రాసుకొని, ఆమోదించి మాకు మేము సమర్పించుకుంటున్నాం' అని రాజ్యాంగ పీఠిక స్పష్టంగా చెబుతుంది. బహుళత్వం గల భారతదేశంలో లౌకిక తత్వం దేశం అత్యంత ప్రత్యేక లక్షణం. కొన్ని వందల సంవత్సరాలుగా భిన్న మతాలు, కులాలు, భాషలు, సంస్కృతులు కలిసి మెలసి జీవిస్తున్నాయి. లౌకిక తత్వం ప్రత్యేకంగా భారతజీవన విధానంగా మారిపోయింది. భారతదేశం విభిన్న మతాల, సంస్కృతుల సంగమం అని, ఒక రంగుల హరివిల్లు అన్న భావనను నేడు కొన్ని మతతత్వ శక్తులు పనిగట్టుకొని మసకబార్చే ప్రయత్నం చేస్తున్నాయి. చరిత్రను తిరగరాస్తున్నాయి. అభూత కల్పనలు, పుక్కటి పురాణాలను చరిత్రగా నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నాయి. గవర్నర్ వ్యాఖ్యలు అలాంటి వక్రీకరణలకు తార్కాణంగా నిలుస్తున్నాయి.

లౌకిక వాదం అంటే? రాజ్యం నుండి మతాన్ని వేరుచేయడం. మతమనేది వ్యక్తిగతమైన సొంత వ్యవ హారంగా ఉండాలి. రాజ్యం అన్నిమతాల నుంచి వేరుపడాలి. అన్ని మతాల పట్ల తటస్తంగా ఉండాలి. రాజ్యం అన్ని మతాలకు సమానమైన గౌరవం ఇవ్వాలి. దీని ఆధారంగానే మనం రాజ్యాంగంలో మతం, కులం, వర్గం ప్రాతిపదికగా దేశపౌరుల పట్ల ఎలాంటి వివక్ష చూపించరాదని రాసుకున్నాం. లౌకికవాదం అనేది ఇండియాలో మాత్రమే ప్రత్యేకంగా కనిపించే లక్షణం. ఇది ఈ దేశ మూలాల్లోనే ఉంది. అశోకుడు, అక్బర్ చక్ర వర్తులు హిందూ మతస్తులు కారు. అయినా వారు అన్ని మతాలను సోదరభావంతో చూశారు. లౌకిక భారతానికి గట్టి పునాదులు వేశారు. పందొమ్మిదో శతాబ్దం ఆఖరులో లౌకికవాదం ఆవిర్భవించి బలపడింది. 1857 ప్రథమ భారతీయ స్వాతంత్ర్య సంగ్రామం ప్రజలు కులమతాలకతీతంగా బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఇది గమనించిన ఆంగ్లేయులు దేశ ప్రజలను మత ప్రాతిపదికన విడగొట్టకపోతే దేశాన్ని ఎక్కువ కాలం పాలించలేమని గ్రహించారు. ఆ తర్వాత భారతీయులను మతం ప్రతిపదికగా విభజన రాజకీయాలు మొదలు పెట్టారు. అప్పటి నుండి విభజించు, పాలించు వారి జీవన విధానమైంది. వారు మతతత్వాన్ని బాగా ప్రోత్సహించారు.



> ప్రజాస్వామ్య లౌకికవాద భారత రాజ్యాంగం సాక్షిగా అయోధ్యలో 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు నేలమట్టం చేయబడింది. తదుపరి గుజరాత్ మారణకాండ 2002, యూపీలోని ముజఫర్‌నగర్‌లో ముస్లిం సమాజంపై దాడులు, గోసరంక్షణ పేరుతో జరుగుతున్న ఘోరాలు, బుల్డోజర్ రాజ్ తదితర పరిణామాలన్నీ భారతీయ లౌకిక చరిత్ర వారసత్వంపై దాడులే. భారత చరిత్ర చెక్కిలిపై నెత్తుటిగాయాలే. ఇలా శవాల గుట్టలపై నడుస్తూ, మతాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకొని పార్లమెంటులో రెండు సీట్ల నుండి 2014లో అధికారంలోకి వచ్చింది బీజేపీ.

ఇందుకు 1906 లో ముస్లింలీగ్, హిందూ మహాసభ అనే రెండు మత సంస్థలను ఏర్పాటు చేశారు. ఈ రెండు సంస్థల పని మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలు ఏకమవ్వకుండా ఉద్యమాలను నిర్వీర్యపరిచి బ్రిటీష్ వారికి మేలు చేయడమే. 1947లో దేశ విభజన సమయంలో ముస్లిం లీగ్ లోని ముఖ్యులు పాకిస్తాన్‌కు వెళ్లిపో యారు. ఈ హిందూ మహాసభే 1925లో ఆర్ఎస్ఎస్‌గా ఏర్పడింది. దీని రాజకీయ రూపమే బీజేపీ. ఈ సంస్థ దేశాన్ని మతతత్వంతో నింపి వేయడానికి వందేళ్లుగా పని చేస్తోంది. తద్వారా దేశ విదేశీ కార్పొరేట్ సంస్థలకు ప్రజలకు దక్కాల్సిన సమస్త వనరులను దోచిపెడుతోంది.

ప్రజాస్వామ్య లౌకికవాద భారత రాజ్యాంగం సాక్షిగా అయోధ్యలో 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు నేలమట్టం చేయ బడింది. తదుపరి గుజరాత్ మారణకాండ 2002, యూపీలోని ముజఫర్‌నగర్‌లో ముస్లిం సమా జంపై దాడులు, గోసరంక్షణ పేరుతో జరుగుతున్న ఘోరాలు, బుల్డోజర్ రాజ్ తదితర పరిణామాలన్నీ భారతీయ లౌకిక చరిత్ర వారసత్వంపై దాడులే. భారత చరిత్ర చెక్కిలిపై నెత్తుటిగాయాలే. ఇలా శవాల గుట్టలపై నడుస్తూ, మతాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకొని పార్లమెంటులో రెండు సీట్ల నుండి 2014లో అధికారంలోకి వచ్చింది బీజేపీ. దురదృష్ట వశాత్తు సుప్రీంకోర్టు తీర్పులన్నింటిలోనూ అత్యంత ఘోరమైనదిగా అనదగిన 2019 నాటి అయోధ్య మీద ఇచ్చిన తీర్పు ద్వారా హిందుత్వ రాజకీయాలకు ఆమోదముద్ర వేసింది. ఈ తీర్పిచ్చిన అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్‌ను ఆరు నెలలు తిరగకముందే బీజేపీ అస్సాం నుంచి రాజ్యసభకు ఎంపీగా పంపి ఈ పదవిని బహుమతిగా అందించింది. న్యాయ మూర్తులు పదవీ విరమణ అనంతరం ఎలాంటి పదవులు చేపట్ట రాదని రాజ్యాంగ నిబంధనలు చెబుతున్నాయి.

దేశ అత్యున్నత న్యాయస్థానమే రాజ్యాంగంలోని లౌకికతత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇస్తే ఇక ఈ దేశాన్ని రక్షించేది ఎవరు? ఇక బీజేపీ వారు 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగం మీద దాడి మొదలు పెట్టారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటిస్తున్నారు. ఆ పని చిన్నచిన్నగా చేస్తూ ముందుకుపోతున్నారు. ఆర్ఎస్ఎస్ 1949 నవంబర్‌లో మనుస్మృతిని తప్పితే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అంగీ కరించం అని ప్రకటించింది. మొత్తం రాజ్యాంగ, లౌకిక విలువల స్థానంలో హిందూ రాష్ట్రంను స్థాపించేందుకు పూనుకొంది. ఈ మత సంస్కృతికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతిని నిర్మిద్దాం. రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్య విలువలను రక్షించుకుందాం.

కమ్యూనిస్టు యోధుడు ఏచూరి

- ఆయన మరణం దేశానికి తీరని లోటు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్



నవతెలంగాణ - మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమాలతో పాటు భారతదేశానికి తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై ఏచూరీ నిశితంగా పరిశీలన చేసి తగిన పరిష్కారాలు చూపేవారన్నారు. నేపాల్ కమ్యూనిస్టు ఉద్యమం కూడా తన సలహాలను సూచనలు తీసుకున్నదని చెప్పారు. ఆయన మహా మేధావి, సిద్ధాంతంపై పట్టు ఉన్న యోధుడు, బహుభాష కోవిదుడు అని కొనియాడారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజుల ఆశిరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ మాట్లాడారు. పేదల పక్షాన నిస్వార్థంగా పని చేస్తూ.. జీవితాలను త్యాగం చేసిన కమ్యూనిస్టులన్నారు. ఏచూరి జీవితాంతం ప్రజలు, దేశం కోసం పనిచేయడమే కాక.. మరణం అనంతరం తన పార్థీవదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుంజనూరు ఆంజనేయులు, బాల్‌రామ్, నాయకులు గోవిందరాజ్, భరత్ కుమార్, కాశప్ప, శివకుమార్, మహేష్ కుమార్‌గౌడ్, వెంకటయ్య, నరహరి, మహ్మద్ అలీ, సీపీఐ నాయకులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఉద్యోగ మేళా

నెరవేరుతున్న నిరుద్యోగుల ఆకాంక్షలు

- పది నెలల్లోనే భారీగా నియామకాలు
- 26 నోటిఫికేషన్లు విడుదల చేసిన టీజీపీఎస్సీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరుతున్నాయి. రాష్ట్రంలో గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఉద్యోగాల మేళా కొనసాగుతోంది. కొత్త సర్కార్ కొలువుదీరిన వెంటనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసింది. అప్పటివరకు పెండింగ్‌లో ఉన్న పరీక్షల ఫలితాలకు ఉన్న అడ్డంకులన్నీ తొలిగించి, ఫలితాలు విడుదల చేయటంతో పాటు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించింది. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను నిరంతర ప్రక్రియగా నిర్వహించే విధానాన్ని అనుసరిస్తోంది.

గత ప్రభుత్వం పదేండ్లలో ఒకేసారి డీఎస్సీ నిర్వహించి, 7,857 టీచర్ పోస్టులు భర్తీ చేసింది. కానీ కాంగ్రెస్ కేవలం పది నెలల వ్యవధిలోనే 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించింది. జులైలో పరీక్షలు నిర్వహించి, రికార్డు వేగంతో సెప్టెంబర్ 30న ఫలితాలను వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థులకు దసరాలోపు నియామక పత్రాలను అందించనున్నట్టు సమాచారం. 15 రోజుల్లోనే మెడికల్ అండ్ హెల్త్‌బోర్డులో 3,967 పోస్టుల నియామకానికి వరుసగా మూడు భారీ నోటిఫికేషన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్, సెప్టెంబర్ 18న 2,050 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టులు, సెప్టెంబర్ 24న 633 ఫార్మసిస్ట్ (గ్రేడ్ 2) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయటం విశేషం. రెసిడెన్షియల్ సొసైటీల పరిధిలో లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులన్నీ కలిపి.. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 8,304 మందికి నియామక పత్రాలను అందించింది. టీజీపీఎస్సీ ఇప్పటి వరకు 26 వివిధ విభాగాలకు చెదిన నోటిఫికేషన్లను విడుదల చేసింది. వివిధ విభాగాలకు చెందిన దాదాపు 17,341 ఉద్యోగ నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవలే ఇరిగేషన్ విభాగంలో 687 మంది ఏఈఈలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు. గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన గ్రూప్ 4 ఫలితాలను కూడా కాంగ్రెష్ ప్రభుత్వం వెల్లడించింది. 8,180 పోస్టుల నియామకాలకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వివిధ దశల్లో ఉంది. సంక్షేమ శాఖలలోని 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల పోస్టులు, 53 డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు వెలువడ్డాయి. గతంలో పేపర్ లీకేజీతో గందరగోళంగా మారిన గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి, 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించగా, 3,02,172 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. నెల రోజుల్లో ప్రిలిమ్స్ ఫలితాలను ప్రకటించింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. షెడ్యూలు ప్రకారం గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు అధ్వర్యంలో 2022లో నిర్వహించిన 16,929 మంది కానిస్టేబుల్ పోస్టుల ఫలితాలను కూడా గత ప్రభుత్వం వెల్లడించ లేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీరందరికీ ఉద్యోగ నియామక పత్రాలను అందించింది. మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్మెంట్ బోర్డు 2022 డిసెంబర్లో నిర్వహించిన 7,094 మంది స్టాఫ్ నర్స్ ఉద్యోగాల ఫలితాలు కూడా అప్పుడు పెండింగ్‌లో పడ్డాయి. ఫలితాలను విడుదల చేసిన కొత్త ప్రభుత్వం వీరందరికీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చింది.రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లోనే నిరుద్యోగులకు ఉద్యోగాలపై భరోసా కల్పించింది.

డీఎస్సీ అభ్యర్థులకు నేటినుంచి ధ్రువపత్రాల పరిశీలన

- అన్ని జిల్లాల్లో డైట్ కాలేజీల్లో నిర్వహణ
- 1:3 నిష్పత్తి చొప్పున అభ్యర్థుల జాబితా విడుదల
- పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల ఐదో తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. జిల్లా స్థాయిలో ప్రతిరోజూ ఉదయం పది గంటలకు ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమవుతుందని తెలిపారు. 1:3 నిష్పత్తి చొప్పున ఎంపికైన అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని కోరారు. రోస్టర్ ప్రకారం మెరిట్ జాబితాను రూపొందించామని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్, ఈమెయిల్ ద్వారా సమాచారం అందించామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలన ఎక్కడ జరుగుతుందో సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారుల కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) వెబ్‌సైట్‌లో అభ్యర్థుల వివరాలుంటాయని తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు రెండు జతల జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని కోరారు. జీఆర్ఎల్‌కు ఎంపికైన అభ్యర్థులు www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. మొదటిరోజు మంగళవారం స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించింది.

డీఎస్సీ అభ్యర్థులకు కావాల్సిన ధ్రువపత్రాలు

- కుల ధ్రువీకరణపత్రం
- విద్యార్హతల ధ్రువపత్రాలు
- బోనఫైడ్
- ఆధార్‌కార్డు
- స్పోర్ట్స్, ఎన్‌సీసీ
- అంగవైకల్యం ధ్రువపత్రాలు
- ఈడబ్ల్యూఎస్
- ఓబీసీ (నాన్ క్రీమీలేయర్)

డాక్టర్‌గా తన వృత్తి ధర్మాన్ని చాటుకున్న ఎమ్మెల్యే తెల్లం

- 15 కేజీల గడ్డను తొలగించిన వైనం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు మరోసారి తన వృత్తి ధర్మాన్ని పాటించి రోగి కడుపులో ఉన్న 15 కేజీల గడ్డను తొలగించి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకెళ్తే.. భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే సొంత ఆస్పత్రి అయిన నిఖిత ఆస్పత్రిలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం జగ్గవరం గ్రామానికి చెందిన కుంజ రత్తమ్మ (51) తీవ్రమైన కడుపునొప్పితో ఇబ్బంది పడుతూ చేరింది. రోగి పరిస్థితిని గమనించిన డాక్టర్ తెల్లం.. అవసరమైన స్కానింగ్, పరీక్షలు నిర్వహించగా, ఆమె కడుపులో సుమారు 15 కేజీల బరువు గల నీటి గడ్డ ఉన్నట్టు గుర్తించారు. అప్పటికే తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న రోగికి వెంటనే ఆపరేషన్ చేయకపోతే ఆమె ప్రాణాలకే అపాయమని గ్రహించిన ఎమ్మెల్యే.. బాధితురాలైన రత్తమ్మకు తన ఆస్పత్రిలోనే సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ నిర్వహించారు. కడుపులోని గడ్డను తొలగించి రోగి ప్రాణాలను కాపాడారు. ఓ పక్క ఎమ్మెల్యేగా.. ప్రతిరోజు పలు కార్యక్రమాల్లో క్షణం తీరిక లేకుండా గడుపుతున్న తెల్లం.. అవకాశం వచ్చినప్పుడల్లా తన వైద్య వృత్తికి న్యాయం చేస్తూ ఇటువంటి అరుదైన ఆపరేషన్లను నిర్వహిస్తూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రజల ప్రాణాలను కాపాడటం పట్ల పలువురు అభినందిస్తున్నారు. ప్రజా ప్రతినిధిగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడినందుకు బాధితురాలు రత్తమ్మ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి సురేఖపై ఇష్టానుసారంగా పోస్టులా?

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశాయి. దీనికి నిరసనగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ ముట్టడికి ప్రయత్నించాయి. ఆ కార్యాలయం ముందు బీఆర్ఎస్‌దిష్టిబొమ్మను దహనం చేసేందుకు అధికార పార్టీ కార్యకర్తలు ప్రయత్నించారు. మంత్రిపై సోషల్ మీడియాలో పెట్టిన అసభ్యకర పోస్టులను తక్షణమే తొలగించాలని కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు... కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకున్నాయి. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి.

కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

జపాన్ చేరిన డిప్యూటీ సీఎం భట్టి

- పలు కంపెనీలతో వ్యాపార చర్చలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విదేశీ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బృందం సోమవారం అమెరికా నుంచి జపాన్‌కు చేరుకుంది. హానిడా విమానాశ్రయంలో భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు అజయ్ సేథి, మధుసూదన్, అమన్ ఆకాష్ స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం వెంట ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కే.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి డీ రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ తదితరులు ఉన్నారు. ఈ బృందం మూడురోజులు జపాన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతుంది. రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆహ్వానిస్తారు. ఇక్కడ పర్యావరణహిత పరిశ్రమలు, అత్యాధునిక మైనింగ్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలిస్తారు. మూడు రోజుల పర్యటనలో సోమవారం భారత రాయబారి సీబీ జార్జి డిప్యూటీ సీఎం బృందానికి జపాన్ దేశంలోని పరిశ్రమలు, తెలంగాణలో పెట్టుబడులు, భాగస్వామ్య పరిశ్రమలకు ఉన్న అవకాశాలను సంక్షిప్తంగా వివరించారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి గౌరవార్థం భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన విందులో భట్టి విక్రమార్క ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అక్టోబర్ ఒకటవ తేదీ ఉదయం పెట్టుబడులతో వచ్చే కంపెనీలతో రౌండ్ టేబుల్ సమావేశం, వివిధ పారిశ్రామిక వేత్తలతో విడివిడిగా సమావేశాలు, అదేరోజు సాయంత్రం యమాంషి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి బృందం సందర్శిస్తుంది. రెండవ తేదీ తోషిబా, కవాసాకి, యాక్లహామ పరిశ్రమలను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి ఒకాస చేరుకోని మూడవ తేదీ పానాసోనిక్ హెడ్ క్వార్టర్స్ సందర్శిస్తారు. అనంతరం నాలుగో తేదీ హైదరాబాద్‌కు చేరుకుంటారు.

మూసీ బాధితులు ఐక్యంగా పోరాడాలి

నవతెలంగాణ-రాజేంద్రనగర్

మూసీ బాధితులు ఐక్యంగా ఉండి పోరాడితే ప్రభుత్వాలు ప్రజాశక్తి ముందు తలవంచక తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఢిల్లీలో రైతులు ఏడాది పాటు పోరాడితే ప్రధాని మోడీనే దిగి వచ్చి నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నారని, మూసీ బాధితులు కూడా అదేస్థాయిలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మూసీ బాధితులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. బుల్డోజర్లకు అడ్డుగా నిలబడుతామని హామీ ఇచ్చారు. అవసరమైతే బాధితుల తరపున సుప్రీంకోర్టుకైనా వెళ్తామని స్పష్టం చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అత్తాపూర్‌లో మూసీ బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు, అతని సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు పూర్తిగా బఫర్ జోన్‌లో ఉన్నాయని వాటిని మొదట కూల్చాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నమామి గంగే 2400 కిలోమీటరు ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తే.. అదే రేవంత్ రెడ్డి 55 కిలోమీటర్ల ప్రాజెక్టుకు రూ.లక్షన్నర కోట్లు ఏ విధంగా అవుతుందని ప్రశ్నించారు. మూసీ వరదల పేరుతో సామాన్యుల ఇండ్లు కూల్చి అక్కడ మాల్స్ ఎలా కడతారని అన్నారు. బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. చందాలు వసూలు చేసి మరీ తిరుపతిరెడ్డికి నాలుగు బెడ్‌రూమ్‌ల ఇండ్లు కట్టిస్తామని, ఆయన అక్కడికి వెళ్తారా అని ప్రశ్నించారు. 2013లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రత్యేక చట్టం చేశారని, ఇండ్లు, భూమి తీసుకుంటే మార్కెట్ వాల్యూకు మూడు రెట్లు నష్టపరిహారం ఇవ్వాలని ఆ చట్టంలో ఉందన్నారు. ఆ చట్టం ప్రకారం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు ఒక న్యాయం, పేద ప్రజలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు.ఢిల్లీలో రాహుల్ గాంధీ బుల్డోజర్ రాజ్యాన్ని వ్యతిరేకిస్తుంటే.. రాష్ట్రంలో మాత్రం రేవంత్‌రెడ్డి బుల్డోజర్ రాజ్యాన్ని నడుపుతున్నారని అన్నారు.

హైడ్రా విషయంలో ప్రభుత్వానికి హైకోర్టు చీవాట్లు పెట్టిందని తెలిపారు. మూసీ పరివాహ ప్రాంత ప్రజలందరూ ఒక వాట్సాప్ గ్రూప్‌ని క్రియేట్ చేసి ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు అండగా నిలబడాలని అన్నారు. కేసులకు భయపడితే తెలంగాణ వచ్చేదే కాదన్నారు. తమ ఎమ్మెల్యేలు, నాయకులు బాధితులకు ఏ కష్టం వచ్చినా క్షణాల్లో వాలిపోతారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు కంటతడి పెడుతూ.. కేటీఆర్ దృష్టికి తమ సమస్యను తీసుకొచ్చారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి బాధితుల మాటలు విని కన్నీరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, చాపకూర మల్లారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, కౌశిక్ రెడ్డి, వివేకానందగౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనచారి, శంభీపూర్ రాజు, నాయకులు కార్తీక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేనేతల ఓట్లతో గెలిచి పద్మశాలి ఆడబిడ్డను వేధిస్తారా?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేనేతల ఓట్లతో గెలిచిన కేటీఆర్ అదే పద్మశాలి ఆడబిడ్డనైన తనను అవమానిస్తున్నారని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేటశారు. చెప్పుకోలేని రీతిలో తనపై ట్రోల్ వీడియోలు చేస్తున్నారని తెలిపారు. అవే వీడియోలను వారి ఇంట్లో ఆడవారికి చూపిస్తే ఏమంటారో వినాలని సూచించారు. సోమవారం గాంధీభవన్ లో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలుమార్లు భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టారు. ఇన్‌ఛార్జీ మంత్రిగా తాను మెదక్ వెళ్లిన సమయంలో ఎంపీ రఘునందన్ చేనేత సమస్యలను తన దృష్టికి తెచ్చి చేనేత మాల తన మెడలో వేస్తే అందులోని గౌరవప్రదమైన నూలును చూస్తే ట్రోలింగ్ వీడియోలు చేస్తారా? అని ప్రశ్నించారు. ఇలాంటి వాటికి ఊరుకునేది లేదు కేసీఆర్, కేటీఆర్ ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మానసిక వేదనను కలిగించి కుటుంబాల్లో ఇబ్బంది పెడతారా? అని నిలదీశారు. తనకు నిద్ర, తిండి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మద్దతుగా బీఆర్ఎస్ కార్యాలయానికి వెళ్లిన వారిని కొట్టారని సురేఖ తెలిపారు. అధికారంలోకి కోల్పోయి పిచ్చిపట్టి దుర్మార్గమైన ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. కేటీఆర్, హరీశ్ రావు ఇంట్లో ఆడవారిపై ఇలాగే ట్రోల్ చేస్తే ఎలా ఉంటుందని ప్రశ్నించారు. తప్పుడు ట్రోల్ ఇలాగే చేస్తే కేసీఆర్‌ను పరిగెత్తిస్తామని హెచ్చరించారు.

డెంగ్యూతో మహిళ మృతి


(ఫైల్)

నవతెలంగాణ-లోకేశ్వరం

డెంగ్యూతో మహిళ ప్రాణం కోల్పోయింది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా లోకేశ్వరం మండలంలోని బాగపూర్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బైరి శ్రీలత(24)కు ఐదు రోజుల కిందట జ్వరం వచ్చింది. ఆమెను భర్త వినీత్ నిర్మల్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు డెంగ్యూ జ్వరం వచ్చినట్టు చెప్పారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని సూచించడంతో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందింది. వారికి ఇద్దరు కుమారులు (పెద్ద కుమారుడు 3 సంవత్సరాలు, చిన్న కుమారుడు 4 నెలలు) ఉన్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- అప్రమత్తంగా ఉండండి : అధికారులకు టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ సూచన



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో కూడా రబీ సీజన్ స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నదనీ,అందువల్ల విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ అధికారుల్ని హెచ్చరించారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను పునరుద్ధరించాలనీ, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. సోమవారంనాడాయన సూపరింటెండింగ్ ఇంజినీర్లు, చీఫ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో గరిష్ట డిమాండ్ 9,862 మెగావాట్లు కాగా, ఈ సారి 9,910 మెగావాట్లకు చేరిందని చెప్పారు. ఈ సీజన్ ముగిసే నాటికి గరిష్ట డిమాండ్ పదివేల మెగావాట్లకుపైగా నమోదయ్యే అవకాశం వున్నదనీ,విద్యుత్ వినియోగం 200 మిలియన్ యూనిట్లకంటే పెరుగుతుందని అంచనా వేశామన్నారు.

రాష్ట్రంలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక డిమాండ్ 15,370 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏడాది సెప్టెంబర్ 20వ తేదీ 15,570 మెగావాట్లుగా నమోదైందని వివరించారు. ఫీడర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ లేకుండా, ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని చెప్పారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక విద్యుత్ వినియోగం 292.51 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఏడాది 303.82 మి.యూగా నమోదైందని చెప్పారు.

మరో పెండ్లి చేసుకున్నారంటూ.. మెదక్ మున్సిపల్ కమిషనర్‌పై భార్య ఫిర్యాదు

- ఓయూ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్.. మరో మహిళను పెండ్లి చేసుకున్నారని అతని భార్య కళ్యాణి ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త మరో పెళ్లి చేసుకుంటున్నాడని తెలియడంతో నిలదీసిన కళ్యాణిని జానకిరామ్ హత్య చేస్తానంటూ కారులో తీసుకెళ్లినట్టు కళ్యాణి కుటుంబ సభ్యులు డయల్ 100కు సమాచారం అందించారు. దాంతో హబ్సిగూడ వద్ద జానకిరామ్ సాగర్‌ను ఓయూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ ఇప్పటి వరకు మూడు పెండ్లిండ్లు చేసుకున్నారంటూ అతని భార్య కళ్యాణి ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'ఔటర్'పై డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

- డాక్టర్ మృతి



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రంగారెడ్డి జిల్లా హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్‌పై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న నిలయ రెడ్డి(42) సోమవారం ఉదయం నాలుగు గంటల సమయంలో శంషాబాద్ నుంచి గచ్చిబౌలికి ఔటర్ రింగ్ రోడ్‌పై కారు డ్రైవింగ్ చేస్తూ వెళ్తున్నారు. అయితే హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద అతి వేగంగా వచ్చి డివైడర్‌ని ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు నడుపుతున్న నిలయరెడ్డి ఓఆర్ఆర్‌పై నుంచి కింద చెట్ల పొదల్లో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు కారు అతివేగమే కారణమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు ఓట్లేస్తేనే కాంగ్రెస్ గెలిచింది

- కానీ వారినే మోసం చేస్తున్నారు : బీజేపీ దీక్షలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతులు ఓట్లేస్తేనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనీ, కానీ..ఆ రైతులనే రేవంత్‌రెడ్డి సర్కారు మోసం చేస్తున్నదని బీజేపీ ప్రజాప్రతినిధులు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు రైతు హామీల సాధన కోసం 24గంటల దీక్ష చేపట్టారు. బీజేపీ సీనియర్ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అనేక హామీలిచ్చి, నేడు గారడీలు చేస్తోందని విమర్శించారు. రైతేడ్చిన రాజ్యం బాగుపడదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.బీజేపీ శాసన సభాపక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి గజినీలా తయారయ్యారని విమర్శించారు. ఇచ్చిన హామీలు మరిచావా? లేక మరిచిపోయినట్టు నటిస్తున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. రైతులకు అండగా మేముంటాం.. కాంగ్రెస్ మెడలు వంచుతామని హెచ్చరించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేసిందని చెప్పారు. కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో సీట్లు రాలేదనీ, అందుకే పేదల ఇండ్లు కూలుస్తోందని చెప్పారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలన దుర్మార్గంగా ఉంటే..అంతకంటే ఘోరంగా రేవంత్ పాలన ఉందని విమర్శించారు. కేసీఆర్ రెండోసారి అధికారంలోకి రాగానే రాచరిక పాలన సాగించారన్నారు. అందుకే ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని విమర్శించారు. కేసీఆర్ ఉద్యమ సమయంలో పులిలా ఉండి ఇప్పుడు పిల్లిలా మారారని ఎద్దేవా చేశారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ చనిపోయిన రైతు కుటుంబాలను కనీసం పరామర్శించని బీఆర్ఎస్ నేతలు ఇవ్వాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని తెలిపారు. నాడు బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ అదే విధానాన్ని అవలంభిస్తున్నాయని చెప్పారు. పదేండ్లలో బీఆర్ఎస్ ఎంత అపఖ్యాతి మూట కట్టుకుందో.. పది నెలల్లో కాంగ్రెస్ అంత మూట కట్టుకుందని ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలు తీర్చటం బీజేపీకే సాధ్యమని చెప్పారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ రుణమాఫీ పూర్తిగా సాధ్యం కాదని తెలిసి కూడా కాంగ్రెస్ నేతలు హామీలిచ్చారని చెప్పారు.ఆరు గ్యారంటీలు పూర్తి చేసే సత్తా కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీలు కోడెం నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, పాల్వాయి హరీశ్‌బాబు, జిల్లా బీజేపీ అధ్యక్షులు తదితరులు మాట్లాడారు.

అగాధంలో కీలక రంగాలు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన మౌలిక వసతుల రంగాలు ప్రతికూల వృద్ధిని చవి చూశాయి. మూడున్నరేండ్ల తర్వాత తొలిసారి మైనస్ స్థాయికి పడిపోయాయి. కేంద్ర పరిశ్రమల, వాణిజ్య మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించిన గణంకాల ప్రకారం.. 2024 ఆగస్టులో ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తి ఏకంగా 1.8 శాతం ప్రతికూల వృద్ధిని చవి చూశాయి. ముఖ్యంగా బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్ట్స్, సిమెంట్, విద్యుత్ రంగాల ఉత్పత్తి భారీగా క్షీణించింది. ఇంతక్రితం జులైలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ఎనిమిది కీలక రంగాలు 6.1 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. ఇవి 2023 ఆగస్టులో ఏకంగా 13.5 శాతం వృద్ధిని సాధించింది. చివరి సారిగా 2021 ఫిబ్రవరిలో మైనస్ 3.3 శాతం పెరుగుదలను నమోదు చేశాయి.గడిచిన ఆగస్ట్ నెలలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్, విద్యుత్ రంగాలు వరుసగా 8.1 శాతం, 3.4 శాతం, 3.6 శాతం, 1 శాతం, 3 శాతం, 5 శాతం చొప్పున ప్రతికూల వృద్ధిని చవి చూశాయి. సహజ వాయువు ఉత్పత్తి వరుసగా రెండో మాసంలోనూ మందగించింది. గత తొమ్మిది నెలల్లో ఎప్పుడూ లేని విధంగా సిమెంట్ రంగం క్షీణించగా.. రిఫైనరీ ఉత్పత్తులు మూడు నెలల్లో రెండో సారి పతనమయ్యాయి.మరోవైపు ఎరువులు 3.2 శాతం వృద్ధితో స్వల్ప ఉపశమనం కలిగించాయి. స్టీల్ ఉత్పత్తి 4.5 శాతానికి మందగించింది. 2024 ఇదే నెలలో స్టీల్ ఉత్పత్తిలో ఏకంగా 16.4 శాతం వృద్ధి చోటు చేసుకుంది. దేశంలోని మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ(ఐఐపీ)లో కీలక రంగాల వాటా 40.27 శాతంగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఎనిమిది రంగాలు మైనస్‌లోకి జారుకోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థ డిమాండ్‌లో తీవ్ర ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయని భావించవచ్చు. ఈ ఏడాది ఆగస్టులో కీలక రంగాల పరిశ్రమల ఉత్పత్తి భయంకరంగా పడిపోయిందని ఇక్రా రేటింగ్ ఏజెన్సీ పేర్కొంది. గడిచిన 42 నెలల్లో ఇదే అత్యంత పతనం అని తెలిపింది.

ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై క్షేత్ర పరిశీలన

3 నుంచి 7 వరకు పైలెట్ ప్రాజెక్ట్ :సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న పరిశీలనను సమర్థవంతంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని, పూర్తిగా పట్టణ, నగర ప్రాంతమైతే రెండు వార్డులు, డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో మొత్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. వార్డులు, డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిశీలన బందాల సంఖ్యను పెంచుకోవాలని సీఎం సూచించారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు, డివిజన్ల ఎంపిక పూర్తైందని అధికారులు సీఎంకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టును ఎన్ని రోజులపాటు చేపడతారని సీఎం ప్రశ్నించారు. అక్టోబరు 3 నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంతా సమ్మతిస్తే కుటుంబం ఫొటో తీయాలనీ, అదో ఆప్షనల్‌గా ఉండాలనీ, కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలనీ, అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం వద్దనున్న రేషన్‌కార్డు, పింఛన్-స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణమాఫీ, బీమా, ఆరోగ్యశ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందనీ, పైలెట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతో పాటు కొత్త సభ్యులను జత చేయడం, మరణించిన వారిని తొలగిస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులు చేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వొద్దని హెచ్చరించారు. పైలెట్ ప్రాజెక్టుతో బయటకు వచ్చిన సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను పరిహరించిన అనంతర పూర్తి స్థాయి క్షేత్ర స్థాయి పరిశీలన చేపడదామని ముఖ్యమంత్రి తెలిపారు. సమీక్షలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సంగీత సత్యనారాయణ, మాణిక్‌రాజ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిద్ధరామయ్యపై ఈడీ కేసు

- ఎఫ్ఐఆర్‌లో కర్నాటక సీఎం ప్రథమ నిందితుడిగా నమోదు
- జాబితాలో సతీమణి, బావమరిది సహా మరొకరి పేరు

బెంగళూరు: కర్నాటక రాజకీయాల్లో ముడా స్కామ్ (మైసూరు నగరాభివృద్ధి సంస్థ) కుంభకోణం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో చిక్కుకున్న సీఎం సిద్ధరామయ్యపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ విషయాన్ని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భూముల వ్యవహారంలో సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇటీవల కర్నాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించడంతో ఆయనపై లోకాయుక్త కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆ ఎఫ్ఐఆర్‌లో సిద్ధరామయ్యను ప్రథమ నిందితుడిగా పేర్కొంది. ఆయన సతీమణి పార్వతి, బావమరిది మల్లికార్జున్ స్వామితో పాటు మరో వ్యక్తి పేరును జాబితాలో చేర్చింది.అయితే ముడా స్థలాల పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై విచారణకు హాజరు కావాలంటూ సిద్ధరామయ్యకు కర్నాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాత్ తాఖీదులు జారీ చేసిన సంగతి తెలిసిందే. సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు వారసత్వంగా వచ్చిన భూములను 'ముడా' స్వాధీనం చేసుకుని మరో చోట స్థలాలు మంజూరు చేసింది. స్వాధీనం చేసుకున్న భూముల కంటే మంజూరు చేసిన స్థలాల విలువ ఎక్కువగా ఉందని ఆరోపణలు వచ్చాయి.మరోవైపు, ఇదే కేసులో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేయడాన్ని సవాల్ చేసిన సీఎంకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆ సమయంలో కర్నాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. ఈ క్రమంలోనే ఆయనపై లోకాయుక్త ఎఫ్ఐఆర్ నమోదు చేయగా.. తాజాగా ఈడీ కూడా కేసు నమోదు చేసింది.

పారిశ్రామికవేత్తల కోసమే మోడీ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ ప్రసంగిస్తూ కాంగ్రెస్, బీజేపీ సిద్ధాంతాల మధ్య పోరు సాగుతున్నదని అన్నారు. హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి మార్పు తీసుకువస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఒకవైపు న్యాయం (కాంగ్రెస్), మరోవైపు అన్యాయం (బీజేపీ) ఉంది" అని అన్నారు. సామాన్యులు కష్టాలు పడుతుంటే పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఖాతాలో మాత్రం సునామీలా డబ్బులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. "అదానీ జీ గురించి ఆలోచించండి, అతను ఉదయాన్నే నిద్రలేస్తాడు, అతను పొలంలో పని చేయడు, నాగలిని ఉపయోగించడు, చిన్న వ్యాపారం చేయడు, కానీ మంచి ఆహారం తింటాడు, రాజభవనంలో నివసిస్తున్నాడు. డబ్బు వస్తూనే ఉంటుంది. అతని బ్యాంకు ఖాతాలో 24 గంటలు డబ్బులు పడుతూనే ఉంటాయి" అని రాహుల్ పేర్కొన్నారు.

రైతులు పండించిన పంటలకు సరైన ధర లభించడం లేదని, ఆర్మీలో చేరాలని భావించినప్పుడు అగ్నిపథ్ పథకానికి తలొగ్గేలా చేశారన్నారు.

"ఇది అగ్నివీర్ పథకం కాదు, జవాన్ల పెన్షన్ దొంగిలించడానికి ఇది ఒక మార్గం, ఇది కేవలం. సాధారణ జవాన్‌కు జీవితాంతం పెన్షన్ వస్తుంది. ఒక అగ్నివీర్‌కు పెన్షన్ రాదు. అంటే వారి జేబుల్లో నుంచి డబ్బు లాక్కున్నారు, అని రాహుల్ గాంధీ అన్నారు. ఇజ్రాయిల్ , యూఎస్ కంపెనీలు ఆయుధాలు తయారు చేస్తాయి. అదానీ వాటిపై తన కంపెనీ లేబుల్‌ను వేస్తాడు, ఆపై భారత సైన్యం అదానీ డిఫెన్స్ నుంచి కొనుగోలు చేస్తుంది. అదానీ డబ్బు సంపాదిస్తాడు. అందులో సగం రాజకీయాలకు ఇవ్వబడుతుంది. పార్టీని, డబ్బును మోడీ మార్కెటింగ్‌కు ఖర్చు చేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు. అంబానీ, అదానీలకు ఎంత డబ్బు ఇచ్చారో, అదే మొత్తాన్ని రైతులు, పేదలు, కూలీలు, దళితులకు ఇస్తానన్నది నా లక్ష్యం. మోడీ ప్రభుత్వం అదానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకు రూ.16 లక్షలు రుణమాఫీ చేసి రైతుల రుణమాఫీ చేయలేదని ఆరోపించారు.రాహుల్ గాంధీ తన ప్రసంగంలో, పార్టీ ఎన్నికల వాగ్దానాలను ప్రస్తావించా రు. ఇందులో ఎంఎస్‌పీకి చట్టబద్ధమైన హామీ, కుల సర్వే ప్రతి మహిళకు నెలకు రూ. 2,000, అధికారంలోకి వస్తే రూ. 500కి గ్యాస్ సిలిండర్‌ల వాగ్దానాలు న్నాయి. "హర్యానాలో ప్రస్తుత మున్న ప్రభుత్వం అవసరం లేదనీ, రైతులు, కార్మికులు, పేదల ప్రభుత్వం" అవసరమున్నదని స్పష్టం చేశారు. పేదలు, సామాన్యుల జేబుల్లోకి ఎంత డబ్బు వెళుతోంది, ఎంత పోతోందో చూడాలని కాంగ్రెస్ నేత అన్నారు. ర్యాలీ ముగియగానే, సెల్జా, హుడాతో సహా వేదికపై ఉన్న నాయకులందరూ ఏకమై ఏకతాటిపైకి వచ్చేలా రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ "మార్పు" గురించి మాట్లాడుతుందని, రాష్ట్ర ప్రజలను "అవమానించే" వారిని అధికారం నుంచి తరిమికొట్టాలని ప్రియాంక గాంధీ అన్నారు.సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బుల్డోజర్ పాలన

- రాహుల్ గాంధీకి హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో బుల్డోజర్ పాలన నడుస్తున్నదని కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. మూసీ రివర్ ఫ్రంట్, హైడ్రా ప్రాజెక్టుల విషయంలో హైకోర్టు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న నిరంకుశ పాలన బుల్డోజర్‌కు ప్రతీకగా మారిందని ఆక్షేపించారు. ఇండ్లను నిర్మించేందుకు ఉపయోగించాల్సిన బుల్డోజర్లను నిర్మాణాలను కూల్చేందుకు ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వెల్ఫేర్ బోర్డు పథకాలు ఇన్సూరెన్స్ కంపెనీలకివ్వొద్దు



- బోర్డు కార్యదర్శికి తేల్చిచెప్పిన జేఏసీ నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దనీ, బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి ప్రభుత్వమే నిర్వహించాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల నేతలు తేల్చిచెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో జేఏసీ నేతలతో భవన, ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు కార్యదర్శి, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ ఇ. గంగాధర్ చర్చలు జరిపారు. జేఏసీ బృందంలో తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటంరాజు, భవన నిర్మాణ రంగాల రాష్ట్ర కార్మిక సంఘం (బిఎన్‌ఆర్‌కెఎస్) రాష్ట్ర అధ్యక్షులు కామెళ్ళ ఐలయ్య, స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎస్‌బిఎన్‌కెఎస్) రాష్ట్ర అధ్యక్షులు కుమార్, భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ (టిబిఎన్‌కెటియు) చిన్నారావు, బిఆర్‌టియు యూనియన్ పాలడుగుల రమేష్, సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సీసీఏ) చాంద్ పాషా తదితర నాయకులు ఉన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అడ్వైజరీ కమిటీని ప్రభుత్వమే స్కీమ్‌లను బోర్డు ద్వారా కార్మికులకు అందించాలని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. బోర్డులో పేరు నమోదు చేయించుకున్న కార్మికులందర్నీ రెన్యూవల్ చేయాలనీ, కొత్త సంక్షేమ పథకాలు, పెన్షన్, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్‌లు, కార్మికులకు గృహ వసతి, అడ్డాల్లో మౌలిక వసతులు, తదితర సౌకర్యాలను కల్పించాలని విన్నవించారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన మోటార్ సైకిళ్ళను కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. అడ్వైజరీ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కార్యదర్శి హామీనిచ్చారు. మిగతా అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పీజీ లాసెట్‌లో 871 మందికి సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీ లాసెట్ మొదటి విడత ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా సోమవారం సీట్లు కేటాయించారు. ఈ మేరకు లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాకోర్సుల్లో కన్వీనర్ కోటాలో 961 పీజీ సీట్లున్నాయని వివరించారు. 1,925 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. వారిలో 871 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఈనెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని కోరారు. ఈనెల తొమ్మిది నుంచి పీజీ లా కోర్సుల్లో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

బతుకు ముఖ్యమా..? సుందరీకరణ ముఖ్యమా..

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవ తెలంగాణ-సిద్దిపేట



'పేద ప్రజల బతుకులు ముఖ్యమా.. మూసీ నది సుందరీకరణ ముఖ్యమా.. మీ నిర్ణయం వల్ల ప్రజలు రోడ్డున పడ్డారు' అని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేట నియోజకవర్గ ఆటో కార్మికులకు యూనిఫారమ్‌లు, మృతి చెందిన కుటుంబాలకు ఇన్సూరెన్స్ చెక్కులను హరీశ్‌రావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 1.50 లక్ష కోట్లతో సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ చేయనున్నారని, అది ఎవరికైనా ఉద్యోగం ఇస్తుందా, ఆదుకుంటుందా అని ప్రశ్నించారు. 25 వేల ఇండ్లు కూల్చేస్తామనడంతో ఎన్నో ఏండ్లుగా ఇండ్లు కట్టుకొని నివసిస్తున్న పేద ప్రజలు కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో పిల్లలకు పురుగుల అన్నం, నీళ్ల చారు దిక్కయిందని, అవ్వలకు పింఛన్లు రావడం లేదని వారికి ఆ డబ్బులు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు అతీగతీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని, ప్రతి ఆటో కార్మికునికి నెలకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలన్నారు. 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ఒక్క కుటుంబాన్ని పరామర్శించలేదని, ఆదుకోలేదని ఆరోపించారు. సిద్దిపేట ఆటో సొసైటీ దేశానికే ఆదర్శమని, రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తున్నామని, అవసరం ఉన్న వారికి తక్కువ వడ్డీకి రుణం అందిస్తున్నామని అన్నారు. రూ.2.10 కోట్ల రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. 26 మంది ఆటో కార్మికులు చనిపోతే రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్టు తెలిపారు. ఆటో కార్మికులు మద్యం, గుట్కా అలవాట్లు మానుకోవాలని, కుటుంబాలను బాగా చూసుకోవాలని సూచించారు. సిద్దిపేట ఆటో కార్మికుల కోసం పెట్రోల్ బంక్ మంజూరు చేయిస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ పాల సాయిరాం, నాయకులు, ఆటో యూనియన్ నాయకులు సంపత్ రెడ్డి, లక్ష్మణ్, మల్లేశం, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం నిరంతర పోరాటం



- సవాళ్లను అధిగమించాలి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో/కాప్రా

మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడుతూనే ఉండాలని, సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం హైదరాబాద్ ఐద్వా హైదరాబాద్ సౌత్ జిల్లా 3వ మహాసభ సంతోష్‌నగర్‌లోని ఆలం కుందుమిరి ఆఫీసులో నిర్వహించారు. అలాగే, ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభ జిల్లా అధ్యక్షులు నన్నపనేని సృజన అధ్యక్షతన ఈసీఐఎల్ కమలానగర్ భాస్కర్‌రావు భవన్ జిల్లా ఆఫీస్‌లో జరిగింది. ఈ మహాసభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు విద్య, వైద్యం, రాజకీయాలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకెళ్తూ విజయాలు సాధిస్తున్నా.. మరోవైపు వివక్ష, అణచివేత కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు ప్రతి ప్రజా పోరాటంలోనూ ఎన్నో త్యాగాలు చేశారని, చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయంగా రావాల్సిన హక్కులు, అధికారాలను ఇప్పటికీ సంపూర్ణంగా అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలు ఏం తినాలి, ఏ బట్ట కట్టుకోవాలి అనే విషయాలను కూడా బీజేపీ నాయకులు శాసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై లైంగికదాడులు, హత్యలు జరుగుతుంటే నిందితులకు ఆ పార్టీ నాయకులు అండగా ఉంటున్నారని విమర్శించారు. హత్రాస్, ఉన్నావో, మహిళా క్రీడాకారులపై లైంగిక దాడులే దీనికి నిదర్శనం అన్నారు. మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ధరలు తగ్గించి మహిళలకు ఉపాధి పెంచేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలని, మహిళా శక్తికి తగిన విధంగా అవకాశాలు కల్పించే ఆర్థిక, సామాజిక విధానాలను రూపొందించాలని కోరారు. మహిళలు లేకుండా అభివృద్ధి లేదని, సమానత్వం లేకుండా సాధికారత లేదని, అందుకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి భవిష్యత్‌లో సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

మూసీ ప్రాజెక్ట్ పేరుతో దేశంలోనే అతి పెద్ద కుంభకోణం

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు రిజర్వ్ బ్యాంకులా ఈ ప్రాజెక్ట్



- ' నమామీ గంగే'కు రూ.40 వేల కోట్లయితే మూసీ ప్రాజెక్ట్ కోసం రూ. లక్షా 50 వేల కోట్లా?
- ప్రజల సొమ్ము మీ అయ్యా జాగీరా?
- కాలయముడిలా మారిన రేవంత్ రెడ్డి
- బాధితుల ఆక్రందనలు రాహుల్, ప్రియాంక గాంధీలకు వినబడటం లేదా? : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ ప్రాజెక్ట్ అనేది దేశంలోనే అతి పెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ రిజర్వ్ బ్యాంకులా దాన్ని వాడుకోనుందని ఆయన ఆరోపించారు. 2,400 కిలోమీటర్ల నమామీ గంగే ప్రాజెక్టుకే రూ. 40 వేలు కోట్లు ఖర్చయితే...55 కిలోమీటర్ల మూసీ ప్రాజెక్ట్ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తారా? అని ప్రశ్నించారు. ప్రజల సొమ్ము మీ అయ్యా జాగీరా? అంటూ నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీ బాధితుల పట్ల కాలయముడిగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుల ఆక్రందనలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు వినబడటం లేదా? అని ప్రశ్నించారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వారి కోసం అవసరమైతే సుప్రీం కోర్టునూ ఆశ్రయిస్తామని తెలిపారు.

సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ పాలన, ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పేదల ఇండ్లు కూల్చమని ఇందిరమ్మ చెప్పిందా? లేక సోనియాగాంధీ చెప్పారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో నడుస్తున్న బుల్డోజర్ అరాచకాలను పరిగణనలోకి తీసుకుని చట్టప్రకారం వెళ్లమని సూచించిన హైకోర్టు ధన్యవాదాల తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు భరోసానిస్తున్న సీనియర్ నాయకులకు అభినందనలు తెలిపారు. వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ 300 రోజులైనా చేసిందేమి లేదని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశం పైన లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసం? అని నిలదీశారు.

హైడ్రా, జీహెచ్ఎంసి బిల్డింగ్‌లను కూల్చాలి

కూలగొట్టాల్సి వస్తే.. ముందుగా నాలాల మీద ఉన్న హైడ్రా, జీహెచ్ఎంసీ భవనాలను కూల్చాలని కేటీఆర్ అన్నారు. అనుమతి ఇచ్చిన ప్రభుత్వమే కూల్చేస్తుందంటే ఆ ప్రభుత్వానికి తన మీద తనకు నమ్మకం లేనట్టే అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే భావనతో ఎఫ్‌టీఎల్‌లో ఉందనే కారణంతో సచివాలయాన్నికూడా సీఎం రేవంత్ రెడ్డి కూల్చేస్తారేమోనన్న అనుమాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు.

తెలంగాణ మెప్మా ఆర్‌పిల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక




రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జె.చంద్రకళ, డి. శ్రీరేవతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ మెప్మా ఆర్‌పీల యూనియన్(సీఐటీయూ అనుబంధం) గౌరవాధ్యక్షులుగా ఎస్వీ.రమ, రాష్ట్ర అధ్యక్షులుగా జె.చంద్రకళ, ప్రధాన కార్యదర్శులుగా డి.శ్రీరేవతి ఎన్నికయ్యారు. మొత్తం 31 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటైంది. అందులో తొమ్మిది మంది ఆఫీసు బేరర్లు, 22 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఉండనున్నారు. ఉపాధ్యక్షులుగా కమటం పద్మ, నాచారం బాలమణి, గుండాల మంజుల, కార్యదర్శులుగా కానూరి శోభన, పుట్ట సుభద్ర, కరంజికర్ శారద, కోశాధికారిగా ఆత్మకూరి పద్మ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎస్వీ.రమ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెప్మా యూనియన్ రాష్ట్ర సదస్సులో పలు తీర్మానాలు చేశామని తెలిపారు. ఆర్‌పీలకు కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరకమైన యూనిఫాం ఇవ్వాలనీ, రూ.10 లక్షల సాధారణ బీమా కల్పించాలని కోరారు. గుర్తింపు, హెల్త్ కార్డులివ్వాలని కోరారు.

రేపటి నుంచి కేవీపీఎస్ 26 వసంతాల ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఏర్పడి 26ఏండ్లు పూర్తయినందున బుధవారం నుంచి ఈ నెల ఐదు వరకు ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేడుకల సందర్భంగా అన్ని ప్రాంతాల్లో జెండాలు ఎగురేయాలని పిలుపునిచ్చారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాల సాధన కోసం, అంటరానితనం కులవివక్షకు వ్యతిరేకంగా ఒక చారిత్రాకవసరంగా కేవీపీఎస్ ఏర్పడిందని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు నిర్వహించిదని పేర్కొన్నారు. కుల వివక్ష అంటరానితనంపై వందలాది గ్రామాల్లో సర్వేలు అధ్యయనాలు నిర్వహించి 128 రకాల కుల వివక్ష రూపాలను వెలికి తీసిందని గుర్తు చేశారు .వందల సంఘాలను ఐక్యం చేసిందని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ ఏర్పాటు కోసం దశలవారి పోరాటాలు నిర్వహించి జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను సాధించామని పేర్కొన్నారు. దళిత, గిరిజనుల జనాభా దామాషా ప్రకారం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించాలనీ, చట్టం చేయాలనే డిమాండ్‌పై అనేక సంఘాలను కలుపుకుని సాధించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో దళితుల పై జరిగిన దాడులు,దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రాజీలేని ఉద్యమాలు నిర్వహించి బాధితులకు బాసటగా నిలబడిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పోరాడుతున్నదని తెలిపారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాలని, పరువు హత్యలను అరికట్టాలని ఉద్యమాలు నిర్వహిం చిందని తెలిపారు. చర్మకారుల, డప్పు కళాకారుల సమస్యల సాధన కోసం ఉద్యమించిందని పేర్కొన్నారు.



జోకర్లుగా కేటీఆర్, హరీశ్‌రావు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ధ్వజం
- మంత్రి పదవిపై ఆశలేదు.. ఇస్తే కాదనను

నవతెలంగాణ-కామారెడ్డి

మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆలోచించి మాట్లాడాలని, వారి మాటలు వింటుంటే వారు జోకర్లని ఇట్టే అర్థమవుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి తగిన ఓట్లు రాకపోవడం వల్లే హైడ్రా పేరుతో కూల్చివేతలు చేస్తున్నారని కేటీఆర్, హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఆయన పైవిధంగా స్పందించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్.. గజ్వేల్ ముంపు భూములపై తాము అడగడానికి వెళ్తే మధ్యలోనే తమను అడ్డగించి మూడు గంటలు అటు.. ఇటు.. తిప్పి 12 గంటల పాటు అరెస్టు చేశారని గుర్తుచేశారు. కాళేశ్వరంపై కమిషన్‌కు ఇంజనీర్లు కూడా సమాధానం చెప్పే పరిస్థితి లేదన్నారు. హైడ్రా ద్వారా పేదల ఇండ్లను కూల్చబోమని, అక్రమ కట్టడాలను మాత్రమే కూలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న వాటిని మాత్రమే కూలుస్తున్నారని తెలిపారు. కాగా, దసరా తర్వాత జరగబోయే మంత్రి వర్గ విస్తరణలో మంత్రిగా వచ్చే అవకాశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. మంత్రి పదవిపై తనకు ఆశ లేదని అన్నారు. మంత్రి పదవి కావాలని అడగబోమని, కానీ అధిష్టానం ఇస్తే కాదనని తెలిపారు. తాను పదేండ్లు మంత్రిగా, ఐదేండ్లు మండలి నాయకునిగా పనిచేశానని తెలిపారు. మంత్రి పదవులు తనకు కొత్త కాదని, మంత్రి పదవి విషయంలో అధిష్టానం నిర్ణయమే తుది నిర్ణయమని తేల్చి చెప్పారు.

ముగిసిన ఐఎఫ్‌డబ్ల్యూజే సమావేశాలు

- జర్నలిస్టుల సమస్యలపై చర్చ

నవతెలంగాణ-హైదరాబాద్

ఉత్తరప్రదేశ్‌లోని మథుర(బృందావన్)లో మూడు రోజుల పాటు జరిగిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే) 77వ జాతీయ కౌన్సిల్ సమావేశాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు మొదటి సెషన్‌లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి ధారాసింగ్ చౌహాన్, రెండో సెషన్‌లో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరై మాట్లాడారు. ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ అధ్యక్షులు కే. విక్రమ్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల అనుబంధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ న్యూస్ పేపర్స్ అండ్ న్యూస్ ఏజెన్సీస్ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్ నాయకులు పాల్గొని చర్చల్లో పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిపారు. ఈ సమావేశాల్లో ఐఎఫ్‌డబ్ల్యూజే సెక్రటరీ జనరల్ విపిన్ దులియా, కాన్ఫడరేషన్ అధ్యక్షుడు ఇందుకాంత్ దీక్షిత్, ప్రధాన కార్యదర్శి బలరాం యాదవ్, కార్యదర్శి పులిపలుపుల ఆనందం, మహిళా కార్యదర్శి శాంతకుమారి, నమ్రత భోరా, ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులు పాల్గొన్నారు. గవర్నర్, మంత్రిలకు తెలంగాణ ప్రతినిధి బృందం శాలువాలు కప్పి టీడబ్ల్యూజేఎఫ్ మెమెంటోలను బహుకరించింది. ఈ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, కార్యదర్శులు కర్రా అనిల్ రెడ్డి, వివేకానంద, రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు కంతేటి రమాదేవి, దయాకర్, మాజీ సభ్యులు కుడితాడు బాపురావు తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో స్వచ్ఛ తా హీ సేవ



నవతెలంగాణ-హయత్ నగర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సుమారు 15రోజుల పాటు సాగిన స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమం హయత్ నగర్‌లో ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రం(క్రీడా)లో నిర్వహించారు. స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత పరిశుభ్రతను సహజమైన అలవాటుగా, భారతదేశం లోని ప్రతి పౌరునిలో ప్రధాన సామాజిక విలువగా మార్చడం లక్ష్యం పెట్టుకుందని సీనియర్ సైంటిస్ట్ చంద్ర కాంత్ అన్నారు. 15 రోజుల పాటు మొక్కలు నాటడం,అవగాహన సదస్సులు, క్విజ్ పోటీలు,పలు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత లాంటివి చేపట్టారని వెల్లడించారు. ఆయన వెంట వ్యవసాయ పరిశోధన ఉద్యోగులు విజయ్ కుమార్, సుదీర్,చౌహన్,శ్రీ కష్ణ,రామకష్ణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్, జిల్లా కోశాధికారి కే కవిత, కమిటీ సభ్యులు అలేటి ఎల్లయ్య లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, నాన్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఎల్బీనగర్ అడ్డా అధ్యక్షులు లాట్ల లక్ష్మణ్, శ్రీనివాస్, బాలయ్య, సత్తయ్య, శ్రీశైలం, కృష్ణ, లింగమ్మ, పద్మ, సాలమ్మ, రాములమ్మ, భాగ్యమ్మ, రాధమ్మ, కుమారి, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-వనస్థలిపురం

సర్కారు భూమి హాంఫట్



- 10 ఎకరాల భూమిని కాజేసేందుకు సన్నాహాలు
- ఐదెకరాల్లో వెంచర్ ఏర్పాటుకు పనులు ముమ్మరం
- ఫ్రీడమ్ ఫైటర్స్ భూమి బై నెంబర్లతో అమ్మకాలు
- వెల్లువెత్తుతున్న ఆరోపణలు

నవతెలంగాణ-తుర్కయంజాల్

ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తుంటే... తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమార్కులు మాత్రం తమకేమీ పట్టదన్నట్టు వ్యవహరిస్తున్నారు. సర్కార్ భూమిని అప్పనంగా కాజేసే కుట్రలకు తెరలేపారు. సుమారు రూ.100కోట్లు విలువచేసే భూమిని చదును చేసి ప్లాట్లుగా మలిచి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి తుర్కయంజాల్ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 52లో సుమారు 58 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో అప్పట్లో ఫ్రీడమ్ ఫైటర్స్‌కు కొంత భూమి ని కేటాయించారు. ఈ భూమే ఇప్పుడు అక్రమార్కులకు హాట్‌కేక్‌లా తయారైంది. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను మభ్యపెట్టి కారుచౌకగా ఈ భూమిని అక్రమ మార్గంలో చేజిక్కించుకున్నారు. నకిలీ ఎన్‌ఓసీలు సృష్టించి, ల్యాండ్ కన్వర్షన్ చేయించుకున్నారు. ఇప్పుడు ఏకంగా ఈ భూమిలో వెంచర్ వేసేందుకు సిద్ధమయ్యారు. పెద్దపెద్ద జేసీబీల సాయంతో రాళ్లు, చెట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.

కాగా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై పలువురు స్థానికులు రెవెన్యూ, హైడ్రా, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమిని ఆక్రమించి చదును చేస్తున్న వ్యక్తులను రెవెన్యూ అధికారులు నిలువరించి పనులు బంద్ చేయించారు. తాత్కాలికంగా పనులు ఆగినా... భూ అక్రమార్కులు పలుకుబడిన వ్యక్తులు కావడంతో ఈ భూమిలో వెంచర్ ఎలాగైనా ఏర్పాటు అవుతుందన్న చర్చలు స్థానికంగా సాగుతూనే ఉన్నాయి.

భూమిని కాపాడేందుకు పోరాటాలు నిర్వహిస్తాం



ప్రభుత్వ భూములను ఆక్రమించినవారిపై ప్రభుత్వం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి. సర్కార్ భూముల పరి రక్షణే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలి. సర్వే నెంబర్ 52లో ప్రభుత్వ భూమిని పేదలకు ఇండ్ల స్థలాల కోసం కేటాయించాలి. ఈ భూమిని పేదలకు పంచాలని గతంలో పలు దఫాలుగా ప్రభుత్వ అధికారులకు వినతులు అందజేశాం. ఈ భూమిని కాపాడేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తాం.

ప్రభుత్వ భూములను కాపాడుతాం



ప్రభుత్వ భూములను కాపాడేందుకు మా వంతు ప్రయత్నం చేస్తాం. తుర్కయంజాల్‌లోని సర్వే నెంబర్ 52లో జరుగుతున్న అక్రమాల విషయం మా దృష్టికి వచ్చింది. రికార్డులను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

– సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్, అబ్దుల్లాపూర్‌మెట్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- జి.ఎస్.ఐ అదనపు డైరెక్టర్ జనరల్ సురేజ్ దోమజిఫటభజే



నవతెలంగాణ -నాగోల్.

ప్రతి ఒక్కరూ బాధ్యతతో నివాసిత పరిసరాలలో పరిశుభ్రతను పాటించినప్పుడే ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపగలమని జి.ఎస్.ఐ అదనపు డైరెక్టర్ జనరల్ సురేజ్ దోమజిఫటభజే అన్నారు. సోమవారం జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, జీహెచ్ఎంసీ వారి సంయుక్త ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్‌లోని బండ్లగూడలో గల మహావీర్ హరిన వనస్థలి నేషనల్ పార్క్ ముందు నిర్వహించిన స్వచ్ఛ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ , జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డిలతో కలిసి ఆయన స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. వనస్థలి పార్కు ముందు, మనసురాబాద్ రోడ్డుతో పాటు పలు కాలనీలలో జి.ఎస్.ఐ, జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది చీపుర్లను పట్టి శుభ్రం చేశారు.



జీఎస్ఐ అదనపు డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పరిసర ప్రాంతాలలో రోడ్లపై చెత్తను వేయకుండా పారిశుధ్య లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మన్సూరాబాద్ రోడ్డులో చెత్తను నివారించేందుకుగాను జీఎస్ఐ వారి సౌజన్యంతో సీసీ కెమెరాలు అమర్చినట్టు ఆయన తెలిపారు.పార్కుకు వచ్చేవారికి కూడా ఈ చెత్త వల్ల పర్యావరణ లోపించి అనారోగ్యాల గురికావాల్సి వస్తున్నదని దీనిని పరిసర ప్రాంత నివాసులు గమనించాలని అన్నారు. హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ యాదయ్య మాట్లాడుతూ

రోడ్లపై చెత్తను వేస్తే రూ.1000 జరిమానా వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, జిఎస్ఐ డీడీజీ లు, ఎల్‌పీ సింగ్, ఎస్ఎస్ పాత్ర, డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఎచ్ఓఓ హార్మోహన్ మిషరా, జాయింట్ డైరెక్టర్ ఎస్ తారకేశ్వర్ రావు, స్టోర్స్ ఆఫీసర్ ఆదర్ల మహేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మధిర సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ డివిజన్‌లో డిప్యూటీ కమిషనర్ పర్యటన



నవతెలంగాణ- నాగోల్

నాగోలు డివిజన్‌లోని మమత నగర్ కాలనీలో సోమవారం జీహెచ్ఎంసీ హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్‌తో కలిసి పర్యటించారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలోని ప్రధానంగా స్వీపింగ్ సమస్య ఉందని, రోడ్లు,కరెంటు స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ యాదయ్య వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ , జవాన్ లక్ష్మయ్య కాలనీ వాసులు ప్రభావతి, శ్రీధర్, సఫాయిలు వెంకటస్వామి, ఆనంద్, రవి,రాంకీ సూపర్వైజర్ సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు..

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-చంపాపేట్

తన ఇద్దరు పిల్లలను స్కూల్లో వదిలిన తన తండ్రి ఇంతవరకు తిరిగి రాకపోవడంతో కుమారుడు మలక్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా గోల్లప్రోలు గ్రామానికి చెందిన చిత్తా రపు అగ్గియ్య తన కుమారుడైన చిత్తారపు నాగబాబు ఇంట్లో ఉంటున్నాడు. వత్తి రీత్యా కార్మికుడు. ఈనెల 26న ఉదయం తన ఇద్దరు పిల్లలను మూసారాం బాగ్ లోని స్వామి వివేకానంద స్కూల్లో వదిలేందుకు వెళ్లాడు. ఇద్దరు పిల్లలను స్కూల్లో వదిలిన తర్వాత ఇంతవరకు తిరిగిరాలేదంటూ మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో అతని కుమారుడు చిత్తారపు నాగబాబు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మలక్ పేట ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-చంపాపేట్

సైదాబాద్ మండలం ఐఎస్ సదన్ డివిజన్ లోని డీఎస్ నగర్ లో నూతన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రణాళికలతో చేపట్టాలని, ఇంజినీర్, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఏఈ అన్సారి, డివిజన్ కార్యదర్శి ప్రశాంత్, కాలనీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం టీవీ కాలనీకి చెందిన ఎం. శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. వారి కుటుంబ సభ్యులకు టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్ మధుయాష్కి గౌడ్ చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. జిల్లా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రూ. 60వేల సీఎంఆర్ఎఫ్‌ను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోమంది పేదలకు నాణ్యమైన వైద్య సేవలకు సహాయపడుతుందని తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహ యాదవ్, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు కిషోర్ గౌడ్, మహిళా నాయకురాలు స్వర్ణ మాధవి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షుడిగా లింగాల

నవతెలంగాణ-హయత్ నగర్

బీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షుడిగా లింగాల శ్రీకర్ రెడ్డిని యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మదర్ డెయిరీ మాజీ చైర్మెన్‌ను సోమవారం మదర్ డెయిరీ(నార్మల్)స్టాఫ్ అండ్ వర్కర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాష బోయిన శివ శంకర్ ఆధ్వర్యంలో నూతన గౌరవ అధ్యక్షుడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సయ్యద్ హైమద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాజు,ఎల్లయ్య,బాల నర్సింహ, బాలకృష్ణ, రామ చంద్రా రెడ్డి,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తామని బడంగ్ పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గల నాదర్ గుల్ గ్రామంలోని ప్రధాన రహదారి రోడ్డు నిర్మాణం పనులను స్థానిక కార్పొరేటర్లతో కలిసి మేయర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘు, డీఈఈ యాదయ్య, కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, గూడెపు ఇంద్రసేన, నాయకులు బంగారి బాబు, సుభాన్ యాదవ్, బంగారి అశోక్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో గల 10వ డివిజన్ కుర్మల్ గూడలోని ఇందిరానగర్ కాలనిలో సీసీ రోడ్డు నిర్మాణం పనులను స్థానిక కార్పొరేటర్ భద్రమోని రోహిణి రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భద్రమోని రమేశ్, ఏఈఈ వినీల్ గౌడ్, నాయకులు కుల్లా జంపయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

హయత్ నగర్ విద్యార్థులకు పతకాల పంట...



నవతెలంగాణ-హయత్ నగర్

అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ ఫైవ్ నాట్ స్టూడెంట్స్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన పోటీల్లో హయత్ నగర్ విద్యార్థులు పతాకాల పంట సాధించారు. అండర్-18 షార్ట్ పుట్ విభాగంలో పి సుబ్బు గోల్డ్ మెడల్, డి బన్నీ షార్ట్ పుట్ సిల్వర్ మెడల్, 1000 మీటర్ల మోహన్ సిల్వర్ మెడల్, 400% మీటర్ల కాంస్య పతకం, అండర్ -16లో 600 మీటర్స్ పి చరణ్ స్వర్ణ పతకం, ఎం రేవతి కాంస్య పథకం, అండర్ -16 60 మీటర్ విభాగంలో గడ్డం లావణ్య రజత పతకం, అండర్-14 ట్రిత్లోన్ విభాగంలో ఎన్ శివ స్వర్ణ పతకం.బి సిద్ధార్థ్, రజత పతకం, కళ్యాణి స్వర్ణ పతకం, అనురాధ రజిత పతకం సాధించినట్టు హయత్ నగర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్న కోచ్ వినోద్ కుమార్ తెలిపారు.



జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తాం

- టీయుడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి

నవతెలంగాణ -ఎల్‌బీనగర్

జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తామని టీయుడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో సోమవారం టీయుడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం గత పది సంవత్సరాలుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఇండ్ల స్థలాల కోసం చేపడుతున్నటువంటి విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా లిస్టులను తయారుచేసి మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. ఆయన నుంచి ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు రాష్ట్ర యూనియన్ నాయకులు కషి చేస్తున్నారని తెలిపారు. సంఘాలకతీతంగా నియోజకవర్గంలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల వివరాలను సేకరించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు అసలు ఎవరు, కొసరు ఎవరు, అనేది తేల్చాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. ఇంటి స్థలాలతో పాటు ఆరోగ్య బీమా కల్పన తదితర అంశాలపై పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతుందన్నారు .త్వరలో జిల్లా కేంద్రంగా రాష్ట్ర స్థాయి పాత్రికేయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి మన సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయవలసిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సంరెడ్డి శశి పాల్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్ రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చ శేఖర్, శ్యాం ప్రసాద్, అవంచ సురేందర్, జంగయ్య చెప్పల శ్రీనివాస్, మేకల రవీందర్ రెడ్డి, చెరుకు వెంకట్ స్వామి గౌడ్, మధు, రమేష్, శ్రీనివాసరావు, రాజు, మహేష్, మట్ట అశోక్ గౌడ్, రాజేంద్రనగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సూర్య నారాయణ, ప్రేమ్ ,చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ



- ఘనంగా సన్మానించిన డైరెక్టర్ బీరప్ప

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ ఆస్పత్రిలోఉద్యోగం చేస్తున్న పలువురు ఉద్యోగులు సోమవారం పదవీ విరమణ చేశారు. ఆస్పత్రి మొదటి అంతస్తులోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ నగరి భీరప్ప వారిని ఘనంగా సత్కరించి, వారు ఆస్పత్రికి అందించిన సేవల్ని కొనియాడారు. పదవీ విరమణ పొందుతున్న వారిలో ఫణికుమార్, మేనేజర్, డేటా బేస్ అడ్మినిస్ట్రేషన్, రేష్మ శెట్టి, టెక్నికల్ ఆఫీసర్, యాదయ్య, సీనియర్ సెక్రెటీరియల్ అసిస్టెంట్, తిరుపతి రెడ్డి, సెక్యూరిటీ, శ్రీనివాస్ రావు, థియేటర్ అసిస్టెంట్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ డాక్టర్ శాంతివీర్, వివిధ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొని పదవీ విరమణ చేస్తున్న తోటి ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

ఘనంగా స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల స్నాతకోత్సవం

- కళాశాల వార్షికోత్సవం..



నవతెలంగాణ-ఓయూ

స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ వుమెన్ ఆధ్వర్యంలో హైటెక్ సిటీ నందుగల శిల్పకళా వేదిక లో సోమవారం రాత్రి కళాశాల స్నాతకోత్సవం, వార్షికోత్సవము ఘనంగా నిర్వహించారు.

వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. నేడు విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. జ్ఞానంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు ముఖ్యమని తెలియజేశారు. నేడు అనేక కంపెనీలు, పరిశ్రమలు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ కల్పన కోసం అనేక రకాలైన కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానిస్తుందని తెలియజేశారు. హైదరాబాద్ లక్షలాది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆసరాగా ఉందని తెలియజేశారు. సమాజం అభివృద్ధిలో మహిళా ఇంజనీర్లు ఎంతో అవసరమని చెప్పారు. పేద విద్యార్థుల సైతం ఇంజనీరింగ్ విద్యను చదువుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తుందని గుర్తు చేశారు.స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య నాలుగో సంవత్సరం పూర్తి చేసుకుని ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు శాస్త్రీయ పద్ధతిని అనుసరించి విషయాలను చూడాలని చెప్పారు. ఒక దేశం అభివృద్ధి ఆ దేశంలో ఉన్న విద్యార్థులు, యువతీ యువకుల పైన ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని కోరారు. విద్యార్థినులు కేవలం ఇంజినీరింగ్ తోనే ఆగిపోకుండా ఆపైన ఉన్నత చదువులను కూడా చదవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. విదేశాలకు కూడా వెళ్లి ఉన్నత చదువులను చదవాలని సలహా ఇచ్చారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఓయు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఓయు ప్రో.రాములు గౌరవ అతిథిగా హాజరయ్యారు. చొప్పదండి.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గౌరవ అతిథిగా హాజరయ్యారు. శ్రీనివాస రావు మహంకాళి (సీఈవో టి హబ్) మరియు గౌరవ బిషప్ ఎంఏ డేనియల్ (మెథడిస్ట్ చర్చ్ ఆఫ్ ఇండియా) వక్తలుగా హాజరయ్యారు. స్టాన్లీ కళాశాల సెక్రటరీ , కరస్పాండెంట్ కే. కృష్ణారావు, మేనేజ్మెంట్ సభ్యులు ఆర్ .ప్రదీప్ రెడ్డి , కళాశాల డీన్, అకాడమిక్స్ ప్రొఫెసర్ ఏ. వినయ్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక, డైరెక్టర్ డా. వి అనురాధ , ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి , అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వి అనురాధ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. డా.వి.అనురాధ కృతజ్ఞతతో కార్యక్రమంలో ముగించారు.

ప్రమాద సూచిక.. పసిగట్టాలిక...



నవతెలంగాణ-హయత్ నగర్

డ్రయినేజీ మ్యాన్ హెూల్ మూత పగిలిపోవడంతో అది తెరిచి ఉండడంతో వాహన దారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త కోసం చెట్ల కొమ్మలు నిలిపారు.మన్సూరాబాద్ లోని సౌత్ ఎండ్ పార్క్ లో కనిపించిన ఈ ఘటన కు అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రామంతాపూర్ డివిజన్ సమస్యలను పరిష్కరించాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతి



నవతెలంగాణ-ఉప్పల్

రామంతపూర్ డివిజన్ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం గంధం నాగేశ్వరరావుతో స్థానిక నాయకులు కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. శారదానగర్ ఏడీఆర్ఎం హాస్పిటల్ నుండి ఓల్డ్ రామాంతపూర్ బొడ్రయి వరకు బీటీ రోడ్డు, ఇంద్రానగర్ నగర్ మెట్లగల్లి నుంచి చివరి వరకు సీసీ రోడ్డు, శాంతినగర్ స్ట్రామ్ వాటర్ డ్రెన్ రీమోడలింగ్, ఈస్ట్ శ్రీనివాసపురం స్ట్రామ్ వాటర్ డ్రెన్ రీమోడలింగ్, భవానీ నగర్ స్ట్రీట్‌లో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు కోరారు.

మల్లాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించండి



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిలు సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్‌లో సీసీ రోడ్లు, రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు, థీమ్ పార్క్ పనులు, వివిధ కమ్యూనిటీ భవనాల పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించిన వీలైనంత త్వరగా మల్లాపూర్ డివిజన్‌లో పర్యటిస్తానని, నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం



- డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్
- తెలుగు ఉపాధ్యాయుడు నర్సింగరావుకు ఘన సన్మానం

నవతెలంగాణ-జవహర్ నగర్

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని జవహర్ నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మాదిరి నర్సింగరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు దంపతులను డిప్యూటీ మేయర్ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులకు ఉంటుందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, ఉద్యోగ నిర్వహణలో వారు చేసిన సేవలే పేరు ప్రఖ్యాతలను తీసుకొస్తాయన్నారు. రిటైర్మెంట్ జీవితం కుటుంబ సభ్యులతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆజామోహినుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రభుత్వ అధికారులు అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ జి. రాజేందర్ కుమార్ పదవీ విరమణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ చైర్మెన్ మాట్లాడుతూ..నాగారం మున్సిపల్ కమిషనర్‌గా రాజేందర్ కుమార్ నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారు ఆయురారోగ్యాలతో సంతోషమైన జీవితం గడపాలని కోరారు. అనంతరం కమిషనర్ దంపతులను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, వార్డ్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ కే. చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజనీర్ సుదర్శనం రఘు, సానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కులతో మానసిక ఉల్లాసం : కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

పార్కులు మానసిక ఉల్లాసానికి, ఆహ్లాదానికి, ఆనందానికి ఎంతగానో దోహదపడతాయని వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ తూర్పు ఆనంద్‌బాగ్‌లో రూ.11లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన పార్కును ఆమె కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చాలాకాలంగా నిరుపయోగంగా ఉన్న ఈ స్థలంలో ఏర్పాటు చేసిన పార్కు పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఇలాంటి పార్కులు డివిజన్ పరిధిలో మరిన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన



- పలు కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్ శ్రవణ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ విష్ణుపురి ఎక్సటెన్షన్ కాలనీలో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహనను కల్పించేందుకు మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఇండ్ల చుట్టూ ఉన్న మట్టి దిబ్బలను ఎత్తాలని ఇండ్ల యజమానులకు, రోడ్లపై ఉన్న గ్రీన్ వేస్ట్, డెబ్రిస్‌లను ఎత్తాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. స్ట్రీట్‌లైట్స్ సమస్యలను పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ సత్యనారాయణను కోరారు. త్వరలో ఇంజనీరింగ్ పనులను పూర్తి చేస్తామని కాలనీ వాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, శర్మ, బాబు నాయక్, బి.టీనాక్, రవీందర్, రాంచేందర్, సతీష్, రాజు, ఉన్నారు.

దమ్మాయిగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ఐదో వార్డులో చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఐదో వార్డులోని లక్ష్మీ నగర్ ఫేజ్-3లో మున్సిపల్ నిధులు రూ.4 లక్షలతో సీసీ రోడ్డు, మరో రూ.4లక్షలతో భూగర్భ మురికి కాలువ నిర్మాణ పనులను చైర్ పర్సన్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దశల వారీగా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్ గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-కాప్రా

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను ఈసీఐఎల్ క్రాస్ రోడ్డులోని గీతం జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలని, అనునిత్యం శాస్త్రీయ దృక్పథంతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని, తద్వారాన్ని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. నేటి విద్యార్థినీ, విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారి తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో అత్యధికులు అక్షరాసులుగా మారుతున్నా మూఢనమ్మకాల విషయంలో నిరక్షరాస్యులుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇది సమాజ హితం కాదని, దేశ పురోగతికి ఆటంకంగా ఉంటుందన్నారు. మనమందరం కలిసి ఇలాంటి సామాజిక రుగ్మతలపై అహర్నిశలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక ఎల్లప్పుడూ ఈ సమస్యలపై పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. అందరినీ కలుపుకొని మునుముందు మరిన్ని కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. అనంతరం మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పాఠశాలలకు మెమెంటోలను, విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పిట్టల నాగరాజు, మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్ని, మల్కాజ్గిరి మండల అధ్యక్షులు శివప్రసాద్, గీతం జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ ఇంద్ర, జన విజ్ఞాన వేదిక నాయకులు దుర్గా చారి, సిహెచ్ నారాయణ రాజు, బన్ను మరియు వివిధ పాఠశాలలు చెందిన ఉపాధ్యాయని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

ఐద్వా జిల్లా 3వ మహాసభలు

- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- జెండా ఆవిష్కరించిన ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేఎన్ ఆశాలత
- జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సిటీబ్యూరో/కాప్రా

ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభ సోమవారం ఈసీఐఎల్ కమలానగర్ భాస్కర్‌రావు భవన్ జిల్లా ఆఫీస్‌లో నన్నపనేని సజన అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లులక్ష్మి హాజరై మాట్లాడారు. అంతకుముందు ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేఎస్ ఆశాలత జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరవీరులకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కామ్రేడ్ సీతారామ ఏచూరి, వీరనారి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, లక్ష్మీదేవమ్మ, డి.సుశీల ఆశయాలను సాధిస్తామని పలువురు అన్నారు. ఈ మహాసభకు సందేశం ఇవ్వడానికి సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎ.అశోక్, కె.రవి హాజరై మహిళలు ఉద్యమించాలనీ, సాధికారిక సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల వినోద, ఆఫీస్ బేరర్స్ ఎ.విజయ, ఆర్.లక్ష్మి పి.మంగ, సఫీయ, ఎన్.పద్మ, సీహెచ్ లీలావతి, మీనాకుమారి, శారద, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా నూతన కమిటీని 29 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా నన్నపనేని సజన, ప్రధాన కార్యదర్శి మద్దెల వినోద, ఆఫీస్ బేరర్స్‌గా ఎ.విజయ, పి.మంగ, సఫీయ సుల్తానా, ఆర్.లక్ష్మి కె.శాంతకుమారి, బి.మీనాకుమారి, సీహెచ్ రోజారాణి, ఎన్.పద్మ సీహెచ్ లీలావతిని ఎన్నుకున్నారు.



ప్రజావాణికి 63 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 63 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జెఎల్‌బి.హరిప్రియకి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

విద్యార్థులకు ఎన్ఏఎస్ మాక్ టెస్ట్



నవతెలంగాణ-శామీర్‌పేట

మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నేషనల్ అచీవ్ మెంట్ సర్వే మాక్ టెస్టు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల సామర్థ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయుట జరుగుతుందని తెలిపారు. ఈ సర్వేలో భాగంగా మజీద్ పూర్ గ్రామ పరిధిలోని ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి పరిశీలించామని తెలిపారు.

ఆర్‌యూబీ నిర్మాణ ప్రాంతం పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వాజ్‌పేయి నగర్ రైల్వేగేట్ వద్ద చేపడుతున్న ఆర్‌యూబీ నిర్మాణం ప్రాంతాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సోమవారం రైల్వే అధికారులు, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ శాఖల ఇంజనీర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..స్థానికులు ఆస్తులు ఎక్కువగా కోల్పోకుండా, భవిష్యత్తులో ఇంకా ట్రాఫిక్ పెరిగే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 80 కోట్లు కేటాయించిందని, పనులు ఏడాదిలోపు పూర్తవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రైల్వేస్ సంజీవ్ కుమార్, ఈఈ, ఆర్ అండ్ బీ శ్రీనివాస్ మూర్తి, జేఈఆర్ అండ్ బీ రంజిత్, వాటర్ వర్క్స్ డీజీఎం రాజు, మేనేజర్ నవీన్, ఎలక్ట్రికల్ ఏడీ ఈ యాదగిరి, ఎ.ఈ గోపాల్, బీఆర్ఎస్ నాయకులు జగదీష్ గౌడ్, పరశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, రాము యాదవ్, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, జి.కె హనుమంతరావు, చిన్నయాదవ్ మధుసూధన్ రెడ్డి, సాయి గౌడ్, గుత్తి రామ్ చందర్, తులసి సురేష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : పరమేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. సోమవారం ఉప్పల్ హిల్స్ కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. కాలనీల్లో అభివృద్ధి పనులను చేపడుతూ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. త్వరలో ఉప్పల్ హిల్స్‌లో రూ.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపటనున్నట్టుగా తెలిపారు. కార్యక్రమంలో దుర్గం నవీన్, అబ్బయ్య, తోట శ్రీనివాస్ రెడి, గోవింద్ కుమార్ స్వామి, రామచంద్రర్, సత్యనారాయణ చారి, సుధాకర్ రెడ్డి, మేడిశెట్టి క్లైమేట్ , దినేష్, రాజు చారి, సతీష్ కుమార్, రవీందర్ రెడ్డి, సోమేశ్ కురుమ, శ్రీనివాస్‌గౌడ్, కావలి వెంకటేష్ యాదవ్, యాదగిరి, స్వప్నారెడ్డి, అరుణ, నిర్మల, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకొని కాప్రా డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ రావు, కుషాయిగూడ పోలీస్ ఎస్ఐ వెంకన్నతో కలిసి కాప్రా గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో బస్తీ వాసులకు పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ.. పౌరహక్కుల చట్టంపై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించుటకు ప్రతి ఊరిలో తహశీల్దార్, పోలీస్ డిపార్ట్మెంట్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. విద్య, ఉపాధి, కార్యకలాపాల్లో చేతలతో, చూపులతో అస్పృశ్యత భావంతో పౌరుల విధులకు ఆంటకం కలిగిస్తే చట్టం ప్రకారం అట్రాసిటీ కేసులకు గురవుతారని చెప్పారు. ఎవరైనా రెండు గ్లాసుల పద్ధతి పాటించినా, ప్రోత్సహించినా, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం పౌరుల రక్షణకు పనిచేస్తుందన్నారు. మహిళలు, యువత తమకు ఎలాంటి అసౌకర్యం కలిగించే సంఘటన ఎదురైనా వెంటనే పోలీస్ వ్యవస్థకు సమాచారం అందించాలని తెలిపారు. యువత తమ కెరీర్ పై దృష్టి సారించాలన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే తమ దృష్టికి తేవాలన్నారు. ప్రతి ఊరిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ వాసులు మాజీ కౌన్సిలర్ బాలమ్మ , గాంధీనగర్ మహిళలు మణెమ్మ , అంజలి, ధనలక్ష్మి , శ్వేతా, జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏ మంజుల , గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రెటరీ జి కృష్ణ , సభ్యులు నర్సింగ రావ్ ,యమ్ ముత్యాలు , గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ , బాలయ్య , రామ్ చందర్, ఉన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత



నవతెలంగాణ-కీసర

కరీంగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఓడయ్య, కిషోర్‌లు విద్యార్థులకు స్టేషనరీ, నోట్ బుక్స్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో శశిధర్, ఎమ్ఎన్ఓ జమదగ్ని, హెచ్ఎం టి.శ్రీధర్, ఉపాధ్యాయులు సుధాకర్ జి.మధు బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎర్ర జెండా లక్ష్యం

- సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా నాయకురాలు ఎం వినోద, ఉప్పల్ కార్యదర్శి జె. వెంకన్న
- 4న రామంతాపూర్‌లో రాష్ట్ర నేతల పర్యటన



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజా సమస్యల పరిష్కారమే ఎర్రజెండా లక్ష్యం అని, పేదల ఇండ్లజోలికి వస్తే, పేదలకు ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా నాయకురాలు ఎం. వినోద, ఉప్పల్ సీపీఐ(ఎం) కార్యదర్శి జె. వెంకన్న అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని దేవేందర్ నగర్ శాఖ మహాసభ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ మహాసభలో భీష్మచారిని దేవేందర్ నగర్ శాఖ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే. వెంకన్న, భీష్మాచారిలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులే అన్నారు. దేవేందర్ నగర్‌లోని స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తాన్నారు. ఇక్కడున్న స్కూల్ బిల్డింగ్‌ను స్కూలుకు ఉపయోగించేటట్టు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం రామంతపూర్‌లో మూసీ వెంట ఉన్న ఇండ్లను కూల్చాలని చూస్తుందన్నారు. ఆ ఇండ్లను కూల్చకూడదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నెల నాలుగో తేదీన రాష్ట్ర నేతలు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తదితరులు రామంతాపూర్‌లో పర్యటించి ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ మహాసభలో నాయకులు ప్రపూర్ణ, సుజాత, నరసింహారెడ్డి, చార్లెస్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త రిక్షాలు పంపిణీ



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరి చౌరస్తాలోని ఇందిరా మహిళా భవన్‌లో పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త తరలించే రిక్షాలు, పుష్ కార్ట్‌లను సోమవారం మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మట్కాడుతూ.. మల్కాజిగిరి డివిజన్‌ను పారిశుద్ధ్యంలో ఆదర్శంగా మార్చుటకు అనేక కార్యక్రమలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 'స్వచ్ఛ తా హ్యా సేవ' కార్యక్రమం ద్వారా చెత్తను బహిరంగా ప్రదేశాల్లో రంగోలి వేయుట, చెత్త వేస్తున్న వారిని గుర్తించి స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు అందజేయాలని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పారిశుధ్య కార్మికులు విధులలో నిర్లక్ష్యం వహించరాదనీ, వర్షాలు అధికంగా వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని, మురికి వాడలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ ఉప వైద్యాధికారిణి మంజుల, శ్రీనివాస్, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, జవాన్ అజయ్, అంజయ్య, వసంత, బాలమణి, సంతోష, గిరి, ఎస్ఎఫ్ఎలు, పాల్గొన్నారు.

రైతును రాజును చేయడమే లక్ష్యం

- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి
- నష్టాల్లో ఉన్న సొసైటీని లాభాల్లోకి తీసుకొచ్చాం
- సొసైటీ చైర్మెన్ మధుకర్ రెడ్డి
- శామీర్‌పేట సొసైటీ 43వ సాధారణ సమావేశం



నవతెలంగాణ-శామీర్‌పేట

రైతును రాజును చేయడమే లక్ష్యంగా ముందుకెళున్నామని డీసీఎంఎస్ వైస్ చైర్మెన్, శామీర్‌పేట సొసైటీ చైర్మెన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం సమావేశ మందిరంలో 43వ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టాల్లో ఉన్న శామీర్ పేట వ్యవసాయ సహకార సంఘాన్ని లాభాల్లో తీసుకువచ్చి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దామని తెలిపారు. సొసైటీలో భారీ సంఖ్యలో రైతుల సభ్యత్వ నమోదు చేశామన్నారు. ఆ వాటా రూ. 35.27 లక్షలకు చేరుకుందని చెప్పారు. సంఘంలో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు మొత్తం 9890 మంది ఉన్నారని తెలిపారు. హైదరాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డ్ నిధులతో రెండు గోదాములు, ఒక అగ్రి అవుట్‌లెట్ కార్యాలయం నిర్మాణానికి కోటి 80 లక్షల రుణం తీసుకున్నామని చెప్పారు. మూడుచింతలపల్లిలో నిర్మిస్తున్న అగ్రి అవుట్‌లెట్ నిర్మాణానికి రూ.94 లక్షలు మంజూరు చేశారన్నారు. అలాగే దీర్ఘకాలిక రుణాలకు రూ.2 కోట్లు ఇచ్చారని తెలిపారు. స్వల్పకాల రుణపరిమితిని రూ. 30 లక్షలకు బ్యాంకు వారు మంజూరు చేశారని తెలిపారు. 2023-24లో చేపట్టిన పరపతేతర వ్యాపారాల్లో ఆడిట్ లెక్కల ప్రకారం రూ.25,35 లక్షలకు పైగా లాభాలు చేకూర్చామని తెలిపారు. అలాగే సొసైటీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జీవో 43 ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రైతులకు అందుబాటులో కూరగాయలు సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు ఎలా నిర్వహించాలనే అంశంపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మెన్ ఐలయ్య యాదవ్, కో-ఆపరేటివ్ జాయింట్ రిజిస్టర్ సురేఖ, రైతుబంధు కమిటీ మాజీ అధ్యక్షులు కంఠం కృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చలో 'లేబర్ కమిషనరేట్' కు సీఐటీయూ నాయకులు..



- సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కాని లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

దేశవ్యాప్తంగా 2024 సెప్టెంబర్ నెలలో కాంట్రాక్ట్ క్యాజువల్ అవుట్సోర్సింగ్, అసంఘటిత రంగం, ఆటో హమాలీ, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించి, సర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారానికై సోమవారం జరిగే చలో లేబర్ ఆఫీస్ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లా పూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో.. షాపూర్ నగర్ రైతు బజార్ దగ్గర నుంచి బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షులు అంజయ్య కే .శ్రీను, మల్లారెడ్డి, బాషా, తాయన్న, ఆంజనేయులు, కరుణాకర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

అల్వాల్‌లో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నిర్మాణ పనులను సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, ఆశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని డీఎంఅండ్‌హెచ్ఓ సూచించారు. డీఎంఅండ్‌హెచ్ఓ వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణుగోపాల్, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శోభ, అల్వాల్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యాకేందర్ రెడ్డి ఉన్నారు.

దసరా సెలవులకు ఊరు వెళ్తున్నారా.. జరభద్రం

- దొంగతనాల నివారణకు సైబరాబాద్ పోలీసుల ముఖ్య సూచనలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దసరా పండుగ సెలవులకు ఊరు వెళ్లాల్సి వస్తే జరభద్రం... సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో.. సూచనలతో కూడిన ప్రకటన సోమవారం విడుదల చేశారు.

మీ విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోండి. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి. సెలవులలో బయటకు వెళుతున్నప్పుడు సెక్యూరిటి అలారంతో పాటు మోషన్ సెన్సర్‌ను ఏర్పాటు చేసుకోవడం మంచింది. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉన్న తాళము అమర్చుకునడం మరి మంచిది. తాళము వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే మీ పరిధి స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం తప్పక ఇవ్వండి. మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి.. లేదా డయల్ 100 కు ఫోన్ చేయండి.మీ వాహనాలను మీ ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. మీ ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయండి,మీకు వీలైతే చక్రాలకు చైన్స్‌తో కూడా లాక్ వేయడం మంచిది.

నమ్మకమైన వాచ్ మెన్‌లను మాత్రమే సెక్యూరిటి గార్డులుగా నియమించుకోండి.మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్లైన్ లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్లు, పాల ప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలి. వాటిని కూడా గమనించి చోరులు దొంగతనాలకు పాల్పడుతారన్న విషయాన్ని గమనించాలి. ప్రధాన ద్వారానికి తాళం కప్ప వేసినప్పటికి అవి కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయడం ఉత్తమం. బయటకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల,బయట కొన్ని లైట్లు వేసివుంటే చాలా మంచిది. మీ ఇంటి దగ్గర మీకు నమ్మకమైన ఇరుగు, పొరుగు వాళ్ళకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తు ఉండమని చెప్పడం మర్చిపోవద్దు. మీ ఇంటికి వచ్చే, వెళ్ళే దారులు, ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చుకొని డివిఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో ఉంచాలి. బీరువాలు, కబోర్డ్స్‌కు సంబంధించిన తాళాలు కామన్ ఏరియా అయిన చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల క్రింద, అల్మారా పైన, డ్రెస్సింగ్ టేబుల్‌లో కబోర్డ్స్‌లో ఉంచకుండా మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో పెట్టడం మంచిది. బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్లకు వెళ్ళేటప్పుడు తగు జాగ్రతలు తీసుకోవడం మర్చిపోవద్దు. సోషల్ మిడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడము ఎట్టి పరిస్థితుల్లో మంచిది కాదు. ఇది ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలి. బస్తీల్లో, కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి. మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే 100 టోల్ ఫ్రీ నెంబర్‌కు గాని, సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ కానీ సమీప పోలీస్ స్టేషన్‌కు గాని 9490617100, కు లేదా మా వాట్సాప్ నెంబర్ 9490617444,కు డయల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



- కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజావాణి కార్యక్రమమని, సమస్యలను పరిష్కరించడంపై ఆయా అధికారులు దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులకు ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వచ్చిన వారి సమస్యను అడిగి తెలుసుకుంటూ కమిషనర్ విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజావాణి కార్యక్రమమని, ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా (5) విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 42 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ 23, ఈ.ఎన్.సి 4, ట్యాక్స్ విభాగం 4, స్పోర్ట్స్ 3, డిప్యూటీ కమిషనర్ (సర్కిల్ 28, 30)లకు సంబంధించి 2, యు.బి.డి, అడ్వర్టైజ్మెంట్, ఎలక్షన్, హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బి, ఎస్టేట్స్ విభాగాలకు ఒకటి చొప్పున విన్నపాలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, వేణు గోపాల్ రెడ్డి, సత్యనారాయణ, అడిషనల్ సీసీపీలు ప్రదీప్ కుమార్, గంగాధర్, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వెంటనే పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ వెంకటయ్య
- జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలనీ, ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ప్రత్యేక చర్య లు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ వెంకట య్య సూచించారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకట్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినప్పుడు వాటికి అవసరమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టి కోర్టులో కేసులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసు శాఖ వారిని కోరారు. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు కానీ, కేసుకు అవసరమైన సాక్ష్యాలను సరైన విధంగా సేకరించి కోర్టుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే పౌర హక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) పీసీ ఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రా సిటీ, పీఓఏ) చట్టాలను ఖచ్చితంగా అమయ్యేలా అవసర మైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతిని అడిగి తెలు సుకున్నారు. ఈ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలనీ, ఏమాత్రం పెండింగ్‌లోఉంచరాదని సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. ఈ కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదైన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కు ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దష్టికి తీసుకు రావాలని సభ్యులకు సూచించారు. అట్రాసిటీ కేసుల్లో అవసరమైన కుల ధృవీకరణల జారీలో చాలా వరకు జాప్యం జరుగుతుందనీ, వీలైనంత తొంద రగా జారీ చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. కేసులు పెట్టిన వారిపై రకరకాల ఒత్తిడులు వస్తుంటా యనీ, దీన్ని దష్టిలో పెట్టుకుని వారికి పోలీసులు, ఇతర శాఖలు అండగా నిలవాలని సూచించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో కేసులు నమోదైన వెంటనే దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులు వారి వారి సమస్యలను చైర్మెన్‌కు విన్నవించుకోగా, చైర్మెన్ స్పందిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను కోరారు. ఈ సమా వేశంలో మల్కాజిగిరి డీసీపీ కోటిరెడ్డి, బాలానగర్ డీసీపీ సురేష్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబర్లు వెంకటేష్, ధనరాజ్ నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దోడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుడదన్నారు. డివిజన్ పరిధిలోని సాయి నగర్, వెస్ట్ కాలనీ రోడ్డు నెంబర్ 4లో రూపాయలు పదిహేడు లక్షల నిధులతో నిర్మిస్తున్న.. సీసీ రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. రోడ్డును ప్రణాళికతో లెవెలింగ్ చేసి, వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, రాజేష్ చంద్ర, వీరస్వామి జ్యోతిబా, సాయి, కోటేశ్వరరావు, రామయ్య చౌదరి, బాలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడికి 'సహృదయా ఫౌండేషన్' ఆర్థిక సాయం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. సహృదయా ఫౌండేషన్(యూఎస్ఏ) సహకారంతో రాజీవ్ గృహకల్పలో 34వ బ్లాకులో నివాసముండే ఎం. శ్రీకాంత్ అనే వికలాంగునికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండర్ శరత్ సుదర్శి మాట్లాడుతూ... ప్రేరణ ఫౌండేషన్ పేద విద్యార్థులు, మహిళలు, వికలాంగులకు చేయూత నిచ్చేందుకు నిత్యం కృషి చేస్తుందని అన్నారు. శ్రీకాంత్‌కు ఆర్థిక సహకారం అందించిన సహృదయ ఫౌండేషన్ ఫౌండర్ బిందు తాడివాకా (యూఎస్ఏ)కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో సీఐటీయూ కుత్బులాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు పసుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

తెలంగాణ-కూకట్‌పల్లి

ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లకు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. సోమవారం ఎమ్మెల్యే నివాస క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా ప్రజా సమస్యలపై, ప్రతినిత్యం వారికి అందుబాటులో ఉంటూ.. వారికి అండగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఎక్కడైనా రోడ్లు, డ్రయినేజీ సమస్యలు ఉంటే తెలుసుకుని వెంటనే వాటిని పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలని తెలిపారు. హైడ్రాకి సంబంధించి ప్రజల్లో ఒక భయం ఏర్పడిందని దీనిని తుడిచిపెట్టే బాధ్యత మనపై ఉందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఉత్సవాలు కూడా ప్రారంభమవుతున్న సందర్భంగా.. వేడుకలకు ఎక్కడ ఆటంకం కలగకుండా శాంతి భద్రతలను కాపాడుతూ, ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతినిత్యం ప్రజా శ్రేయస్సు కోసమే పోరాడుతూ బీఆర్ఎస్ పార్టీ పదేండ్ల కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ పెండింగ్ పనులు కూడా పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలని తెలిపారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సభ్య సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మిద్దెల బాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. 2023-2024 సం॥ పు పరిపాలన నివేదికను, ఆదాయ వ్యయములు, లాభ నష్టములు, ఆస్తి అప్పులను ఆమోదం తెలుపడం జరిగింది. సంఘము నికరలాభం 49.88 లక్షలు ఆర్జించ నైనట్లు...సంఘ అధ్యక్షులు మిద్దెల బాల్ రెడ్డి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రుణమాఫీ గురించి బ్యాంకువారితో వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదించమని తెలిపారు. సంఘ కార్యదర్శి సయ్యద్ అసదుల్ల సంఘ పరిపాలన నివేదికను సంఘ కార్యకలాపముల వివరములను సభ్యులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు ఏ.వెంకటేష్, సంఘ డైరెక్టర్లు ఎస్.భీంరెడ్డి డప్పు కిష్టయ్య, సిహెచ్ మహిపాల్ రెడ్డి, వి.సత్యనారాయణ రెడ్డి, డి.ఇంద్రసేనా రెడ్డి ఈదుల కంటి యాదయ్య రైతులు పాల్గొన్నారు.


రెండు రోజుల ముందుగానే బతుకమ్మల సందడి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రెండు రోజుల ముందుగానే కూకట్‌పల్లి గ్రామంలో బతుకమ్మల సందడి ప్రారంభమైంది. సోమవారం వైభవంగా మొదలైన బతుకమ్మ వేడుకల్లో గ్రామంలోని హనుమాన్ టెంపుల్ వద్ద మహిళలు బతుకమ్మ ఆడుతున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల కంటే ఒక రోజు ముందుగానే కూకట్‌పల్లిలో బతుకమ్మ సంబరాలు ప్రారంభమవడం ఆనవాయితీగా వస్తుందని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. అందులో ఒక్క రోజు ముందు మంగళవారం రావటంతో, ఈ ఏడాది రెండు రోజుల ముందుగా మొదలైన సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సంప్రదాయం బద్ధంగామ బతుకమ్మ వేడుకలు ప్రారంభించారు.

పదవి విరమణ శుభాకాంక్షలు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేసి, పదవీ విరమణ చేసిన శ్రీధర్ గౌడ్‌ని సోమవారం గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు కలసి ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ తర్వాత వారి శేష జీవితాన్ని ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ అధ్యక్షులు కే.రాజారెడ్డి, వైస్ చైర్మెన్ సమ్మెట ప్రసాద్, జనరల్ సెక్రెటరీ శ్రీపురాణం విశ్వనాథ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హజ్రత్ ప్రసాద్, కె.వి.రామకృష్ణ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ సుమ, రమణ, చక్రపాణి, వి.రామ్ కుమార్, కే శంకర్ శ్రీ శ్రీధర్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు.

ప్రతి కార్యకర్త అంకితభవంతో పనిచేయాలి



- మల్కాజిగిరి ఎంపీ.ఈటల రాజేందర్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రతి కార్యకర్త బీజేపీ శ్రేయస్సు కోసం అంకిత భావంతో పనిచేయాలని మల్కాజిగిరి ఎంపీ.ఈటల రాజేందర్ సూచించారు. ఈ మేరకు సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ మహారాజ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై గాజులరామారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పగిడి శంకర్ రెడ్డి కి మేడ్చల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, స్థానిక కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరితో కలిసి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజా సంక్షేమం పేరుతో పేద, సామాన్య ప్రజలను సంక్షోభంలోకి నేడుతున్న కాంగ్రెస్ కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. హైడ్రా పేరుతో కొత్త డ్రామాకు తెరలేపిన సీఎం.రేవంత్ సర్కార్ పై ప్రజలు విరుచుకుపడుతున్నా రన్నారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని విమర్శించారు. పేద, సామాన్యులకు ఏ కష్టం వచ్చినా అండగా తాను నిరంతరం ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

నేటి నుంచి డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ డీఎస్సీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. క్వాలిఫై అయిన అభ్యర్థులు నేటి నుంచి 1:3 ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధిరిణి ఆర్. రోహిణి తెలిపారు. నేటి నుంచి ఈనెల 5 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెరిఫికేషన్ ఉంటుందని వెల్లడించారు. 1:3 ప్రకారం క్వాలిఫై అయిన అభ్యర్థుల వివరాలు http://dcebhyderabad.webnode.in ద్వారా, మొబైల్ ఎస్ఎంఎస్, ఈమెయిల్ ద్వారా తెలియచేయడం జరుగుతుందని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్స్(ఆల్ మీడియా), లాంగ్వేజ్ పండిట్స్ ఈనెల 5 వరకు గవర్నమెంట్ మోడల్ ఆలియా హైస్కూల్, నాంపల్లి, ఎదురుగా ఎల్బీ స్టేడియం నందు హాజరుకావాలని, సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఆల్ మీడియా), ఫిజికల్ ఎడ్యుకేషనల్ టీచర్స్.. ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ మహబూబియా, లేపాక్షి ఎదురుగా, అబిడ్స్ నందు హాజరుకాలని డీఈవో పేర్కొన్నారు. వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు, ఒక సెట్ గెజిటెడ్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీ తప్పనిసరి అని డీఈఓ తెలిపారు.



నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ ఎన్టీఆర్ పార్క్‌లో అక్టోబర్ 2వ తేదీ బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని.. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని సోమవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనరర్ సాజ్యకు పలు అసోసియేషన్ వారు, కార్పొరేటర్ ఆహ్వాన పత్రికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, ప్రగతిమహిళా సాధికారిత వేదిక కన్వీనర్ రోజారాణి, ప్రగతి కల్చరల్ అసోసియేషన్ కన్వీనర్ కే. శంకర్ రావు, ప్రగతి యూత్ అసోసియేషన్ కన్వీనర్ ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి



- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

డిగ్రీ, పి.జి, ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులు చదువుతున్న 16లక్షల మంది బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్ షిప్ పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన సోమవారం ఇంద్రపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ డిగ్రీ, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు 3సం॥గా ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు పూర్తి చేసిన సర్టిఫికేట్లు ఇవ్వకపోవడంతో ఒక వైపు విద్యార్థులు ఇంకొక వైపు కాలేజీ యాజమాన్యాలు తీవ్రంగా నష్ట పోతున్నారు. కాలేజీ యాజమాన్యాలు లెక్చరర్ల జీతాలు చెల్లించక పోవడంతో పస్తులుంటారు. అలాగే అద్దె భావనాలలో కొనసాగుతున్న కాలేజీలలో అద్దెలు చెల్లించక ఇబ్బందులకు గురువుతున్నారు. కాలేజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు స్కాలర్షిప్లు సంవత్సరానికి 5500 రూపాయలు చెల్లిస్తే అవి ఎక్కడ సరిపోతాయని పశ్నించారు. పక్క రాష్ట్రం ఏపీలో 20వేల రూపాయలు, కర్నాటక రాష్ట్రంలో 15వేల రూపాయలు స్కాలర్ షిప్ ఇస్తే ఇక్కడ మన రాష్ట్రంలో అనేక వాగ్దానాలు చేసి అధికారులకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ 5500 ఇస్తే ఎక్కడ సరిపోతాయి. అందుకే డిగ్రీలు చదువుకుంటున్న విద్యార్థులకు 5500 నుండి 20 వేలకు పెంచాలి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను దసరా లోపు చెల్లించకపోతే ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడించడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మహా ధర్నాలో నాయకులు నీల వెంకటేష్, అంజి, అనంతయ్య, రాజేందర్, రాంకోటి, నందా గోపాల్, రామ్ మూర్తి, సతీష్, పవన్, ప్రీతం, హరీష్, రవి, రామ్ దేవ్ మోదీ, ప్రభాకర్, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి..
అందించిన సేవలు అభినందనీయం..



- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న

నవతెలంగాణ - ధూల్ పేట్

గత 42 ఏండ్లుగా మునిసిపల్ శాఖలో విధులు నిర్వహించిన ఏఎంసీ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అందించిన సేవలు అభినందనియమని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న అన్నారు. చాంద్రాయణ గుట్ట నర్కి ఫూల్ బాగ్‌లోని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ మీటింగ్ హాల్‌లో సోమవారం చాంద్రాయణ గుట్ట సర్కిల్ అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ (ఏఎంసీ) పి. మోహన్ రెడ్డి పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంసీహెచ్, జీహెచ్ఎంసీ లోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహించిన ఆయన విశిష్ట సేవలు అందించారన్నారు. ఆయన సేవలను ఉద్యోగులు ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణ గుట్ట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ఈఈ సన్నావుద్దీన్ , డిఈ(ఎస్ డబ్ల్యూ ఎం) అన్నపూర్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ భానుచందర్, యూసీడి డిపిఓ రత్నమ్మ, సూపరింటెండెంట్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత నిర్ధారణ కేంద్రాలను
విరివిగా ఏర్పాటు చేయాలి'

- తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ కె.వినయ్ కిషోర్ యాదవ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో ఆహార పదార్ధాలను నిరోదించడానికి స్వచ్ఛత నిర్ధారణ కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ కె.వినయ్ కిషోర్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూ కల్తీని గుణపాఠంగా తీసుకోవాలని, కల్తీ ఆహార పదార్ధాలను విరివిగా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో కొంత మంది కల్తీదారులు చెలగాట మాడుతున్నారని ఆరోపించారు. ఆహార పదార్థాల నాణ్యతను గుర్తించడానికి ఆధునిక టెక్నాలజీతో స్వచ్ఛత నిర్ధారణ కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని కోరారు.ఆహార పదార్థాల స్వచ్ఛతపై రాష్ట్ర ప్రభుత్వం 30 జిల్లాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేశారు.అన్ని రకాల ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్నారని, ఏది స్వచ్ఛత, ఏది కల్తీ అనేది ముందు తెలియడం లేదన్నారు.స్వచ్ఛ ఆహార పదార్థాలు నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందించ డానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'3న నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్ షిప్-24 పోటీలు ప్రారంభం'



- తెలంగాణ నుంచి 8 మంది క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-హిమాయత్ నగర్

3వ నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్-2024 పోటీలు అక్టోబర్ 3 నుండి 5 వరకు పుదుచ్చేరిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానున్నాయని కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు డా.రొయ్యూరు సురేష్, ప్రధాన కార్యదర్శి వసంత మాధురి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ నుండి ఎనిమిది మంది ఆటగాళ్లు బి.ఎం. పవన్ కుమార్, ఎం.నాగ అక్షయ, మేజర్ పద్మజ, ఎం.లక్ష్మి చైతన్య, జి.కృష్ణ మూర్తి, ఆర్.ప్రత్యుష, కర్లింగ్ అసోసియేషన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి అయిన వి.వసంత మాధురి ఎంపిక అయినట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు భిన్నంగా పోటీ ఇచ్చి తెలంగాణకు పథకాలు సాధిస్తామని వారు పేర్కొన్నారు.

సినారె స్ఫూర్తి : డాక్టర్ చెన్నకేశవరెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

ఇంజనీరింగ్ వైపు వెళ్ళవలసిన నేను డాక్టర్ సి. నారాయణ రెడ్డి కవిత్వం చదివి, వారి కవిత గానం విని ఆ స్ఫూర్తితో తెలుగు భాషా సాహిత్యాల వైపు వచ్చానని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ జి. చెన్నకేశవరెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న సమావేశంలో సోమవారం పరిషత్తులోని డాక్టర్ దేవుల పల్లి రామానుజరావు కళామందిరంలో తన జీవితము, సాహిత్యం పై ప్రసంగించారు. ఏడవ తరగతిలో హిందీలో కవిత, పియుసి లో తెలుగు కవిత రాశానని తెలిపారు. బందరు వెళ్లి విశ్వనాథ వారిని కలుసుకున్నానని, దేవుల పల్లి కృష్ణశాస్త్రి తోను పరిచయం కలిగిందని, ఆయన పాటలు చాలా ఇష్టమని చెన్నకేశవరెడ్డి వివరించారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోప న్యాచేస్తూ విద్యార్థులకు అవసరమైన అంశాలు పాఠ్య ప్రణాళికలో తక్కువగా ఉంటున్నాయని అన్నారు. చెన్న కేశవరెడ్డి గేయ సాహిత్యం పై రచించిన గ్రంథం మాత్రా ఛందస్సు గురించిన అవగాహన కలిగిస్తుందని తెలి పారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. చెన్నకేశవరెడ్డి తెలుగు అకాడ మీలో, తెలుగు విశ్వవిద్యాలయంలో అందించిన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ప్రాచ్య కళాశాల ప్రధానా చార్యుడు డాక్టర్.ఏ.సిల్మా నాయక్ సమావేశకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అమ్మంగి వేణుగోపాల్, టి.గౌరీ శంకర్, నందిని సిద్ధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, సి వసుంధర రెడ్డి తదితర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మెట్రో ప్రయాణికులకు షాక్!

- మియాపూర్, నాగోల్ స్టేషన్ ఉచిత పార్కింగ్ ఇక లేనట్టే..
- 6 నుంచి పార్కింగ్ ఫీజు వసూలుకు ఎల్అండ్‌టీ ఏర్పాట్లు
- మరోవైపు ఆఫర్లను పొడిగిస్తూ గుడ్‌న్యూస్ చెప్పిన సంస్థ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మెట్రో ప్రయాణికులకు ఎల్అండ్‌టీ మెట్రో రైలు గట్టి షాక్ ఇచ్చింది. నాగోల్, మియాపూర్ స్టేషన్ల వద్ద వాహనాల ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని ఎత్తివేస్తూ.. మరోసారి నిర్ణయం తీసుకుంది. ఈనెల 6నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో పార్కింగ్ వద్ద ఛార్జీలు వసూలు చేయనున్నట్టు యాజమాన్యం తెలిపింది. అయితే గతంలోనూ పార్కింగ్ ఫీజు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టగా.. ప్రయాణికుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించడంతో పాటు వారి వాహనాలకు రక్షణ కల్పిస్తామని స్పష్టం చేసింది. అదే సమయంలో నామ మాత్రపు పార్కింగ్ రుసుములను వసూలు చేయనున్నట్టు తెలిపింది. ద్విచక్ర వాహనాలు, కార్లకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్టు వివరించింది. ఈ బ్యాడ్ న్యూస్‌తో ప్రయాణికులకు ఒక గుడ్ న్యూస్‌ని ఎల్అండ్‌టీ మెట్రో అందించింది. ఇప్పటికే అందిస్తున్న మెట్రో రైలు ఆఫర్లను పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. 2025 మార్చి 31 వరకు ఎల్అండ్‌టీ తమ ఆఫర్లు పొడిగించింది. సూపర్ సేవర్-59, స్టూడెంట్ పాస్ ఆఫర్లు పొడిగిస్తూ..ఎల్అండ్‌టీ నిర్ణయం తీసుకుంది.

ఇదిలావుంటే సూపర్ సేవర్, స్టూడెంట్ పాస్‌ల విషయంలో మంచి శుభవార్త అందించిన మెట్రో పార్కింగ్ ఫీజు విషయంలో మాత్రం గట్టి షాకిచ్చింది. ఈనెల 6వ తేదీ ఆదివారం నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్టు ప్రకటించడం గమనార్హం. గత నెలలో నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ల వద్ద వాహనాల పార్కింగ్ ఫీజు వసూళ్లపై ప్రయాణికులు ధర్నా చేసిన సంగతి తెలిసిందే. వారి నిరసనల నేపథ్యంలో ఎల్అండ్‌టీ మెట్రో సంస్థ వెనక్కి తగ్గింది. ఈ క్రమంలో పెయిడ్ పార్కింగ్ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పుడు మళ్లీ నాగోలు, మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామమాత్రపు చెల్లింపులతో పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్టు సోమవారం ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి ప్రకటించారు. ఎల్అండ్‌టీ మెట్రో తాజా నిర్ణయంపై ప్రయాణికుల స్పందన ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే.

ఇదిలావుంటే హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణికుల సౌకర్యార్థం ఆఫర్లను ఎల్అండ్‌టీ మెట్రో పొడిగించింది. మెట్రో రైలులో సూపర్ సేవర్-59, స్టూడెంట్ పాస్, సూపర్ సేవర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్లను 2025 మార్చి 31 వరకు పొడిగిస్తున్నామని ఎల్అండ్‌టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు. సెలవు రోజుల్లో కేవలం రూ.59కే అపరిమిత ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చని, విద్యార్థులు 20 ట్రిప్పులకు చెల్లించి 30 ట్రిప్పులు పొందే ఆఫర్ స్టూడెంట్ పాస్ ఆఫర్ కొనసాగుతుందన్నారు. అలాగే రద్దీ లేని సమయాల్లో స్మార్ట్ కార్డులపై 10 శాతం తగ్గింపుతో ప్రయాణించే పీక్ ఆఫర్ సైతం పొడిగిస్తున్నట్టు చెప్పారు. ఈ పొడిగింపు మెట్రో ప్రయాణికుల్లో మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని ఆయన చెప్పారు. ఇక నాగోలు, మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామమాత్రపు చెల్లింపులతో పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్టు కేవీబీ రెడ్డి తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం, భద్రత కోసం నామ మాత్రం రుసుము వసూలు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

పార్కింగ్‌లో ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలు..

1. ప్రయాణికుల కోసం బయో టాయిలెట్లు
2. సాయంత్రం వేళల్లో తగిన వెలుతురు కోసం లైట్ల ఏర్పాటు
3.24/7 భద్రత, సీసీటీవీలు ఏర్పాటు
4.లావాదేవీల సౌలభ్యం కోసం యాప్, క్యూఆర్ కోడ్ చెల్లింపు వ్యవస్థ 5. స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం
6.సులభమైన పార్కింగ్, యాక్సెస్ కోసం లేన్ గుర్తింపు
7.మహిళలు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు
8.సమీప ఆస్పత్రి, పోలీస్ స్టేషన్, అగ్నిమాపక స్టేషన్ వంటి అత్యవసర సంప్రదింపు వివరాల ప్రదర్శన.

బీజేపీ అధికారంలోకి వచ్చాక..
మహిళలకు రక్షణ కరువైంది..



- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ-ధూల్ పేట్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు రక్షణ కరువైందని ఐద్వా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఐద్వా హైదరాబాద్ సౌత్ జిల్లా 3వ జిల్లా మహాసభను సంతోష్ నగర్‌లోని ఆలం కుందుమిరి ఆఫీసులో నిర్వహించారు. ఈ మహాసభకు ఆమెతో పాటు రాష్ట్ర నాయకులు ఆశాలత, రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరై అన్ని జోన్ల మహిళా సంఘం నాయకులతో కలిసి జెండా ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా అమే మాట్లాడుతూ.. రోజు రోజుకి మహిళలకు రక్షణ కరువైందని వాపోయారు. దేశవ్యాప్తంగా మహిళల రక్షణ కరువైందని ముఖ్యంగా మణిపూర్ లాంటి దుర్ఘటనలు సాధారణము అయినవని అన్నారు. దేశంలో ఉన్న మహిళలందరినీ ఐక్యం చేసి మనువాద సిద్ధాంతం పైన బీజేపీ మహిళా వ్యతిరేకత పైన పోరాటం చేస్తామని సభ్యులకు పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా మహాసభలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా ఎం.లక్ష్మమ్మ కార్యదర్శిగా పి శశికళను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ సభ్యులుగా ఎల్.కవిత, స్వరూప, జ్యోతి, స్వరూప, నసీబ్ జహాన్, గౌసియా, జకియా బేగం, సుజాత గౌసియా బేగం, హుర్బానలు ఎన్నికైనారు.

మహిళల హక్కులకై సంఘటితంగా పోరాడాలి : ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.సరళ..

ముషీరాబాద్: మహిళల సమాన హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బీ.సరళ పిలుపునిచ్చారు. సోమవారం గోల్కొండ చౌరస్తాలోని రాష్ట్ర కార్యాలయంలో ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ 4 వ నగర మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు సరళ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. దేశంలో మహిళలపై అత్యాచారాలు,దాడులు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగిపోయాయని,మహిళలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని,చిన్న పిల్లల మొదలు ముసలి వారి వరకూ ఇంట్లో ఉన్న వారికి కూడా రక్షణ లేని దుస్థితి నెలకొందని ఆమె తెలిపారు.డబ్బు పలుకుబడి ఉన్నవారు కఠోర నేరాలకు పాల్పడినా వారికి శిక్షలు పడకుండా తప్పించుకునే పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ ప్రభుత్వం ఇచ్చే బేటీ బచావో నినాదం పేరుకేనని, ఆచరణలో అనేక కేసులలో నేరస్తులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళలు సంఘటి తంగా ఉండి ఐక్య పోరాటాలు చేసినప్పుడే మహిళల పరిస్తుతులు మారుతాయని అన్నారు.మహాసభ ప్రారంభం లో ఐద్వా జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి ఆవిష్కరించారు.సభలో మల్లు స్వరాజ్యం, లక్ష్మీ దేవమ్మ, వామపక్షనేత సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. సభకు ఏ.పద్మ అధ్యక్షత వహించారు..గత మహాసభ నుండి ఈ 3 సంవత్సరాల కాలంలో జరిగిన కార్యకలాపాల నివేదికను కార్యదర్శి కె.నాగలక్ష్మి ప్రవేశ పెట్టారు. సభలో మహిళలపై హింసను అరికట్టాలని, మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు లోకి తేవాలని, మూసీ పరి వాహక ప్రాంతాల ఇండ్లు కూలగొడితే వారికి ముందుగా ప్రత్యామ్నాయాలు చూపిన తరువాతే ఆ పని చేయాలని తీర్మానాలు చేశారు.

ఐద్వా నూతన కార్యదర్శిగా వై.వరలక్ష్మి అధ్యక్షురాలిగా ఏ.పద్మ ఉపాధ్యక్షులుగా కె.నాగలక్ష్మీ పీ.విమల,శారద సహాయ కార్యదర్శుగా ప్రవళిక, రాధిక కోశాధికారిగా ఎల్.భవాని ఎన్నికయ్యారు. 25 మందితో నగర కమిటీ ఎన్నిక జరిగింది.



వరద నీటి సమస్యను
పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం..



- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్

వరద నీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం అని గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. డివిజన్ అశోక్‌నగర్ లోని స్ట్రీట్ నెంబర్ 1, సోభాగ్య ఎవెన్యు అపార్ట్‌మెంట్స్ వద్ద నిర్మించిన నాల రిటర్నింగ్ వాల్ వద్ద తరచూ వరదనీరు భారీగా నిలిచిపోయి కాలనీ వాసులకు తీవ్ర సమస్యగా మారిందని చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్‌తో కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రిటర్నింగ్ వాల్ వద్ద వరద నీరు నిలిచి పోకుండా నాలాలోకి వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసేవిందంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా వరద నీరు ను నలాలోకి మళ్లించేందుకు దారిని ఏర్పాటు చేసే ప్రక్రియ వెంటనే ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు అన్నారు. త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తాం అన్నారు.

ఫ్యాన్సీ నెంబర్ల వేలం..

- ఒక్కరోజే ఆర్టీఏకు 47.12లక్షల ఆదాయం : జేటీసీ రమేష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వాహన ఫ్యాన్సీ నెంబర్ల ద్వారా మరోసారి రవాణాశాఖకు కాసుల పంట పండింది. కేవలం ఒక్కరోజులోనే ఆ శాఖ ఖజానాకు భారీ ఆదాయం వచ్చి చేరింది. సోమవారం సెంట్రల్ జోన్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఫ్యాన్సీ నెంబర్ల ఈ-వేలంలో వినియోగదారులు పోటీపడ్డారు. ఈ వేలం ద్వారా సుమారు రూ.47,12,265 ఆదాయం వచ్చిందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) సి.రమేష్ తెలిపారు. ఇందులో ఓ ప్రయివేట్ మొబైల్ సంస్థ తమ విలువైన కారు కోసం రూ.20.01లక్షలు వెచ్చించి టీజీ09 బి 9999 నంబర్ సొంతం చేసుకుంది. అదే విధంగా మరో ప్రయివేట్ సంస్థ తమ విలువైన కారు కోసం రూ.10.27లక్షలు చెల్లించి టీజీ 09సీ 0001 నంబర్‌ను దక్కించుకుంది.

అలాగే మరో ప్రయివేటు సంస్థ తమ కారు కోసం రూ.3.85లక్షలు వెచ్చించి టీజీ 09 సీ 0006 నంబర్‌ను సొంతం చేసుకోగా.. టీజీ09 సీ 0009 నంబర్‌ను రూ.2.75లక్షలకు, టీజీ 09 సీ 0007 నంబర్‌ను 1.77లక్షలకు, టీజీ 09 బీ 9909 నంబర్‌ను 1.35లక్షలకు, టీజీ09 సీ 0011 నంబర్‌ను పలు సంస్థలు దక్కించుకున్నాయి. టీజీ 09 సీ 0005 నంబర్‌ను 1.13లక్షలు చెల్లించి నగరానికి చెందిన ఓ వ్యక్తి సొంతం చేసుకున్నారు. ఫలితంగా ఒక్క రోజులో రవాణాశాఖ ఖాజానాకు రూ. రూ.47,12, 265 ఆదాయం చేకూరినట్టు జేటీసీ రమేష్ తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని జోనల్ కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు పర్యవరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ వినతిపత్రాన్ని అందజేశారు. కూరగాయలు మార్కెట్, హాస్పటల్, కిరాణా, దేవాలయాలు, ఫంక్షన్ హాల్స్ తదితర ప్రాంతంలో అతి తక్కువ మైక్రాన్ కలిగిన ప్లాస్టిక్ కవర్లు విక్రయించడం తో పర్యావరణానికి హాని కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాదగిరి అంజనేయులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

అవుషాపూర్ గ్రామంలోని అంబేద్కర్ కమ్యూనిటీహాల్‌లో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కీసర ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తాల్క రాములు హాజరై అంబేద్కర్ చిత్రపటానికి నివాళు లర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అస్పృశ్యత నివారణ, అంటరానితనం, దళితులను ఎవరైనా తిట్టినా, కొట్టిన వారి భూములు లాక్కున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ డిపార్ట్మెంట్ తరపున ఆర్ఐ కావ్య, ఘట్కేసర్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి జ్యోతి, వీఆర్ఏ చందు ముదిరాజ్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, అధ్యక్షులు సిహెచ్ ప్రశాంత్, పెద్దొల్ల చంద్రయ్య, సీహెచ్ ముత్యాలు, రాము, బాల మల్లేష్, మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
మంగళవారం | అక్టోబర్ 01, 2024 | www.navatelangana.com

ప్రజావాణికి 181 దరఖాస్తులు

- అదనపు కలెక్టర్లు కదిరవన్, వెంకటాచారి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 181 మంది దరఖాస్తు చేసుకున్నారనిఅదనపు కలెక్టర్లు కదిరవన్, వెంకటాచారి తెలిపారు. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ కు 125, పెన్షన్లు 23, భూ సమస్యలకు సంబంధించినవి 10, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 3, ఇతరములు 20 వచ్చినవని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దశరథ్ సింగ్, జిల్లా అధికారులు జి ఆశన్న, పెరిక యాదయ్య, ఆర్ కోటాజి, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్, ఆర్.రోహిణి, ఏ.వందన పాల్గొన్నారు.

గాంధీ జయంతి వేడుకల ఏర్పాట్లు పూర్తి చేయాలి



- బాపు ఘాట్‌ను సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహాత్మా గాంధీ జయంతి వేడుకల ఏర్పాట్లన్నీ మంగళవారం లోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం బాపు ఘాట్‌ను కలెక్టర్ సందర్శించి బాపు సమాధి, సెంట్రల్ హాల్, గాంధీ విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని శాఖల వారీగా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్2న గాంధీ జయంతి రోజున రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఉదయం 6.00 గంటలకు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఉదయం 10.00 గంటలకు బాపుఘాట్ లో మహాత్మ గాంధీ కి నివాళులర్పిస్తారని తెలిపారు. రిసెప్షన్, బాపు సమాధి, సెంట్రల్ హాల్ లో శ్రద్ధాంజలి కార్యక్రమం, అలాగే గాంధీ విగ్రహం వద్ద ఏర్పాట్లు ఘనంగా ఉండాలని సూచించారు. ప్రోటోకాల్ తప్పక పాటించాలని, గ్యాలరీలు, బారికేడ్లు ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. ఘాట్ తో పాటు ఇతర ప్రాంతాలలో పారిశుధ్యం పనులు పూర్తి చేసి సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులు వస్తారని వారికీ అరటి పండ్లు, నీరు, బట్టర్ మిల్క్ అందించాలని సూచించారు.

ముఖ్యంగా కార్యక్రమం ముగిసే వరకు నిరంతరం విద్యుత్ ఉండాలని, అలాగే సౌండ్ ప్రూఫ్ జనరేటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పూల ద్వారా సుందరికరణ చేయుటలో ఎక్కడా రాజీ పడొద్దని, వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. రెండు మెడికల్ శిబిరాల ఏర్పాటుతో పాటు అంబులెన్సును అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిదంగా కార్యక్రమం లైవ్‌తో పాటు సర్వ మత ప్రార్థనలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపి చంద్రశేఖర్,ఆర్డీఓ మహిపాల్, డీఈఓ ఆర్. రోహిణి, తహసీల్దార్ ఆహల్య రెడ్డి , ఉద్యయన శాఖ, ఆర్ అండ్‌బీ ఈఈ ఎలక్ట్రిసిటీ, పోలీస్,ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

THE GENERAL PUBLIC AT LARGE IS HEREBY INFORMED THAT; Our Client, **Nayani Harsha Vardhan Reddy**, S/o. Sri. Nayani Yadi Reddy, Resident of H.No. 11-12/1, Balaji Nagar, Near Oxford High School, Aie Bolaram, Sanga Reddy, Telangana 502325. is the owner of the Plot No. 41 measuring **300 Sq. Yds or 250.84 Sq. Mrts** (out of 9.08 Acres) in Sy No. 60, 61 & 62A, Situated at Bahadurpalli Village, Medchal Mandal, Medchal-Malkajgiri District, Telangana State. In the recent times, our client was in transit from his home at bollaram to the photocopy shop, during the transit our client has lost the Original Document pertaining to the above property i.e., **Sale Deed, bearing document No. 5724/1983, dated: 15.07.1983.** Our client had made all efforts to trace out the Original Document, but he could not find the same. As such upon the instructions of our client, I hereby inform the public at large about of the loss of the above document.

Therefore whosoever finds the Original Document i.e., Sale Deed, bearing document No. 5724/1983, dated: 15.07.1983 is hereby requested to kindly hand-over the same to me at the address mentioned below.

Sd/-
Mr. G KRISHNAIAH
ADVOCATE
O/o. Ground Floor, H.No. 3-6-491/C/D, Street No. 6, Himayath Nagar, Hyderabad 500 029, Telangana State
Ph: +91-94409-99875

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడుతా : తహశీల్దార్ శైలజ





నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండలం రాజబొల్లారం తండా గ్రామంలోని ప్రభుత్వ స్థలం ఇంచు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని మేడ్చల్ తహశీల్దార్ శైలజ అన్నారు. సోమవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ సర్వే నంబర్ 231లోని 7ఎకరాల 20గుంటల ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా చూస్తామని తెలిపారు. ప్రముఖ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కబ్జాకు యత్నిస్తున్నారు అంటూ వచ్చిన వార్తలపై వివరణ కోరగా సర్వే నంబర్ 231లోని ప్రభుత్వం భూమి పక్కనే డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డికి సంబంధించిన పట్టా స్థలం ఉందని తెలిపారు. అయితే కొందరు కావాలనే ప్రభుత్వ స్థలానికి చెందిన 7ఎకరాల 20గుంటల నుండి 20గుంటల స్థలాన్ని డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఇందులో ఏమాత్రం నిజం లేదని, 1991లో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి 206 సర్వేనెంబర్‌లో 10ఎకరాల 39గుంటల పట్టా భూమిని కొనుగోలు చేశాడని తెలిపారు. అయితే ఇక్కడ కొందరు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డికి ప్రభుత్వ భూమిని చూపించి ఇదే మీ భూమి అంటూ మోసం చేశారని, విషయం తెలుసుకున్న ఆయన కోర్టును ఆశ్రయించారని తెలిపారు. కోర్టు తీర్పు ప్రకారం ఆయన కొన్న 206లో గల సర్వే నెంబర్‌లో 10ఎకరాల 39గుంటలను డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డికి అప్పగించాలని 231 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమి ని ప్రభుత్వానికి అప్పగించాలంటూ కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. కోర్టు ఆదేశాల ప్రకారం 10 ఎకరాల 39 గుంటల స్థలంలో సర్వే నిర్వహించి చంద్రశేఖర్ రెడ్డికి అప్పగించి, పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం 7ఎకరాల 20 గుంటలు ప్రభుత్వానికి అప్పగించినట్టు తెలిపారు. దీనిపై కొందరు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని చెప్పారు.

పదవీ విరమణ పొందిన పోలీసుకు సన్మానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాచకొండ పోలీస్ కమిషనరేట్ లో సీసీఎస్ విభాగంలో సబ్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన ఏ. బధ్యాకు సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ తన కార్యాలయంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇన్ని రోజులు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి.ఇందిర, డీసీపీ అడ్మిన్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రా రెడ్డి, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ పార్టీ అధ్వర్యంలో నగరంలో జరిగిన రైతు హామీల సాధన దీక్షలో నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి , కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ ,బీజేపీ నాయకులు పాల్గొన్నారు. -నవతెలంగాణ-కీసర

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE : AT RAMANNAPET
O.S.NO.12 OF 2021

Between:
Bokka Mahender Reddy .....Plaintiff
AND
Bokka Purushotham Reddy and another ....Defendant

NOTICE

To
2. Bokka Madhusudhan Reddy, S/o. Late Bokka Ranga Reddy, R/o. H,NO. 6-9/4, Budha Nagar, Road No.8, Boduppal, Peerzadiguda, Medipally mandal, Medchal Malkajgiri District- 500092.

That the above case is filed by the plaintiff for partition and Separate Possession of the Suit Schedule Property and to declare the Registered Will Deed Doc No. 6/III/2016, dated 24-06-2016 of SRO- Ramannapet as null and void and not binding on him and the said case in posted on 18-10-2024 for your appearance and in case, if you the above addressee herein fail to attend before the above said court in the above said case on 18-10-2024 at 10.30 A.M, the matter will be decided exparte.

(BY ORDER OF THE HON'BLE COURT)
G.SREENIVASREDDY,
Advocate,
Bhongir.
Cell No. 9848411034.

IN THE COURT OF HON'BLE I ADDL.FIRST CLASS MAGISTRATE-CUM-VIII METROPOLITAN MAGISTRATE MEDCHAL AT ATHVELLI
OS.NO. 581 OF 2023

BETWEEN
1. Divi Sowbhagya and two others .....Plaintiffs

AND

Sai Krishna Kumar Sri Ramoji ......Defendant

NOTICE

Take notice that the above named Plaintiffs have filed the above suit for Perpetual Injunction against you Sai Krishna Kumar Sri Ramoji S/o S.Narasaiah, Age: 34 years, Occ: Employee, R/o Villa No.16, 17, Road No.10, Bhava's GLC CRIBS, Mallampet Village Dundigal, Gandimaisamma Mandal, Medchal -Malkajigiri District-500090, the Defendant in the suit OS.NO.581 OF 2023 and the case is posted to 18-10-2024 for your appearance. Hence you are directed to appear before the Hon'ble Court of I Addl. FIRST CLASS MAGISTRATE Court-cum-VIII .Metropolitan Magistrate Court MEDCHAL AT ATHVELLI on 18-10-2024 at 10.30 am either personally or through an Advocate, otherwise the matter will be decided as per law and in your absence. Hence this Notice.

//**By order of the court**//
G.Srividya
Advocate
ATHVELLI COURT, MEDCHAL

IN THE COURT OF THE HONOURABLE XITH JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.S.NO.575 OF 2022

BETWEEN:
P.Latha& Another ...Plaintiffs
AND
Mr.Sailesh Kumar Gujjar ...Defendant

Mr.Sailesh Kumar Gujjar,
S/o Late Nagender Rao Gujjar
Aged 55, Business, at 4-1-42, 43, 45/A, Old Bhoiguda,
Secunderabad 500 003 ...Defendant

Whereas the Plaintiffs P.Latha& Another has instituted a suit for recovery of money for Rs.14,52, 899/-against you. You are hereby summoned to appear in the Court of XIT JUNIOR CIVIL JUDGE, City Civil Court at Secunderabad in person or through an advocate duly instructed, **on 14-10-2024 at 10.30 A.M.** failing which the matter will be heard and decided Ex-Parte.

(BY ORDER OF THE COURT)
G.V. Giridhar,
B.N. Radhakrishna Yadav,
B.Naveen Kumar, Advocates
Plot No. 77, Syndicate Bank Colony, West Marredpally,
SECUNDERABAD-500026.
Cell. No. 8341742340

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT:: SHADNAGAR
I.A.No.225 OF 2024
IN
I.A.No.207 OF 2018
IN
O.S. No. 62 OF 2008

Between:-
MD.Fakeer Jani & Others ...Petitioners/Plaintiffs
And
Vazeer Ali & Others ...Respondents/Defendants

To
Shahida D/o Late.M.D.Sadaq.age 34 yrs, Occ: Business, R/o H.No. 19-4-281/8/98/1. Nawabsahab Kunta, Plot No.B/98/1, Hyderabad, Telangana State, Pin No-500053, Telangana State. (Impleading Purposed Respondent No.19).

Take Notices that the above suit which is filed for Advocate commissioner petition against the respondents seeking to make partition of suit schedule properties as per the judgment in O.S.No.62/2008 Dated 10-12-2010. In respect of the land Sy.No.37 admeasuring 10-16 guntas, in Sy.No.38 admeasuring 13-05 guntas, in Sy.No.39 admeasuring 13-35 guntas, in Sy.No.40 admeasuring 12-31 guntas, in Sy. No.149 admeasuring 1-05 guntas, in Sy.No.168 admeasuring 1-20 guntas Total admeasuring 53-32 guntas, situated at Tekulapally Village. Kondurg Mandal. Rangareddy district (Previous Mahbubnagar Dist..) is posted for your appearance **on 04.10.2024 at 10.30 AM** before the Hon'ble Senior Civil Judge, Shadnagar, R.R.district. Hence you are required to appear in the above said suit on the above said date and time either in person or through an advocate duly authorized by you. Inspite of this. If you still do not appear the suit will be decided in your absence.

"By Order of the Court"
Pathapally Surender Reddy.
Mohammed Sameer-uddin.
Advocates,
Shadnagar. Cell No. 9948698778

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT:: SHADNAGAR
I.A.No.207 OF 2018
IN
O.S.No.62 OF 2008

Between:-
MD.Fakeer Jani & Others ...Petitioners/Plaintiffs
And
Vazeer Ali & Others ...Respondents/Defendants

To
1.Smt.Ghousia Begum W/o Late Vazir Ali, Age 70 yrs.R/o H.No.19-4-280/2/1/5, Mustafa nagar, Ansari Road, Hyderabad. (Respondent No.10)
2.MD.Shafi S/o Late Vazir Ali, age 50 yrs. R/o H.No.19-4-280/2/1/5, Mustafa nagar, Ansari Road, Hyderabad. (Respondent No.11)
3.MD.Baba S/o Late Vazir Ali, age 45yrs, R/o H.No.19-4-280/2/1/5. Mustafa nagar, Ansari Road, Hyderabad. (Respondent No.12)

Take Notices that the above suit which is filed for Advocate commissioner petition against the respondents seeking to make partition of suit schedule properties as per the judgment in O.S.No.62/2008 Dated 10-12-2010. In respect of the land Sy.No.37 admeasuring 10-16 guntas, in Sy.No.38 admeasuring 13-05 guntas, in Sy.No.39 admeasuring 13-35 guntas, in Sy.No.40 admeasuring 12-31 guntas, in Sy. No.149 admeasuring 1-05 guntas. in Sy.No.168 admeasuring 1-20 guntas Total admeasuring 53-32 guntas, situated at Tekulapally Village. Kondurg Mandal, Rangareddy district (Previous Mahbubnagar Dist..) is posted for your appearance **on 04.10.2024 at 10.30 AM** before the Hon'ble Senior Civil Judge, Shadnagar, R.R.district. Hence you are required to appear in the above said suit on the above said date and time either in person or through an advocate duly authorized by you. Inspite of this. If you still do not appear the suit will be decided in your absence.

"By Order of the Court"
Pathapally Surender Reddy,
Mohammed Sameer-uddin,
Advocates,
Shadnagar, Cell No. 9948698778.

IN THE HON'BLE COURT OF III ADDL. DISTRICT JUDGE:: MEDCHAL MALKAJGIRI DISTRICT DISTRICT AT KUKATPALLY
O.S.NO. 254 OF 2021

Between:
Sri.D. SRINIVAS RAO Rep. by his GPA Holder
Sri. P. Devendar Reddy ....Plaintiff
AND
KONDAVATY RAVI KUMAR & anr. ....Defendants

COURT NOTICE

To,
2. M/s. RUBE CONSTRUCTIONS Rep. by its Proprietor Sri.Shaik Haji Mujeeb S/o. KhaderBasha, aged 47 years, Occ: Business, R/o. 8-3-667/1, Yellareddyguda, Hyderabad-873 ...Defendants No. 2

Please take notice that the plaintiff has filed the above suit for Declaration and for other reliefs against you & another in respect of the Plot No. 109, admeasuring 320 Sq.yards or 267.55 sq. meters in Sy. No.145, Situated at Hydernagar Village, Balanagar Mandal , under GHMC Kukatpally Circle, Ranga Reddy District. That, the above suit is posted on 29.10.2024, for your appearance in person or through counsel, therefore you are requested to make convenience to appear on 29.10.2024 at 10.30 am with material evidence before the Hon'ble court of the III Addl. District Judge:: Medchal Malkajgiri District District At Kukatpally. If you fail to appear on the said date the matter will be heard and decided in accordance with law.

(BY THE ORDER OF THE COURT)
AKKAM ESHWAR
Advocate
Cell No : 9848822310

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT:: SHADNAGAR
I.A.No.226 OF 2024
IN
I.A.No.208 OF 2018
IN
O.S.No.62 OF 2008

Between:-
MD.Fakeer Jani & Others ...Petitioners/Plaintiffs
And
Vazeer Ali & Others ...Respondents/Defendants

To
Shahida D/o Late.M.D.Sadaq, age 34 yrs, Occ: Business, R/o H.No. 19-4-281/B/98/1. Nawabsahab Kunta, Plot No. B/98/1, Hyderabad Telangana State. Pin No-500053 (Impleading Purposed Respondent No.19).

Take Notices that the above suit which is filed for Final Decree petition against the respondents seeking to make partition of suit schedule properties as per the judgment in O.S.No.62/2008 Dated 10-12-2010. In respect of the land Sy. No.37 admeasuring 10-16 guntas, in Sy.No.38 admeasuring 13-05 guntas, in Sy.No.39 admeasuring 13-35 guntas, in Sy.No.40 admeasuring 12-31 guntas, in Sy. No.149 admeasuring 1-05 guntas, in Sy.No.168 admeasuring 1-20 guntas Total admeasuring 53-32 guntas. situated at Tekulapally Village, Kondurg Mandal, Rangareddy district (Previous Mahbubnagar Dist..) is posted for your appearance on **04.10.2024 at 10.30 AM** before the Hon'ble Senior Civil Judge, Shadnagar, R.R.district. Hence you are required to appear in the above said suit on the above said date and time either in person or through an advocate duly authorized by you. Inspite of this. If you still do not appear the suit will be decided in your absence.

"By Order of the Court"
Pathapally Surender Reddy,
Mohammed Sameer-uddin,
Advocates,
Shadnagar. Cell No. 9948698778.

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT: AT HYDERABAD
O.S. NO.850 OF 2024

Between:
CANARA BANK
Sanjeeva Reddy Nagar Branch, Hyderabad rep., by its Manager
R/o Hyderabad-500038.
Bank Email:
cb2705@canarabank.com ....**Plaintiff**

AND
M/s.RIDVIK Enterprises and 2 others ...**Defendants**

To
1. RIDVIK Enterprises
Flat no.G1, 8-3-167/D/49
Sri Balaji Kalyan Apartment
Kalyan Nagar, Phase-1
SR Nagar, Hyderabad-500018
2.D.SATHEESH,
Aged about 36 years,
Occ: Business,
R/o Flat no.G1, Plot no.67
Victory Residency Motinagar,
Hyderabad-500018
3. K.KISHORE,
Aged about 36 years,
Occ: Business, R/o Flat no.202, Rajitha Apartment
Plot no.32 & 33,
Rajeevnagar. ....**Defendants**

Please take notice the Plaintiff filed that the above in O.S.NO. 850 OF 2024 for recovery of Rs.11,72,250/-on the file of the Hon'ble VII Junior Civil Judge, City Civil Court at Hyderabad.

You are therefore directed to appear before the Hon'ble VII Junior Civil Judge, City Civil Court at Hyderabad on 28-10-24 at 10:30 A.M. either in person or through an advocate and file your written statement failing which the suit will be decided exparte in your absence.

(BY THE ORDER OF THE COURT)
D.L. KIRAN PRAKASH
A. SRINIVASULA RAJU
ADVOCATES
Mobile No.9848048800, 9440543166
FLAT NO.6, PLOT NO.36
LAXMI NIVAS, KALYAN NAGAR - III
ERRAGADDA, HYDERABAD-018
Date: 28-10-24

IN THE COURT OF THE HON'BLE IX ADDL.DISTRICT JUDGE R.R. DISTRICT AT:L.B. NAGAR
O.S.NO. 507 Of 2022

Between:
G.Madhava Reddy and others ...Plaintiffs
A N D
Smt M. Anjamma and others ..Defendants

To,
1.Solipuram. Bal Reddy, S/o S.Venkat Reddy, Aged about 42yrs Occ : Business, R/o H.No.3-7-108, Indranagar, Ramanthapur, Hyderabad. (Respondent No.18)

Whereas the above Plaintiff has filed the Suit along with Interlocutory application vide I.A.No.1220 Of 2022 against you. The above suit along with the said I.A is posted to15-10-2024 for your appearance. You are hereby summoned to appear in person or through your pleader with your defence if any at 10.30 a.m. on the above said date before this Hon'ble Court, failing which the suit will be heard and determined ex-parte.

(By order of the Hon'ble Court)
Sd/-
M.RAMA DASU,
B.MANIKYAM,
B.ANNAPURNA
Advocates
Office at: # H.No.3-3- 108/A/1, Opp : Madev Sweet House, New Friends Colony,Hyderguda-48, Attapur, Hyderabad-48, Mobile: 9848833155,9849247341.
Counsel for plaintiff

IN THE COURT OF HON'BLE FAMILY COURT JUDGE, RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
F.C.O.P. No.893 of 2024

Between:
Smt.AdigopulaSyamala Gayathri ...Petitioner
AND
Mohd.Ashfaq ...Respondent

To,
Mohd. Ashfaq S/o. Mohd, Ibrahim Aged 46 years, Occ: Private Employee R/o. H No. 20-3-356, Khilwath, Charminar, Hyd-500002.

Please take notice that above named Petitioner has filed the above OP against you seeking decree of divorce, Upon hearing the Petitioner the Hon'ble Court was pleased to order the service of notice against you by way of this publication and matter was posted **on 23-10-2024 at 10:30 AM.** Hence, you are advised to appear before the Hon'ble Court on said date either personal or through advocate, otherwise the matter will be decided against you.

**\\ By order of the court **
G. BHADRU,
K. SURESH KUMAR,
B.VIJAY KUMAR, Advocates,
Office at H. No. 5-5-209, Plot No. 410/B, Prashanthnagar, Vanasthalipuram, Hyderabad 500070. Cell: 9441547758

PUBLIC NOTICE

The General Public hereby informed that my client Nittala Swapna W/o Nittala Laxmi Prabhakara Rao entered into a Sale Agreement to Purchase the Residential House No 21-74(Old No 15/95-3) PTIN No 1170505248 comprising Ground Floor and First Floor consisting in all 2000Sft of built up area on Plot No 74 admeasuring 355.5 Sq Yrds or 297.2Sq Mtrs under Sy No 175 situated at abutting Main Road, Uttam Nagar, Safilguda Malkajigiri Village within limits of GHMC Malkajigiri Circle & Mandal, Medchal Malkajigiri Dist with K Sharada and M Rani and paid partsale consideration.

If any person have got any title/right or objections for sale of the schedule property may contact the undersigned within (7) days from the date of publication of this notice along with the documents in support of claims. The objections /claims shall not be entertained after stipulated period of time and presumed that there are no claims or interest and My client will proceed with the sale transaction.

Schedule of Property

Residential House No 21-74 (Old No 15/95-3) PTIN No 1170505248 comprising Ground Floor and First Floor consisting in all 2000Sft of built up area on Plot No 74 admeasuring 355.5 Sq Yrds or 297.2 Sq Mtrs under Sy No 175 situated at abutting Main Road, Uttam Nagar, Safilguda Malkajigiri Village within limits of GHMC Malkajigiri Circle & Mandal, Medchal Malkajigiri Dist

North : Road 25-0" wide,
East : Plot No 82,
South : Plot No 75,
West : Road 40'-0" wide

B. PRAVEEN KUMAR
P.GRAHITHA GRACE
ADVOCATES
Off.105, Plot 31, Chittareddy Colony, Tadbund X Road, Secunderabad,
Phone:9618131713
Date : 30.09.2024
Secunderabad

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT : AT :: HYDERABAD
O.S.NO. 4628 OF 2024

Between :-
Smt. Lakshmi Bhowmick ...Plaintiff
AND
The Tahsildar, Shaikpet Mandal, and others ....Defendants

To,
All concerned

Please take notice that the Plaintiff filed the above suit for declaration of Legal Heirs of **Late SUBIR BHOWMICK.** The matter stands posted on 28-10-2024. If anybody objection or claims in respect of the above matter, they may appear before the Hon'ble Court on 28-10-2024 at 10.30 A.M. either in person or through an Advocate duly instructed on their behalf. Otherwise the matter will be decided as per law.

//BY ORDER OF THE COURT//
V. VENKAT REDDY
Advocate
Chamber at # 15 Bachelors Qtrs, M.J. Market, Hyderabad. TG. 500001
Cell No. 9440771214

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT:: SHADNAGAR
I.A.No. 208 OF 2018.
IN
O.S.No.62 OF 2008

Between:-
MD. Fakeer Jani & Others ...Petitioners/Plaintiffs
And
Vazeer Ali & Others ...Respondents/Defendants

To
1.Smt.Ghousia Begum W/o Late Vazir Ali, Age 70yrs. R/o H.No.19-4-280/2/1/5, Mustafa nagar, Ansari Road, Hyderabad. (Respondent No.10)
2.MD. Shafi S/o Late Vazir Ali, age 50 years, R/o H.No.19-4-280/2/1/5 Mustafa nagar, Ansari Road, Hyderabad. (Respondent No.11)
3.MD.Baba S/o Late Vazir Ali, age 45 years, R/o H.No.19-4-280/2/1/5 Mustafa nagar, Ansari Road, Hyderabad. (Respondent No.12)

Take Notices that the above suit which is filed for Final Decree against the respondents seeking to make partition of suit schedule properties as per the judgment in O.S.No.62/2008 Dated 10-12-2010. In respect of the land Sy. No.37 admeasuring 10-16 guntas, in Sy.No.38 admeasuring 13-05 guntas, in Sy.No.39 admeasuring 13-35 guntas, in Sy.No.40 admeasuring 12-31 guntas, in Sy.No.149 admeasuring 1-05 guntas, in Sy. No.168 admeasuring 1-20 guntas Total admeasuring 53-32 guntas, situated at Tekulapally Village, Kondurg Mandal, Rangareddy district (Previous Mahbubnagar Dist..) is posted for your appearance **on 04.10.2024 at 10.30 AM** before the Hon'ble Senior Civil Judge. Shadnagar. R.R.district. Hence you are required to appear in the above said suit on the above said date and time either in person or through an advocate duly authorized by you. Inspite of this. If you still do not appear the suit will be decided in your absence.

"By Order of the Court"
Pathapally Surender Reddy,
Mohammed Sameer-uddin,
Advocates.
Shadnagar.Cell No. 9948698778.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, R.R DIST. AT: RAJENDRANAGAR.
O.S.No.469 of 2022

Between:
Nawab Mohammed Azizuddin Khan (Died) as per Lrs Syeda Sayeedaunnisa Begum & 4 others ...Petitioners.
AND
MAMIDI PADMA AND 26 Others ...Respondents.

NOTICE

To
1.SRI.MAMIDI AKHILESH (D3) S/o. Late Sri.Mamidi Satish, Aged about 34 yrs, Occ: Agriculture, R/o. H.No.3-2-792, Kachiguda, Hyderabad.
2.SMT.MAMIDI POOJA (D4) W/o. Sri.Abhishek Naidu. Rep. by her GPA holder Smt.Mamidi Padma, W/o. Late Sri.Mamidi Satish, aged about 60 years, Occ: Housewife, R/o. H.No.3-2-792, Kanchiguda, Hyderabad.
3.SRI.DAMODAR KARWA (D15) S/o.Ramvallabh Karwa, Aged about 51 years, Occ: Business, R/o.20-2-396, Old Kabutar Khana, Hyderabad.

Please take Notice that the above-named plaintiffs/Petitioners filed the above suit. Which was filed against you and others. The Hon'ble court send summons /notices through court and R.P.A.D. but the same were returned as unserved, hence the Hon'ble court has ordered substitute of service of summons through this publication. The case is posted for your appearance **on 27-01-2025 at about 10:30 A.M.** So you may appear before the Hon'ble Court in person or through an advocate duly instructed without fail. Otherwise, the matter will be heard and decided as set exparte in your absence.

"By the Order of the Hon'ble Court"
L.A. JAN,
Advocate
#21-7-762/1, Adjacent Lane Post office, High Court, Hyderabad, T.S-500002., Ph.No. 9866976295, 9494253600.

మహారాజ శ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో..
E.P.No.1/2023
O.S.No.497/2014

నాముల వీరభద్రం ...DHR
మరియు
నాముల సత్యవతి వగైరాలు ...JDRS

To,
R6) మేదరమెట్ల అనిల్ కుమార్ S/o. చిన్నయ్య D.No.50-6-444/1,ఫ్లాట్ నెం.705, రోడ్ నెం.9, వనస్థలిపురం, హైదరాబాద్, తెలంగాణ.
R7) మేదరమెట్ల సుధారాణి, D/o.చిన్నయ్య, ఫ్లాట్ నెం.705, రోడ్ నెం.9, వనస్థలిపురం, హైదరాబాద్, తెలంగాణ.

పై నెంబర్ E.P లో పై కోర్టు వారి నుండి ఇప్పటికి అనేక పర్యాయములు తగు కోర్టు వారి ద్వారా నోటీసులు జారీ చేయించగా మీరు సదరు నోటీసులు తీసుకోని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది. 24-10-2024 వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా రోజ ఉదయం 10:30 కు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనగలరు.లేని యెడల సదరు E.P మీ యొక్క పరోక్షమందు తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తరాల ప్రకారం వాయిదా ది. 24-10-2024

ఇట్లు.
శ్రీ జి.అనిల్ కుమార్,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట.

IN THE COURT OF II ADDL. JUNIOR CIVIL JUDGE - CUM-VI ADDL. METROPOLITAN MAGISTRATE, MEDHCAL-MALKAJGIRI DISTRICT AT L.B.NAGAR
O.S.No.390/2023

BETWEEN
CanaraBANK, Peerjadiguda Uppal Poineer House R O Branch Hyderabad H.No.9-15 &16, Beside Uppal Depot, Sreeram Nagar Colony, Peerzadiguda, Uppal, Hyderabad - 500 098

AND

1. M/s Amar Associates, Rep. by J.Amarendar,S/o Ramulu, H.No. 2-183, Road No.2, Vinayaka Nagar Colony, Medipally, Hydera bad-500 098
2. J. Amarendar, S/o Ramulu, Aged about 40 years, Occ: Business, H.No.2-183, Road No.2, Vinayaka Nagar Colony, Medipally, Hyderabad-500 098. Cell No.9000009337

Take Notice that the Plaintiff Bank have filed the said suit against you for recovery of Rs. 6,19,392/- with Interest at 10.15% p.a. thereon from 01-04-2023. The suit is posted to 18-10-2024 for your appearance before the above Hon'ble court and if you fail to appear in person or through an advocate on 18-10-2024 at 10.30 am before the above Hon'ble court, you will be set ex-parte and the suit will be decided by the Hon'ble Court in your absence as deem fit.

//BY ORDER OF THE COURT//
Y.M.KANTAIAH
Advocate
H.No.8-1-18/49/2, Kranthinagar, Karmanghat, Hyderabad - 500 0079
Cell No:9441697962

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE , MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: KUKATPALLY
O.S.No.296 Of 2024
(Suit for Declaration of legal heirs)

1.Raskatla Anasuya, W/o.Late Raskatla Raj Kumar, Aged about 74Yrs, Occ : Housewife,
2.Raskatla Raj Sekhar, S/o. Raskatla Raj Kumar, Aged about 55Yrs, Occ : Business, Both are permanent R/o.H.No.7-4-48/2, Vani Nagar, Ferozguda, Tirumala giri, Bowenpally,Medchal Malkajgiri District,Telangana-PIN: 500011.
...Petitioners/Plaintiffs No.1 and 2.
AND
1.The Tahsildar, Balanagar Mandal Medchal Malkajgiri District.
2.All concerned.
...Respondents/Defendants.

To
2.All concerned.

Please take notice that the above named Plaintiffs have filed the above OS bearing O.S.No. 296 of 2024 before the Hon'ble Prl. Junior Civil Judge, Medchal Malkajgiri District at Kukatpally to grant a judgment and decree in favour of plaintiffs No.1 and 2 herein : (i). Declaring the plaintiffs No.1 and 2 as legal heirs of Tokala Manjula (late) who was expired on 29.11. 2023, to the property bearing the Flat No.203, (In First Floor), of & qu ot;SRI BALAJI RESIDENCY", H.No.7-4-15/1 (Old), 7-4-5/1/203 (New), (PTIN No.1140702647), on Plot No.13/A, in Survey No.8, along with its Built-Up area of 1167 Square Feet, along with an undivided share of land admeasuring 30 Square Yards or 25.08 Square Meters, (Out of 387 Square Yards), Situated at VANI NAGAR, FEROZGUDA VILLAGE, under GHMC Kukatpally Circle, Balanagar Mandal, Medchal-Malkajgiri District Telangana State and Flat boundaries as follows:-

BOUNDARIES FOR FLAT No.203 :
NORTH : OPEN TO SKY,
SOUTH : LIFT, CORRIDOR & STAIRCASE,
EAST : OPEN TO SKY,
WEST : OPEN TO SKY.

and the same stands posted **to 14.10.2024** for your appearance before the aforesaid court **at 10.30 A.M.,** failing which the matter will be heard and determined in your absence.

// BY ORDER OF THE HON'BLE COURT//
Kodamagundla Ravi Kumar,
Advocate,
Flat No.123/P1, Megha Hills Apartments, Above Union Bank & PNB, Miyapur, R.R.District, Telangana-500 049.
Cell : 9848165433.

షేక్‌పేట డివిజన్‌లో రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

షేక్ పేట డివిజన్ వివేకానంద నగర్ కాలనీలో రూ. 14,00,000/- వ్యయంతో మంజూరు అయిన రోడ్డు పనులను సోమవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. మోహన్ రావు, బీఆర్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ దుర్గం ప్రదీప్ కుమార్, కాలనీ ప్రెసిడెంట్ కష్ణ, సెక్రటరీ ప్రవీణ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, కన్నా, నాయకలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బొంతు కమలమ్మకు కార్పొరేటర్ నివాళ్లు



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జీహెచ్ఎంసీ మాజీ మేయర్, బొంతు రామ్మోహన్ తల్లి బొంతు కమలమ్మ ఇటీవల కన్నుమూసిన సంగతి తెలిసిందే. సోమవారం బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వారి నివాసనికి వెళ్ళి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభుతి తెలుపుతూ నివాళులు అర్పించారు.

ప్రభుత్వ గ్రాంట్ పొందిన ఓయూ పూర్వ విద్యార్థులు

- నల్ల తామర పురుగు తెగులు నివారణకు ఆర్గానిక్ బయోపెస్టిసైడ్ త్రిప్స్ క్లియర్



నవతెలంగాణ-ఓయూ

మిర్చి, మామిడి పంటలకు తీవ్ర సమస్యగా మారి పంటనంతా నాశనం చేసి రైతులను ముప్పతిప్పలకు గురి చేస్తున్న నల్ల తామర పురుగు తెగులు నివారణకు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) పూర్వ విద్యార్థులు డాక్టర్ గాజుల ప్రభాకర్ (పీహెచ్డీ-ప్లాంట్ సైన్సెస్), డాక్టర్ పాపతోటి నరేంద్రకుమార్ (పీహెచ్డీ-మైక్రోబయాలజీ) కనిపెట్టిన ఆర్గానిక్ బయోపెస్టిసైడ్ త్రిప్స్ క్లియర్‌ను రైతులకు తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్కేలప్ ప్రాజెక్ట్ కింద టీ-స్పార్క్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ గ్రాంట్ లభించింది. న్యూఢిల్లీలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బీఐఆర్ఏసీ) అందించిన రూ. 50 లక్షల గ్రాంట్‌తో నల్ల తామర పురుగు నివారణ మీద పరిశోధనలు చేసి, అగ్రి హబ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఐకెపి నాలెడ్జ్ పార్క్ సాయంతో ఆర్గానిక్ బయో పెస్టిసైడ్ త్రిప్స్ క్లియర్‌ను తయారు చేశారు. త్వరలోనే ఇది రైతులకు అందుబాటులోకి రానుంది.

ఈ సందర్భంగా డాక్టర్ గాజుల ప్రభాకర్, డాక్టర్ పాపతోటి నరేంద్రకుమార్ మాట్లాడుతూ. "తెలంగాణ ప్రభుత్వం అందించే గ్రాంట్‌కు తమ ప్రాజెక్ట్ ఎంపికవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నాం. ఈ గ్రాంట్ వల్ల మాకు ప్రభుత్వ అండ, ప్రోత్సాహం లభించింది. తద్వారా ఈ ప్రాజెక్ట్ ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు, రైతులకు తక్కువ ధరకే దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఉపయోగపడుతుంది. ఇదే ఉత్సాహంతో మరిన్ని పరిశోధనలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తాము. కెమికల్ పెస్టిసైడ్స్ వాడటం వలన మానవులు అనేక రకాల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ బారిన పడుతున్నారు. వాటి వల్ల పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతోంది. కెమికల్ పెస్టిసైడ్‌ల వాడకం నిర్మూలించి బయోపెస్టిసైడ్స్ వాడటం వలన పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యలను అధిగమించి మెరుగ్గా పనిచేసే ఎకో ఫ్రెండ్లీ ప్రోడక్ట్‌లనే తయారు చేస్తున్నాం" అని అన్నారు.వీరిని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పీడీఎస్‌యూ పోరాటాల చరిత్ర అజరామరం

- జార్జ్ బాటలో ముందుకు సాగాలి
- వక్తలు
- ఓయూలో భారీ ప్రదర్శన
- పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ



నవతెలంగాణ-ఓయూ

పీడీఎస్‌యూ పోరాటాల చరిత్ర అజరామరమని వక్తలు అన్నారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 వసంతాలు ముగించుకుంటున్న సందర్భంగా సోమవారం హైదరాబాద్ ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి ఠాగూర్ ఆడిటోరియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అరుణోదయ డప్పు బృందాలతో, వేలాది మంది విద్యార్థులతో, హోరెత్తే నినాదాలతో అద్భుతమైన ప్రదర్శన నిర్వహించారు. "జీనా హైతో మర్నాసీకో, కదం కదం పర్ లడ్నా సీకో" అంటూ జార్జి, అమరుల వారసత్వంతో విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా, ఉద్వేగంగా సాగారు. ఠాగూర్ ఆడిటోరియం ఎదుట విద్యార్థి అమరవీరులకు ప్రధాన నాయకత్వం, పలువురు పుష్పాంజలి సమర్పించారు.

అనంతరం నిర్వహించిన పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జిబి.కోల్సే పాటిల్ మాట్లాడుతూ ఈ దేశాన్ని అనేక సామ్రాజ్యవాద దేశాలు పాలించాయని, ముఖ్యంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదం 200 సంవత్సరాల పాలించి సర్వనాశనం చేసిందన్నారు. ఈ స్థితికి కారణం సామ్రాజ్యవాదపు దోపిడీ అన్నారు. దేశాన్ని ఏలిన పాలకులు కూడా దేశ ప్రజలను దోపిడి, పీడనలకు గురి చేశారన్నారు. స్వాతంత్రం తర్వాత కూడా దేశాన్ని అవినీతి, కుల, మతాలతో ధ్వంసం చేశారన్నారు. అగ్రవర్ణ కుల ఆధిపత్యాన్ని కొనసాగించారని తెలిపారు. అధికారంలోఉన్న మోడీ బీజేపీ ప్రభుత్వం మరింత దారుణాలకు పూనుకుంటోందన్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారని, ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తున్నారని, లక్షల కోట్ల బడ్జెట్లను ప్రజలకు కాకుండా సంపన్నులకు పంచుతున్నారని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా పీడీఎస్‌యూ సమరశీల పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్ల తర్వాత కూడా దేశంలో సామాన్య ప్రజానికానికి విద్యను అందించలేని స్థితి ఉందన్నారు. ఉన్నత విద్యను చదవడానికి వస్తున్న బహుజనులకు విద్యను అందకుండా చేసేలా పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. వేలాది ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విద్యను ఎలా అందిస్తారని ప్రశ్నించారు. సమానమైన, ఉచితమైన, నాణ్యమైన విద్య కోసం పీడీఎస్‌యూ పోరాడాలని పిలుపునిచ్చారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామల ఆజాద్ అమర వీరులకు సంతాపం ప్రకటించగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించారు. విద్యార్థుల పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ అభివాదం చేశారు. ఇదే సందర్భంగా వెలువరించిన "సమరశీల స్ఫూర్తి పీడీఎస్‌యూ"అనే పుస్తకాన్నికోల్సే పాటిల్, ప్రొఫెసర్ హరగోపాల్‌లు ఆవిష్కరించారు. ఈ సభలో సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్ నరసింహారావు, పద్మ, నరేందర్, భాస్కర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, పూర్వ విద్యార్థి నాయకులు ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొ. లింబాద్రి, ప్రొ. వినాయక్ రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ హెచ్‌సీయూ, ఉస్మానియా ప్రొఫెసర్ కాసిం, ఉస్మానియా ప్రొఫెసర్ కొండా నాగేశ్వరంరావు, డాక్టర్ గుమ్మడి అనురాధ, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, పూర్వ పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

కేర్ టేకర్‌ను ఏర్పాటు చేయండి
లేదా మెర్సీ కిల్లింగ్‌కు అనుమతివ్వండి



- మస్కులర్ డిస్ట్రోఫీ బాధితులు, వారి తల్లిదండ్రులు



నవతెలంగాణ - బంజారాహిల్స్

తమకు కేర్ టేకర్ని ఏర్పాటు చేయండి లేదా మెర్సీ కిల్లింగ్‌కు అనుమతి ఇవ్వండి అంటూ మస్కులర్ డిస్ట్రోఫీ (కండర క్షీణత వ్యాధి) బాధితులు, వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కండర క్షీణత అవగాహన మాసం పురస్కరించుకొని ప్రత్యేక సదుపాయాల సాధనే లక్ష్యంగా "మా ఘోష" అనే కార్యక్రమాన్ని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మస్కులర్ డిస్ట్రోఫీ అసోసి యేషన్ సభ్యులు సోమవారం బాధితుల తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. ఇంకొకరి సహాయం లేకుండా ఎటువంటి పనులు చేసుకోలేని స్థితిలో ఉన్న మస్కులర్ డిస్ట్రోఫీ బాధితులకు తెలంగాణ ప్రభుత్వం కేర్ టేకర్‌ను ఏర్పాటు చేయాలని,లేదా కేర్ టేకర్‌ను ఏర్పాటు చేయడానికి నెలకు రూ. 15 వేలు బాధిత కుటుంబానికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఆంధ్రప్రదేశ్,కర్ణాటక ప్రభుత్వాలు మస్కులర్ డిస్ట్రోఫీ బాధితుల కోసం కేర్ టేకర్ అలవెన్స్ అందిస్తున్నాయని తెలిపారు. తమ డిమాండ్స్ నెరవేర్చాలని గతంలో రెండు సార్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాభవన్‌లో వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని వాపోయారు. తెలంగాణలో దాదాపు 3500 మంది కండర క్షీణత వ్యాధి తో బాధపడుతున్నారని తెలిపారు. తీవ్ర వైకల్యం కలిగిన వారికి 20 వేల రూపాయల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే విడతల వారిగా బ్యాటరీ వీల్ చైర్స్ మంజూరు చేసి హెల్త్ కార్డు,న్యూట్రిషన్ ఫుడ్ ఇవ్వాలని, డి.ఎన్.ఏ. టెస్టులు చేయించాలన్నారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నుంచి వీల్ చైర్లో నిరసన తెలుపుతూ ఖైరతాబాద్ ప్రధాన రహదారి పైన ర్యాలీ నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు బాసటగా నిలవాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచి ఆదుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. మోండా మార్కెట్‌లోని ఓల్డ్ జైల్ ఖానా వద్ద షాపులు కూలిపోయి నష్టపోయిన బాధితులకు మేరు సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌లు, ఆర్థిక సహాయాన్ని మోండా మార్కెట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా ఇక్కడే టైలరింగ్‌ను చేసుకుంటూ జీవనం సాగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఊహించని ప్రమాదంతో షాపులు, మిషన్ లు, దుస్తులను నష్టపోయారని తెలిపారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు చేయూత అందించిన మేరు సంఘం ప్రతినిధులను అభినందించారు. రెడీమేడ్ దుస్తుల రాకతో సరైన ఉపాధి లేక అవస్థలు పడుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. బాధితులను ఆదుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రెవెన్యూ అధికారులు వచ్చి పంచనామా నిర్వహించిన విషయాన్ని వివరించారు. వెంటనే బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, కూలిపోయిన షాపుల స్థానంలో నూతన షాపులను ప్రభుత్వమే నిర్మించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్ఎస్ నాయకులు తలసాని స్కై లాబ్ యాదవ్, నాగులు, బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, మేరు సంఘం అధ్యక్షుడు కష్ణ, హన్మంతరావు, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై ఉక్కు పాదం మోపండి

- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కంపెల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

కబ్జాలపై చర్యలు చేపట్టాలని కోరుతూ జీహెచ్ఎంసీలో నిర్వహించిన ప్రజావాణిలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు సోమవారం సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కంపెల్లి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో అడ్డు అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతూ, కబ్జాలకు పాల్పడుతున్న వారి పైన ఉక్కు పాదం మోపాలని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా దూద్ బాయ్ ప్రభుత్వ పాఠశాల దారికి అడ్డంగా ప్రహరి గోడ నిర్మించుకున్న షెడ్డును తొలగించి విద్యార్థులకు రహదారిని ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ అక్రమాలను ఉపేక్షించబోమని తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

అణిచివేతకు గురైన మాకు న్యాయం చేయండి



- తెలంగాణ రికార్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ కమిటీ

నవతెలంగాణ - బంజారాహిల్స్

గత ప్రభుత్వ హాయంలో అణిచివేతకు గురై నేటి వరకు పదోన్నతులు పొందని తమకు న్యాయం చేయాలని రాష్ట్ర రికార్డు అసిస్టెంట్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దాసరి వీరన్న ముదిరాజ్, లక్ష్మల్ల నరసింహ మౌర్యలు మాట్లాడారు. గత ప్రభుత్వ హాయంలో అణిచివేతకు గురైన తమకు రెవెన్యూ వ్యవస్థ బలోపేతంలో భాగంగా పూర్వ వీఆర్ఏలను రెవెన్యూ తో పాటు వివిధ శాఖల్లో జేఆర్వోలుగా పదోన్నతి కల్పించాలనీ కోరారు.గత ప్రభుత్వం జీవో నెంబర్ 81, 85 ద్వారా పదో తరగతి,ఇంటర్మీడియట్ అని విడదీసి తమను చెట్టుకు ఒకరిని, పుట్టకొకరిని చేస్తూ జూనియర్ అసిస్టెంట్ రికార్డ్ అసిస్టెంట్ ఓఎస్ క్యాడర్‌గా విభజించి పూర్తిగా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలనకు తమ వంతు మద్దతు అందించినందుకు ప్రభుత్వ సహకారాన్ని కోరుతున్నామని తెలిపారు. ప్రధానంగా ఇంటర్ విద్యార్హతో జేఆర్వోలుగా ప్రమోషన్ కల్పించడంతో పాటు పూర్వ వీఆర్ఏ,వీఆర్వోల పదోన్నతులు, మరణించిన వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని ,బదిలీ అయిన వారందరినీ సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో 33 జిల్లాలకు చెందిన నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థుల రాష్ట్ర స్థాయి జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-కంటోన్మెంట్

రాష్ట్రస్థాయి గిరిజన వసతి గృహ విద్యార్థుల జోనల్ క్రీడా పోటీలు సోమవారం బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, హైదరాబాద్ జిల్లా గిరిజన క్రీడాభివద్ధి శాఖ అధికారి కోటారీలు క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన హాస్టల్ విద్యార్థులు దేశానికి రాష్ట్రానికి మంచి పేరు తెచ్చేలా గొప్ప క్రీడాకారులు కావాలని కోరారు. ఇప్పటి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుంటే దేశానికి పేరు తెచ్చే క్రీడాకారులవుతారని చెప్పారు. మధుకర్ మాట్లాడుతూ ఏడు జిల్లాల నుంచి 72 మంది పాఠశాల విద్యార్థులను ఒకే చోట చేర్చి క్రీడలు నిర్వహించడం ఆషామాషీ కాదని, క్రీడలు నిర్వహించిన జిల్లా క్రీడాధికారులను, నిర్వహకులను అభినందించారు. క్రీడా పోటీల్లో ఏడు జిల్లాలు 72 పాఠశాలల 700 మంది విద్యార్థులు ఉన్నారని కోటారి చెప్పారు. కోకో, కబడ్డీ, క్యారమ్స్, చెస్ పాల్గొనేందుకు ఆసక్తితో విద్యార్థులు వచ్చారని తెలిపారు .

నిరుపేదల వైద్య ఖర్చులకు సహకారం

- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

నిరుపేదల వైద్య ఖర్చులకు సహకారం అందిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. మైలరగడ్డకు చెందిన పెద్దరాజు, దూద్ బావికి చెందిన కావేరిలు అనారోగ్యంతో సతమతమవుతోండగా వారికి శస్త్ర చికిత్స నిమిత్తమై రూ.2.75 లక్షల విలువ చేసే ఎల్.ఓ.సీ. పత్రాలను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సమకూర్చి సోమవారం సితాఫలమండీ లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ, నేతలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

లాలాపేట లోని సాయి నగర్ ప్రాంతంలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని అధికారులకు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సూచించారు. ఈ మేరకు ఓ లేఖను జిల్లా కలెక్టర్‌కు ఆయన పంపారు. పనుల్లో జాప్యం వల్ల నిరుపేదలైన లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని, పనులను త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని సూచించారు.సాయినగర్ లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ కాంప్లెక్స్‌లో సివరేజి వ్యవస్థ, మంచి నీటి సరఫరా ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని జలమండలి డీ.జీ.ఎం. సరితను ఎమ్మెల్యే ఆదేశించారు. రైల్వే, రెవిన్యూ విభాగాల అధికారులతో సమన్వయం ఏర్పాటు చేసుకొని ఈ పనులను పూర్తి చేయాలని సూచించారు.



న్యాయ కళాశాలాలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-ఓయూ

ఓయూ న్యాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో కళాశాల ఎదుట సోమవారం బతుకమ్మ సంబరాలు విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొపెసర్, ఓయూ దూరవిద్య కేంద్ర డైరెక్టర్ ప్రో.జిబి.రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రో.రాధిక యాదవ్, ప్రో.విజయ లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయలను పరిరక్షించుకుంటూ ముందుకు సాగాలని, విద్యార్థులు బతుకమ్మ సంబరాలు చేసుకోవడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో లా 5 సంవత్సరాల, లా 3 సంవత్సరాల, ఎల్ఎల్ఎం విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



యూత్ కమిటీ మీటింగ్‌కు కార్పొరేటర్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బోరబండలోని మధురానగర్ లో ఆదివారం రాత్రి జరిగిన యూత్ కమిటీ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ బాబా ఫసివుద్దీన్ హాజరయ్యారు. అనంతరం మధుర నగర్ అధ్యక్షులు చెట్టి దేవేందర్, సీసీ టీవీ కెమెరా ఏర్పాట్ల నిమ్మితం రూ. 20,000 చెక్కును, బోరబండ పోలీస్ స్టేషన్ అధికారులకు అందజేశారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు అశోక్, వీరయ్య, ప్రతాప్, శంకర్, ఆంజనేయులు గౌడ్, ముత్యాల మహేష్, జావీద్, బోరబండ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్, ఎస్.ఐ. నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

దేవి శివ నవరాత్రి ఉత్సవాలకు కోట నీలిమకు ఆహ్వానం



నవతెలంగాణ-బేగంపేట్

మహంకాళి ఆలయ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని ఆహ్వానిస్తూ కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమకు ఈ ఓ మనోహర్ రెడ్డి ఆహ్వానం అందించారు. సోమవారం అమీర్‌పేట్‌లోని వారి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరాత్రి పండుగ తొమ్మిది రాత్రుల పాటు జరిపే పండుగ అన్నారు. దుర్గా దేవిని వివిధ రూపాల్లో ఆరాధిస్తారన్నారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బి సెక్యూర్ ఔట్.. సహార ఇన్

- ముగిసిన బి సెక్యూర్ గడువు..
- టెండర్ దక్కించుకున్న సహారా
- కేవలం లోగో యే మారింది..
- తగ్గిన గార్డ్స్ వేతనాలు.. ?

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం భద్రతలో భాగంగా సోమవారం అర్ధరాత్రితో ప్రస్తుతం పనిచేస్తున్న బి సెక్యూర్ సంస్థ గడువు ముగిసింది. దాంతో నూతనంగా టెండర్‌ను సహర సంస్థ చేజిక్కించుకుంది. ప్రస్తుతం పనిచేస్తున్న 340 మంది లో 270 మంది మాజీ సైనికులు, 70 మంది మహిళ గార్డ్స్, సూపర్ వైజర్స్ ఉండగా 270 మంది పురుషులు విధులు నిర్వహిస్తున్నారు. ఇదే సంఖ్య యధావిధిగా కొనసాగనుందని తెలిసింది. వీరు మంగళవారం ఉదయం నుండి విధుల్లో చేరనున్నారు.

కేవలం లోగో యే మారింది..తగ్గిన వేతనాలు ?

ప్రస్తుతం పనిచేస్తున్న బి సెక్యూర్ స్థానంలో సహర సంస్థ రాగా బి సెక్యూర్ లో పని చేస్తున్న 80 శాతం గార్డ్స్ పనిచేస్తున్నట్టు తెలిసింది ?. ఒక్క లోగో తప్ప అదే కలర్ డ్రస్ , వారే గార్డ్స్ పని చేయనున్నారని సమాచారం. ఇక కొసమెరుపు ఏమిటంటే ప్రస్తుత సంస్థ గార్డ్స్ 12 గంటలు పని చేస్తే ఇస్తున్న వేతనం కంటే రూ. 2,500 తగ్గించి ఇస్తారని కొందరు గార్డ్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెరగాలి తప్ప ఇలా కోత విధించడం ఎంత వరకు సమంజసం అని వారు ప్రశ్నిస్తున్నారు. దీనితో కొందరు గార్డ్స్ ఈ సంస్థలో పని చేయాలా ? వద్దా ? అన్న మీమాంసలో పడ్డారు.

ప్రస్తుతం ఓయూ వీరికి వేతనం కోసం నెలకు రూ. 50 లక్షలు , సంవత్సరానికి గాను రూ 6 కోట్లు కింద చెల్లించడం విశేషం. అయితే ఇంత పెద్ద మొత్తంలో ఓయూ రక్షణ కోసం కేటాయింపు అవసరమా ? అంటు పలువురు విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో వేతనాలు ఇచ్చినా గతంలో పని చేసిన బి సెక్యూర్ సమయంలో యథేచ్చగా దొంగతనాలతో పాటుగా పలు అసాంఘిక కార్యకలాపాలు తరచుగా జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇక కొత్తగా టెండర్ చేజిక్కించు కున్న సహర కూడా 3 శాతం సర్వీస్ చార్జీ తో దక్కించుకున్నారు. సెక్యురిటీతో పాటుగా హాస్టల్ ,శానిటేషన్ ,నిర్వహణలో టెండర్ల ద్వారా నూతన సర్వీస్ సంస్థలు దక్కించుకున్నాయి.

నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

- నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని నార్త్ రష్మీ పెరమాళ్ళు నార్త్ జోన్ జోన్ డిసిపి నిర్వాహకులను కోరారు. సోమవారం క్లాసిక్ గార్డెన్‌లో అమ్మవారి మండప నిర్వహకులు, దాండియా నిర్వాహకులతో సమావేశ ం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరాత్రులు దాండియా నిర్వాహకులు నిబంధనలను పాటించాలని చెప్పారు. డీజే లాంటివి పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించకూడని, అలాగే ప్రమాదకరమైన బాణా సంచాలు బహిరంగ ప్రదేశాలలో కాల్చేవద్దని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదే అని చెప్పారు. నిర్వాహకులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు కార్యక్రమంలో నార్త్ జోన్‌లోని పలు పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు 150 వరకు మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు

నవతెలంగాణ
మానవి
మంగళవారం 1 అక్టోబర్ 2024
హైదరాబాద్
www.navatelangana.com

ఈ టిప్స్ ఫాలో అయితే..

ఆకుకూర అంటేనే పోషకాల పవర్‌హౌస్. తోటకూర, పాలకూర, మెంతి, బచ్చలి, గోంగూర.. లాంటి ఆకుకూరల్లో పొటాషియం, మెగ్నీషియం, సోడియం, కాల్షియం, ఐరన్, ఫోలేట్, ప్రొటీన్లు, విటమిన్లు వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిలో ఉన్న ఫైబర్ జీర్ణక్రియకు తోడ్పడుతుంది. వీటిలోని సి, ఇ విటమిన్లు, బీటా కెరొటిన్ కంటిచూపును మెరుగుపరుస్తాయి, యాంటీఆక్సిడెంట్లు గాయాలను తగ్గిస్తాయి. అయితే, కొన్ని సార్లు ఫ్రిజ్‌లో పెట్టినా.. ఆకుకూరలు పాడవుతూ ఉంటాయి. కొన్ని సింపుల్ టిప్స్ ఫాలో అయితే, ఆకుకూరలను ఎక్కువ రోజులు స్టోర్ చేసుకోవచ్చు. అవేంటో చూద్దాం.



టవల్‌లో చుట్టండి..

ఆకుకూరలు త్వరగా పాడవ్వడానికి ముఖ్యమైన కారణం.. అధిక తేమ. మీరు ఆకుకూరలను స్టోర్ చేసుకోవడానికి, ముందుగా ఆకులు పొడిగా ఉండేలా చూసుకోండి. దెబ్బతిన్న, చెడిపోయిన ఆకులను క్లీన్ చేయండి. ఆ తర్వాత శుభ్రమైన క్లాత్‌లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెట్టండి. ఇలా చేస్తే.. ఆకుకూరలు పాడవకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.

న్యూస్ పేపర్ వాడండి..

మీరు ఆకుకూరలు కొన్న తర్వాత.. ముందుగా వాటిలోని చెడిపోయిన ఆకులను తీసి క్లీన్ చేయండి. ఆ తర్వాత, కాడలు కత్తిరించండి. వీటిని న్యూస్ పేపర్‌లో పెట్టి రోల్ చేయండి. ఈ రోల్‌ను జిప్-లాక్ బ్యాగ్‌లో ఉంచండి. సీల్ చేసే ముందు బ్యాగ్ నుంచి లోపల గాలి లేకుండా చూసుకోండి. ఈ బ్యాగ్‌ను రిఫ్రిజిరేటర్‌లో స్టోర్ చేయండి. ఇలా చేస్తే ఆకుకూరలు వారం అంతా ఫ్రెష్‌గా ఉంటాయి.

పండ్లకు దూరంగా పెట్టండి..

యాపిల్స్, అరటిపండ్లు, కివీస్ వంటి పండ్లు ఇథిలీన్ గ్యాస్‌ను రిలీజ్ చేస్తాయి. ఇది పండ్లు, కూరగాయలు సహజంగా పండించడానికి సహాయపడుతుంది. బచ్చలికూర ఎక్కువ రోజులు ఫ్రెష్‌గా ఉండాలంటే.. ఇథిలీన్ గ్యాస్ రిలీజ్ చేసే పండ్లకు దూరంగా గాలి చొరబడని కంటైనర్‌లో స్టోర్ చేయాలి.



సాహస విన్యాసాల అదితి



అథ్లెటిసిజం కలగలసి వైమానిక విన్యాసాలుగా రూపుదిద్దుకుం టున్నాయి. చూడటానికి జిమ్నాస్టిక్‌గా అనిపిస్తూనే ఆకాశంలో హరివిల్లులా మారే నృత్యప్రదర్శన ఓ అద్భుత ప్రక్రియ. ఇది నేడు అందరి మనసును ఆకట్టుకుంటోంది. అటువంటి విలక్షణమైన క్రీడలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకుంది అదితి దేశ్‌పాండే. తనలోని నైపుణ్యానికి గుర్తుగా మహారాష్ట్ర ప్రభుత్వం నుండి క్రీడా అవార్డు సైతం అందుకుంది. ప్రస్తుతం తనకు ప్రవేశం ఉన్న ఈ విన్యాసాలలో ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇస్తుంది.

అదితి దేశ్‌పాండే ముంబైలోని తన అకాడమీ ఫ్లై హై ఏరియాల్ ఆర్ట్ గురించి మాట్లాడుతూ 'చాలా మంది ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం జిమ్‌కి వెళ్లాలనుకుంటారు. అయితే ఇదంతా గతంలో. ఇప్పుడు చాలా మంది ఏరియల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని కోరుకుంటున్నారు. పెద్దలు తమ ఆఫీసులు పూర్తి చేసుకొని, పిల్లలు తమ స్కూల్ సమయం తర్వాత శిక్షణ కోసం జరిగే క్లాసులకు హాజరయ్యేందు మా దగ్గరకు వస్తున్నారు' అని చెబుతున్నారు.

శరీర బరువులో సమతుల్యత

సిల్క్, ఫ్యాబ్రిక్, హూప్స్, తాళ్లు లేదా ట్రాపెజెస్‌ని ఉపయోగించి గాలిలో నృత్యం చేసిన వ్యక్తులు ఉన్నారు. ఈ డ్యాన్స్ సంగీతంతో సెట్ చేసి ఉంటుంది. ప్రదర్శనలు చేయడానికి వ్యక్తుల బలం, సౌలభ్యాన్ని మిళితం చేసి దృశ్యంగా మార్చే అద్భుతమైన ప్రక్రియ ఇది. ఒక సాధారణ వ్యక్తి ఈ విన్యాసాలను చాలా వరకు గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా చేయడానికి తన పూర్తి బలాన్ని ఉపయోగిస్తాడు. అయితే వైమానిక స్కిల్స్ ప్రదర్శించే సమయంలో వెనుక కండరాలను ఉపయోగించాల్సి వస్తుంది. దీని కోసం మన శరీర బరువులో ఒక సమతుల్యతను తీసుకురావాల్సి ఉంటుంది. కనుక ఈ విన్యాసాల వల్ల మన శరీర బరువు సమతుల్యంగా ఉంటుంది' అని అదితి వివరిస్తున్నారు.



వీటిని ఎలా చేస్తారంటే..?

ఈ వైమానిక ప్రదర్శనలో డ్రాప్స్, రోజులు, స్పిన్‌లు... ఇలా రకరకాలుగా చేయడానికి ముందు వ్యక్తులు తమను తాము ఫ్యాబ్రిక్‌లో చుట్టుకుంటారు. ఏరియల్ రోప్ అనేది లైక్రాతో తయారు చేయబడిన వృత్తాకార ఉపకరణం. దీనిని కళాకారులు విన్యాసాలను ప్రదర్శించడానికి ఉపయోగిస్తారు. ట్రాపెజ్ అనేది తాళ్లు, తీగలతో చేసేది. ఇక్కడ ప్రదర్శనకారులు గాలిలో ఊగుతూ విన్యాసాలు చేస్తారు. స్ట్రాప్స్‌లో కళాకారులు సీలింగ్‌కు జోడించిన పట్టీలపై ప్రదర్శనలు చేస్తారు. చూడటానికి ఇది ఎంతో అద్భుతంగా, అబ్బురపరుస్తుంది. 'ఇటువంటి సాహస విన్యాసాలు నేర్చుకునేందుకు మహిళలు ఎంతో మంది ముందుకొస్తున్నారు. అందుకే నాకు చాలా సంతోషంగా ఉంది' అని అదితి పంచుకుంటున్నారు.

ఢిల్లీలోని స్విస్ దగ్గర ప్రదర్శన

స్విస్ కళాకారుడు జాసన్ బ్రూగర్, భారతీయ హులా హూప్ ప్రాక్టీషనర్ ఎష్నా కుట్టి అక్టోబర్ 2024లో న్యూ ఢిల్లీలోని స్విస్ రాయబార కార్యాలయంలో రెండు దేశాలు 75 ఏండ్ల స్నేహాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ప్రదర్శన ఇవ్వనున్నారు. వైమానిక కళలకు 'ఉన్నత స్థాయి సాంకేతికత అవసరం. కాబట్టి ఇది కచ్చితంగా జిమ్నాస్టిక్స్ వంటి క్రీడలతో పోల్చవచ్చు. కానీ కదలిక, సంగీతం, కోర్సు సాంకేతికత ద్వారా కళ సృష్టించడం. వేదికపై ఉన్నప్పుడు నా వ్యక్తిగత లక్ష్యం నా శరీరం ఏమీ చేయగలదో చూపించడం ద్వారా ప్రజలను ఆకట్టుకోవడం నా లక్ష్యం' అంటున్నారు ఆమె.

అందరికీ అందుబాటులో ఉందా?

అహ్మదాబాద్‌లోని ఏరియల్ ఆర్ట్స్ ఇండియా అకాడమీ వ్యవస్థాపకులు మాస్టర్ ట్రైనర్ అయిన జీల్ సోనీ దీని గురించి మాట్లాడుతూ 'మా దగ్గర 55 ఏండ్ల వ్యక్తి నుండి 12 ఏండ్ల అమ్మాయి వరకు ప్రతి ఒక్కరూ ఈ ఏరియల్ ఆర్ట్ నేర్చుకోవాలనుకుంటున్నారు. ఇటీవల కాలంలో ప్రజలు సాహసాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకే జిమ్‌కి వెళ్లకుండా ఏరియల్ ఆర్ట్‌లను ఎంచుకుంటారు. పరికరాలు, మౌలిక సదుపాయాల విషయానికొస్తే క్రాష్ మ్యాట్‌లు, ప్రథమ చికిత్స, సేఫ్టీ గ్రిప్ ఎయిడ్ నుండి అన్నింటినీ మేము అందిస్తాం' అని ఆమె అంటున్నారు.

ఖర్చు ఎంతంటే..

సోని తన శిక్షణా కేంద్రంలో ఎనిమిది వైమానిక కళ శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కోర్సు మొత్తం పూర్తి చేయడానికి రెండేండ్ల సమయం పడుతుంది. ఒకటి నుండి నాలుగు స్థాయిల్లో వైమానిక కళలను పరిచయం చేస్తాయి. ఐదు నుండి ఎనిమిది వృత్తిపరమైన స్థాయిలు. ప్రతి పరిచయ స్థాయి శిక్షణకు ఒకటిన్నర నెలలకు సుమారు రూ.6500. ప్రతి ఉన్నత స్థాయికి మూడు నెలలకు రూ.13,500 ఖర్చు అవుతుంది. సృజనాత్మకత, శిక్షణ, కఠినమైన మనస్తత్వం కూడా ఈ కళకు చాలా ముఖ్యమైనవి. మంచి కోచ్‌తో పని చేస్తే సరైన శిక్షణ లభిస్తుంది. సర్కస్‌లు, డ్యాన్స్ షోలు లేదా థియేటర్‌లలో ప్రదర్శించే ఏరియల్ ఆర్టిస్టులకు రూ.లక్ష నుండి ఐదు లక్షల వరకు చెల్లిస్తారు. ముంబై, బెంగుళూరు, ఢిల్లీ, పూణేలోని స్టూడియోలు సెషన్‌ల సంఖ్య ఆధారంగా తరచుగా ప్యాకేజీలుగా ఉండే తరగతులను అందిస్తాయి. ప్లేస్, శిక్షణ రకం, కోచ్, కోర్సు వ్యవధి ఆధారంగా ట్రెయినింగ్ ఫీజు ఉంటుంది.



ప్రయివేటు స్కూల్ టీచర్లకూ దసరా సెలవులు వర్తింపజేయాలి

- విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డికి టీపీటీఎల్ఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకూ దసరా సెలవులను వర్తింపజేయాలని తెలంగాణ ప్రయివేటు టీచర్స్, లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని సోమవారం ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్‌కుమార్, నాయకులు డి సైదులు కలిసి వినతిపత్రం సమర్పించారు. బుధవారం నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిందని తెలిపారు. ఆ సెలవులు విద్యార్థులకే కాకుండా, ఉపాధ్యాయులకూ వర్తిస్థాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులకు మాత్రమే సెలవులిచ్చి, ఉపాధ్యాయులకు వర్తింపజేయడం లేదని వివరించారు. సెలవు దినాల్లో ఉపాధ్యాయులకు వర్క్‌షాప్‌లు లేదా ఇతర పనులు చెప్పి విద్యాసంస్థలకు రమ్మంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకూ సెలవులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామనీ, తగు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

పండుగ పూట 'ధరా'భారం

(మొదటిపేజీ తరువాయి)

కావడం వల్ల ప్రజలపై అధిక భారం పడింది.

కూరగాయల ధరలు

నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కూరగాయల ధరలు కూడా భారీగా పెరిగిపోయాయి. టమాటా, బెండ, పచ్చి మిర్చి, దొండకాయ, వంకాయ, క్యాబేజీ తదితర కూరగాయల ధరలు కిలో రూ.50 నుంచి 80కు చేరుకున్నాయి. ఏది కొనాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తోందని అంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బ తినడం, దళారులు, వ్యాపారులు కుమ్మక్కవడంతో అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి.

ఆకుకూరలదీ అదే దారి

ఆకుకూరల ధరలకూ రెక్కలొచ్చాయి. పాలకూర, తోటకూర, తుంటి కూర తదితర ఆకుకూరల ధరలు భారీగా పెరిగాయి. గతంలో పాలకూర కట్టలు పది రూపాయలకు మూడు ఇచ్చేవారు. ఇప్పుడు 20 రూపాయలకు మూడు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. అదేవిధంగా కొత్తిమీర, పుదీన ధర పెరిగింది. రూ.10కి కొత్తిమీర చిన్న కట్ట ఇస్తున్నారు.

పండుగ పూట పస్తులే : గృహిణి రమాదేవి

అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల దసరా పండుగ పూట పస్తులుండే పరిస్థితి నెలకొంది. నూనె, పప్పులు, కూరగాయల ధరలు ఎప్పుడూ లేని విధంగా పెరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అప్పుచేసి పండుగ చేసుకునే పరిస్థితులు వచ్చాయి.

పేదల ఇండ్లు కూల్చొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కూల్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. మూసీ బాధితులు మాట్లాడుతూ.. తమను నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు పంపిస్తామని చెబుతున్నారన్నారు. కానీ తాము ఊర్లో పొలాలు, బంగారం అమ్ముకొని, బ్యాంకు లోను తీసుకొని ఇక్కడ ఇండ్లు కట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికీ ఇండ్ల అప్పు తీరలేదన్నారు. ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధి, మూసీ అభివృద్ధి పేరు చెప్పి ఇండ్లను తొలగిస్తే పేదల బతుకులు వీధిన పడే ప్రమాదం ఉందని, తమకు ఆత్మహత్య తప్ప వేరే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట మూసీ నివాసితుల సంఘం కమిటీ సభ్యులు జి.రాములు, ఉమాదేవి, మల్లేష్ గౌడ్, దుర్గ, మహేష్, పసాద్, ప్రజలు పాల్గొన్నారు.

టీచర్ కొలువు ఉద్యోగం కాదు..భావోద్వేగం

(మొదటిపేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సలహాదా రులు కె కేశవరావు, వేంనరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం కార్యదర్శి మానిక్‌రాజ్, పాఠశాల విద్యా శాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు, విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదనీ, భావోద్వేగమని అన్నారు. ప్రజాప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియ అని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ పదేండ్ల పాలనలో కేవలం ఒకసారి టీఆర్టీ నిర్వహించి 7,857 ఉపాధ్యాయ పోస్టులను మాత్రమే భర్తీ చేసిందని వివరించారు. విద్యాశాఖను పట్టించు కోలేదనీ, పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం పది నెలల్లోనే 11,062 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నిర్వహించి, ఫలితాలు ప్రకటించిందని అన్నారు. పేద పిల్లలు, నిరుద్యోగుల పట్ల తమకున్న చిత్తశుద్ధి అని చెప్పారు. ప్రతి పోస్టుకు 1:3 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలన జిల్లాల వారీగా చేపడతామని వివరించారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత టెట్ నిర్వహించాలంటూ నిరుద్యోగుల నుంచి విజ్ఞప్తి వచ్చిందన్నారు. దీంతో మరోసారి టెట్ నిర్వహించామనీ, డీఎస్సీ రాసేందుకు అదనంగా 1,09,168 మంది అభ్యర్థులు అర్హత సాధించారని వివరించారు. డీఎస్సీ రాతపరీక్షలను సమర్థవంతంగా నిర్వహించిన విద్యా శాఖ అధికారులను ఆయన అభినందించారు.

పిట్ట గూళ్లలో, పౌల్ట్రీల్లో గురుకులాలు

గురుకులాలను ప్రారంభించామంటూ కేసీఆర్ ప్రభుత్వం గొప్పగా చెప్పేదని రేవంత్‌రెడ్డి అన్నారు. పిట్టగూళ్లలో, పౌల్ట్రీల్లో గురుకులాలను ప్రారంభించారని చెప్పారు. కనీస మౌలిక వసతులను కల్పించలేదన్నారు. తాము 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను విశ్వవిద్యాలయాల స్థాయిలో వసతులు కల్పించి నిర్మిస్తున్నామని వివరించారు. క్రీడా స్థలం, ల్యాబ్, తరగతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులకు నివాసాలు వంటి సకల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టు కింద కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. త్వరలో వంద నియోజకవర్గాల్లో వంద ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తామన్నారు.

ఒక్కో గురుకుల విద్యాసంస్థ నిర్మాణానికి రూ. 100 కోట్ల నుంచి రూ.125 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, నిధులు తక్కువగా కేటాయించిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక విద్యా శాఖకు నిధుల కేటాయింపు పెంచామనీ, అవి సరిపోవనీ, భవిష్యత్‌లో నిధులు మరింతగా పెంచుతామని వివరించారు. ప్రభుత్వ బడుల్లో వసతుల లేమి గురించి కొన్ని పార్టీలకు చెందిన మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఆ స్కూళ్లు కొత్తగా ఏర్పడ్డాయా, పదేండ్ల నుంచి వాటిలో సమస్యలున్నాయనీ, గత ప్రభుత్వం మౌలిక వసతులను కల్పిస్తామంటే ఎవరైనా అడ్డుకున్నారా? అని ప్రశ్నించారు. గత పాలకులు బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్లే సమస్యలు వచ్చాయన్నారు. అన్ని స్కూళ్లలో మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఏండ్ల తరబడి ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టలేదని వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక ఎలాంటి వివాదాలకు తావు లేకుండా బదిలీలు, పదోన్నతులను చేపట్టామని అన్నారు. విద్యపై పెట్టేది ఖర్చు కాదనీ, పెట్టుబడి అని తాము భావిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సంఖ్య తక్కువున్న స్కూళ్లను మూసివేయబోమనీ, పేదలకు విద్యను దూరం చేయబోమని అన్నారు. ఉపాధ్యాయ నియామకాలు పూర్తయ్యాక ఫిబ్రవరిలో మరో డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని వివరించారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తామనీ, కమిటీని నియమిస్తామని విలేకర్లు అడిగిన ఓ ప్రశ్నకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు.

డీఎస్సీ వివరాలు

డీఎస్సీ నోటిఫికేషన్	ఫిబ్రవరి 29
మొత్తం పోస్టులు	11,062
స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)	2,629
భాషా పండితులు (ఎల్పీ)	727
వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు(పీఈటీ)	182
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)	6,508
స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)	220
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (స్పెషల్ ఎడ్యుకేషన్)	796
డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు	2,79,838
రాత పరీక్షలకు హాజరైన వారు	2,46,584

కార్మిక హక్కులు కాలరాయడం దేశద్రోహమే

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలివ్వాలనీ, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ కార్మికులకు భద్రత, యూనియన్లు అవసరం లేదన్నట్టు కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. కార్మికులు లేకుంటే పారిశ్రామికవేత్తలకు బతుకు లేదనీ, దేశ ఆర్థిక వ్యవస్థ నిలబడదని చెప్పారు. ప్రతి రంగంలోనూ కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారనీ, వారి శ్రమ లేకుండా దేశ ఆర్థికవ్యవస్థ ఎదగడం ఎలా సాధ్యమని ప్రధానిని ప్రశ్నించారు. పోరాటాల ద్వారా సాధించుకున్న కనీస వేతనాలు, గ్రాట్యూటీ, పీఎఫ్, బోనస్ తదితర హక్కులను మోడీ సర్కారు కోడ్‌ల పేరుతో కాలరాయాలని చూస్తున్నదని విమర్శించారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటకు పెంచడం దుర్మార్గమన్నారు. యజమానులకు అనుకూలంగా కార్మిక శాఖను మార్చటాన్ని తప్పుబట్టారు. పర్మినెంట్ ఉద్యోగ వ్యవస్థను క్రమంగా తగ్గిస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్, తాత్కాలిక, డైలీవేజ్, అప్రెంటీస్, పీస్ రేటెడ్, హోమ్ బేస్డ్ వర్కర్ల విధానాలతో కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తోందని వాపోయారు. మోడీ సర్కారు అప్రెంటీస్ లను 30 శాతం పెంచుకోవడానికి అవకాశమిచ్చిందని విమర్శించారు.

ఆరు, మూడు నెలల కాలానికి ఒప్పందంతో ట్రైనీ వ్యవస్థను విస్తరిస్తూ శాశ్వత కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తున్న తీరును వివరించారు. దీంతో రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య ఐదు శాతానికి పడిపోయిందన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు రాయితీలపై రాయితీలిస్తూ ఉత్పత్తిలో కీలకంగా ఉన్న కార్మికులకు మాత్రం కనీస వేతనాలు పెంచడం లేదని విమర్శించారు. వలస కార్మిక చట్టం ప్రకారం వేతనాలు, ఉద్యోగ భద్రత, నివాసం, ఆరోగ్యం లాంటి సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. వారికి రక్షణ కల్పించే చర్యలకు కార్మిక శాఖ పూనుకోవాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సి ఉండగా కార్మిక శాఖ రూ.18 వేలు నిర్ణయించిందనీ, యాజమాన్యాల ఒత్తిడితో దాని నుంచీ కాంగ్రెస్ సర్కారు వెనక్కి తగ్గిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలనీ, వారికి ఉద్యోగ భద్రత కల్పించి రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్వీ.రమ, జె. మల్లికార్జున్,కె. ఈశ్వర్‌రావు, జె.చంద్రశేఖర్, వీఎస్. రావు,రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, బి. మధు, పద్మశ్రీ, కూరపాటి రమేష్, ఎం. వెంకటేష్, బి. మల్లేష్, కాసు మాధవి పాల్గొన్నారు.

కూల్చివేతలు కాదు.. చెరువుల పునరుద్ధరణే లక్ష్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

కూల్చివేతలు లక్ష్యం కాదని.. చెరువుల పునరుద్ధరణే హైడ్రా లక్ష్యమని కమిషనర్, ఐజీ ఏవీ రంగనాథ్ తెలిపారు. మూసీ సుందరీకరణలో భాగంగా నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలను కూల్చివేయాలని సర్కారు నిర్ణయించడం, ఆ ఇండ్లకు మార్కింగ్ చేస్తుండటంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం కీలక ప్రకటన చేశారు. మూసీ నదికి ఇరువైపులా చేస్తున్న సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలూ చేపట్టడం లేదని అన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇండ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టు అని చెప్పారు. దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. పేదలు, మధ్య తరగతి ప్రజల ఇండ్లను హైడ్రా కూల్చివేయ దని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, అసత్య ప్రచారాలు నమ్మొద్దని పేర్కొన్నారు. హైడ్రా పరిధి ఔటర్ రింగ్ రోడ్డు వరకేనని స్పష్టం చేశారు. నగరంలోనే కాదు, ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలను కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొ న్నారు. కూల్చివేతలన్నీ హైడ్రావి కావని, ప్రజలు గుర్తించాలని అన్నారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా హైడ్రా చర్యలు తీసుకుంటుందన్నారు.

కుప్పకూలిన మార్కెట్లు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలు చవి చూశాయి. అమ్మకాల ఒత్తిడితో సోమవారం బీఎస్ఇ సెన్సెక్స్ 1250 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 50 సూచీ 25,850 దిగువన నమోదయ్యింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌ల్లో భారీగా అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో ఒక్క పూటలోనే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.55 లక్షల కోట్లు ఆవిరయ్యింది. ఇటీవల వరుసగా పెరుగుతూ నూతన గరిష్టాలకు చేరిన సూచీల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. మరోవైపు విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం వల్ల మార్కెట్లలో ప్రతికూలత నెలకొంది.

ఉదయం 85,209 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ సూచీ.. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో ఏకంగా 84,257 కనిష్టాన్ని చవి చూసింది. తుదకు 1272 పాయింట్లు లేదా 1.49 శాతం నష్టంతో 84,299.78కు పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 368 పాయింట్లు లేదా 1.41 శాతం నష్టపోయి 25,810.85 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. రిలయన్స్ షేర్ ఏకంగా 3.23 శాతం లేదా రూ.98.60 పతనమై రూ.2,953.80 వద్ద ముగిసింది. మరోవైపు జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు మాత్రమే లాభపడిన వాటిలో ఉన్నాయి.

చైనా వైపు ఎఫ్ఐఐల దృష్టి

ఇటీవల చైనా ప్రభుత్వం వృద్ధికి ఊతమిచ్చేలా పలు చర్యలు, విధానాలు ప్రకటించడంతో విదేశీ మదుపర్లు అక్కడి మార్కెట్లపై ఆసక్తిని కనబర్చి ఉంటారని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు పెరిగాయి. దీంతో భారత మార్కెట్లపై ప్రతికూలం పడింది. పశ్చిమసియాలో లెబనాన్‌పై ఇజ్రాయిల్ వరుస దాడుల వల్ల నెలకొన్న భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు మదుపర్లను ఆందోళనకు గురి చేస్తున్నాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.81 శాతం, 0.75 శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.3.55 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.474.38 లక్షల కోట్ల వద్ద ముగిసింది.



బజ్‌బాల్ ధనాధన్



ఎడతెగని వర్షంతో తొలి మూడు రోజుల్లో 35 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. నాల్గో రోజు ఆటలో భారత క్రికెటర్లు గత రెండు రోజుల ఆకలి తీర్చుకున్నారు. బంతితో, బ్యాట్‌తో బంగ్లాదేశ్‌పై ముప్పేట దాడి చేశారు. బుమ్రా, సిరాజ్, అశ్విన్ దెబ్బకు బంగ్లాదేశ్ చివరి ఏడు వికెట్లను 121 పరుగులకే కోల్పోయింది.
సమయం లేదు మిత్రమా.. అంటూ యశస్వి, రాహుల్, కోహ్లి వీరవిహారం చేశారు. టెస్టు మ్యాచ్‌లో టీ20 తరహా ఇన్నింగ్స్‌లతో దంచికొట్టారు. 8.22 రన్‌రేట్‌తో పరుగుల వరద పారించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 52 పరుగుల ఆధిక్యం దక్కించుకుంది.
ఆఖరు రోజు ఆటలో గెలుపే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది. బంగ్లాదేశ్‌ను రెండో ఇన్నింగ్స్‌లో ఉదయం సెషన్లోనే ముగించేసి.. టెస్టు సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకోవాలని టీమ్ ఇండియా ప్రణాళిక. మరోసారి బౌలర్లు, బ్యాటర్లు బజ్‌బాల్ ధనాధన్‌తో రెచ్చిపోతే నేడు ఫలితం పెద్ద కష్టమేమీ కాబోదు!.



- కాన్పూర్‌లో భారత్ ఆల్‌రౌండ్ షో
- బంతితో బుమ్రా, సిరాజ్, అశ్విన్ మెరుపులు
- బ్యాట్‌తో యశస్వి, రాహుల్, విరాట్ దూకుడు
- రెండో టెస్టులో ఫలితం ఆశలు సజీవం

నవతెలంగాణ-కాన్పూర్

వర్షం ఆటంకంతో నిస్తేజంగా మారిన కాన్పూర్ టెస్టుకు టీమ్ ఇండియా జీవం పోసింది. మూడు రోజుల ఆటలో 35 ఓవర్లు మాత్రమే ఆడటంతో.. ఇక ఫలితం తేలటం కష్టమే అనిపించింది. కానీ భారత బౌలర్లు, బ్యాటర్లు దంచికొట్టడంతో గ్రీన్‌పార్క్ స్టేడియంలో భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు ఫలితం దిశగా సాగుతోంది!. బుమ్రా (3/50), సిరాజ్ (2/57), అశ్విన్ (2/45), ఆకాశ్ (2/43) రాణించటంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 233 పరుగులకే కుప్పకూలింది. మోమినుల్ హాక్ (107 నాటౌట్, 194 బంతుల్లో 17 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (72, 51 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెఎల్ రాహుల్ (68, 43 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలు బాదగా.. విరాట్ కోహ్లి (47), శుభ్‌మన్ గిల్ (39), రోహిత్ శర్మ (23) ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 285/9 పరుగుల వద్ద డిక్లరేషన్ ప్రకటించింది. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 26/2తో ఆడుతోంది. ఇస్లాం (7 నాటౌట్), మోమినుల్ (0 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచారు. నాల్గో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 26 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది.

బుమ్రా ఉగ్రరూపం!

ఓవర్‌నైట్ స్కోరు 107/3తో బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్ భారత పేసర్ల ధాటికి మరో 121 పరుగులకే చివరి ఏడు వికెట్లను కోల్పోయింది. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ఉగ్రరూపం దాల్చాడు. ముష్ఫీకర్ (11), మెహిది (20), తైజుల్ (5) వికెట్లను పడగొట్టిన బుమ్రాకు.. సిరాజ్, అశ్విన్ జతకలిశారు. ఓ ఎండ్‌లో మోమినుల్ హాక్ (107 నాటౌట్) అజేయ సెంచరీతో బంగ్లా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించగా.. మరో ఎండ్ నుంచి వికెట్ల వేటను సాగించారు. లిటన్ దాస్ (13), హసన్ (1)లను సిరాజ్ ఖాతాలో వేసుకోగా.. ఖలీద్ (0) వికెట్‌తో రవీంద్ర జడేజా టెస్టుల్లో 300వ వికెట్‌ను సాధించాడు. 74.2 ఓవర్లలో 233 పరుగులకే తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ కుప్పకూలింది.

కలిసికట్టుగా కొట్టారు

వర్షంతో ఎనిమిది సెషన్ల ఆట రద్దు కాగా.. మ్యాచ్‌లో ఫలితం కోసం భారత్ టీ20 శైలిని అనుసరించింది. కెప్టెన్ రోహిత్ శర్మ ఎదుర్కొన్న తొలి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. యశస్వి జైస్వాల్ బౌండరీల మోత మోగించాడు. దీంతో 3 ఓవర్లలోనే భారత్ 50 పరుగుల మార్క్ చేరుకుంది. రోహిత్ నిష్క్రమించినా.. శుభ్‌మన్ (39) తోడుగా జైస్వాల్ చెలరేగాడు. 10.1 ఓవర్లలోనే 100 పరుగులు పిండుకున్న భారత్.. ఎక్కడా జోరు తగ్గలేదు. రిషబ్ పంత్ (9) ఒక్కడే అంచనాలను అందుకోలేదు. విరాట్ కోహ్లి (47), కెఎల్ రాహుల్ (68) మెరుపు వేగంతో పరుగులు పిండుకున్నారు. 34.4 ఓవర్లలో 8.22 రన్‌రేట్‌తో పరుగులు చేసిన భారత్ 285 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ప్రకటించింది. తొలి ఇన్నింగ్స్‌లో 52 పరుగుల ఆధిక్యం దక్కించుకుంది.

అశ్విన్ మాయ

నాల్గో రోజు ఆఖర్లో చివరి 45 నిమిషాల ఆటలో అశ్విన్ మాయ చేశాడు. రెండు వికెట్లతో బంగ్లాదేశ్‌ను ఒత్తిడిలో పడేశాడు. ఇస్లాం (7 నాటౌట్), మోమినుల్ (0 నాటౌట్) అజేయంగా నిలిచారు. జాకిర్ హసన్ (10), హసన్ మహ్మద్ (4)లను అశ్విన్ పెవిలియన్‌కు చేర్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో 26 పరుగులు చేసిన బంగ్లాదేశ్ 2 వికెట్లు చేజార్చుకుంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌కు మరో 26 పరుగుల వెనుకంజలో నిలిచింది.

స్కోరు వివరాలు :

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ : జాకిర్ (సి) యశస్వి (బి) ఆకాశ్ 0, ఇస్లాం (ఎల్బీ) ఆకాశ్ 24, మోమినుల్ నాటౌట్ 107, నజ్ముల్ (ఎల్బీ) అశ్విన్ 31, ముష్ఫీకర్ (బి) బుమ్రా 11, లిటన్ దాస్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13, షకిబ్ (సి) సిరాజ్ (బి) బుమ్రా 9, మెహిది (సి) గిల్ (బి) బుమ్రా 20, తైజుల్ (బి) బుమ్రా 5, హసన్ (ఎల్బీ) సిరాజ్ 1, ఖలీద్ (సి,బి) జడేజా 0, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం :** 74.2 ఓవర్లలో ఆలౌట్) 233.

బౌలింగ్ : బుమ్రా 18-7-50-3, సిరాజ్ 17-2-57-2, అశ్విన్ 15-1-45-2, ఆకాశ్ 15-6-43-2, జడేజా 9.2-0-28-1.

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి (బి) హసన్ 72, రోహిత్ (బి) మెహిది 23, గిల్ (సి) హసన్ (బి) షకిబ్ 39, పంత్ (సి) హసన్ (బి) షకిబ్ 9, కోహ్లి (బి) షకిబ్ 47, రాహుల్ (స్టంప్డ్) లిటన్ (బి) మెహిది 68, అశ్విన్ (బి) షకిబ్ 1, ఆకాశ్ (సి) ఖలీద్ (బి) మెహిది 12, బుమ్రా నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం :** (34.4 ఓవర్లలో 9 వికెట్లకు) 285 డిక్లేర్డ్.

బౌలింగ్ : హసన్ 6-0-66-1, ఖలీద్ 4-0-43-0, మెహిది 6.4-0-41-4, తైజుల్ 7-0-54-0, షకిబ్ 11-0-78-4.

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ : ఇస్లాం నాటౌట్ 7, జాకిర్ (ఎల్బీ) అశ్విన్ 10, హసన్ (బి) అశ్విన్ 4, మోమినుల్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం :** (11 ఓవర్లలో 2 వికెట్లకు) 26.

బౌలింగ్ : బుమ్రా 3-1-3-0, అశ్విన్ 5-2-14-2, ఆకాశ్ 3-2-4-0.

రికార్డుల వరద!

కాన్పూర్ టెస్టులో భారత బ్యాటర్ల దూకుడుకు రికార్డులు మోకరిల్లాయి. యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ తొలి బంతి నుంచే బౌండరీ లైన్ లక్ష్యంగా దంచికొట్టగా.. శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ అదే బాటలో నడిచారు. భారత బ్యాటర్ల మెరుపులతో టెస్టు క్రికెట్ రికార్డులు బద్దలయ్యాయి. అత్యంత వేగంగా 50, 100, 200 పరుగులు చేసిన జట్టుగా టీమ్ ఇండియా నిలిచింది. 10.1 ఓవర్లలోనే 100 పరుగులు, 24.2 ఓవర్లలోనే 200 పరుగులు, 18 బంతుల్లోనే (3 ఓవర్లు) 50 పరుగులు చేసి.. టెస్టు క్రికెట్ చరిత్రలో వేగంగా ఈ మైలురాయిని చేరుకున్న ఘనత దక్కించుకుంది. నిరుడు వెస్టిండీస్‌పై 12.2 ఓవర్లలో 100 పరుగులు చేసిన భారత్.. స్వీయ రికార్డును 2.1 ఓవర్లతో మెరుగుపర్చుకుంది. 34.4 ఓవర్లలో 285 పరుగులు చేసిన భారత్.. 8.22 రన్‌రేట్‌తో పరుగులు పిండుకుంది. టెస్టు క్రికెట్ చరిత్రలో మరే జట్టు 8.22 రన్‌రేట్‌తో ఇన్ని పరుగులు చేయలేదు. పేసర్లు, స్పిన్నర్లు మెరవటంతో నాల్గో రోజు ఆటలో ఏకంగా 18 వికెట్లు పడ్డాయి. బంగ్లాదేశ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు కోల్పోగా.. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లు సమర్పించుకుంది.

ప్రభుత్వం నిర్ణయిస్తుంది!

పాకిస్థాన్ పర్యటనపై రాజీవ్ శుక్లా



కాన్పూర్ : భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. 2008 నుంచి పాకిస్థాన్ పర్యటనకు భారత జట్టు వెళ్లటం లేదు. ఐసీసీ ఈవెంట్లలో మాత్రమే పాకిస్థాన్‌తో పోటీపడుతుంది. వచ్చే ఏడాది ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ వేదికగా నిలువనుంది. 2023 ఐసీసీ వరల్డ్‌కప్‌కు పాకిస్థాన్ జట్టు భారత్‌కు వచ్చింది. భారత్ సైతం చాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్‌కు వస్తుందని ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) భావిస్తుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ విషయంలో ఒకే మాటపై నిలబడుతూ వస్తోంది!. పాకిస్థాన్ సహా ఏ దేశ పర్యటనకు అయినా భారత ప్రభుత్వం అనుమతి ఇస్తేనే వెళ్తామని చెబుతోంది. బీసీసీఐ సీనియర్ ఆఫీస్ బేరర్ రాజీవ్ శుక్లా మరోసారి ఈ విషయం స్పష్టం చేశాడు. కాన్పూర్‌లో భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు సందర్భంగా రాజీవ్ శుక్లా మీడియాతో మాట్లాడాడు. 'ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్‌కు వెళ్లటంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. విదేశీ పర్యటనలకు మాకు ఓ విధానం ఉంటుంది. విదేశీ పర్యటనలకు భారత జట్టు వెళ్లాలా? వద్దా? అనే అంశం ప్రభుత్వం నిర్ణయిస్తుంది. చాంపియన్స్ ట్రోఫీ విషయంలోనూ అదే పాలసీ ఉంటుంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా బీసీసీఐ పాటిస్తుంది' అని రాజీవ్‌శుక్లా తెలిపారు.

ఇరానీ పోరుకు సర్ఫరాజ్

ధ్రువ్ జురెల్, యశ్ దయాల్ సైతం



ముంబయి : భారత టెస్టు జట్టుకు ఎంపికైన యువ క్రికెటర్లు సర్ఫరాజ్ ఖాన్, యశ్ దయాల్, ధ్రువ్ జురెల్‌లు నేటి నుంచి ఆరంభం కానున్న ఇరానీ కప్‌లో పోటీపడనున్నారు. కాన్పూర్ టెస్టులో భారత తుది జట్టులో ఈ ముగ్గురు యువ క్రికెటర్లకు చోటు దక్కలేదు. నాలుగు రోజుల పాటు జట్టుతో ఉన్న ఈ క్రికెటర్లను ఇరానీ కప్ కోసం విడుదల చేస్తూ బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. లక్నోలోని ఎకానె స్టేడియంలో నేటి నుంచి ఇరానీ కప్ జరుగనుంది. ముంబయితో రెస్టాఫ్ ఇండియా పోటీపడనుంది. సర్ఫరాజ్ ఖాన్ ముంబయి తరఫున ఆడనుండగా.. అజింక్య రహానె కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. రెస్టాఫ్ ఇండియాకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహిస్తున్నాడు. ధ్రువ్ జురెల్, యశ్ దయాల్‌లు రెస్టాఫ్ ఇండియా తరఫున బరిలోకి దిగుతున్నారు.

ముగిసిన సైకిల్ పోలో పోటీలు



హైదరాబాద్ : 20 జిల్లాలు పోటీపడిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సైకిల్ పోలో పోటీలు ఆదివారం ముగిశాయి. సీనియర్ మెన్ విభాగంలో నిజామాబాద్ స్వర్ణం సాధించగా.. ఆదిలాబాద్, కల్వకుర్తి జట్లు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ దక్కించుకున్నాయి. సీనియర్ ఉమెన్ విభాగంలో హైదరాబాద్ బంగారు పతకం గెల్చుకోగా.. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లు టాప్-3లో నిలిచాయి. జూనియర్ బాలికల విభాగంలో ఆదిలాబాద్, హైదరాబాద్, కల్వకుర్తి...బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, హైదరాబాద్, కరీంనగర్‌లు పతకాలు సాధించాయి. ఎస్ఆర్ ప్రైమ్ విద్యాసంస్థల ఛైర్మన్ వరద రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణ సైకిల్ పోలో సంఘం అధ్యక్షుడు జీవరత్నం, ప్రధాన కార్యదర్శి ఎం. ప్రవీణ్ కుమార్, టెక్నికల్ స్టాఫ్ చందర్‌రావు, మహేశ్, హజీరాబేగం, రామారావు, వెంకటేశ్, శ్రీను సహా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు బహుమతి ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవచిత్రం

సరికొత్త అనుభూతినిచ్చే సినిమా



సైన్స్ ఫిక్షన్, మైథలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'రహస్యం ఇదం జగత్'. రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథమ్ ముఖ్యతారలుగా రూపొందుతున్న చిత్రమిది. సింగిల్ సెల్ యూనివర్స్ ప్రొడక్షన్ పతాకంపై కోమల్ ఆర్ భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతుంది. నవంబర్ 8న చిత్రం విడుదల కానుంది.
తాజాగా ఈ చిత్ర టీజర్‌ను అమెరికాలోని డల్లాస్‌లో విడుదల చేశారు మేకర్స్. ఓ తెలుగు సినిమా టీజర్‌ని అమెరికాలో విడుదల చేయడం ఇదే తొలిసారి. ఈ వేడుకలో యూనివర్శిటీ స్టూడెంట్స్‌తో పాటు అమెరికాలోని సినీ ప్రేమికులు, తానా నాటా అసోసియేషన్ ప్రతినిధులతో పాటు ఇతర తెలుగు అసోసియేషన్ సభ్యులు కూడా హాజరయ్యారు.
ఈ సందర్భంగా దర్శకుడు కోమల్ ఆర్ భరద్వాజ్ మాట్లాడుతూ, 'మన పురాణాలు, ఇతిహాసాల్లోని ఆసక్తికరమైన పాయింట్‌ను తీసుకుని సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ అంశాలకు మంచి ట్విస్ట్‌లు జోడించి ఈ చిత్రం రూపొందించాం. ముఖ్యంగా మన శ్రీచక్రం, శ్రీ యంత్రం, మన చారిత్రాత్మక చరిత్ర గురించి చెబుతున్న పాయింట్ అందరికి గూజ్‌బంప్స్ తీసుకొచ్చే విధంగా వుంటుంది. తప్పకుండా ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని నమ్మకంగా చెప్పగలను. ప్రేక్షకులకు ఇంట్రెస్ట్ కలిగించే అంశాలతో పాటు స్టనింగ్ విజువల్స్ కూడా ఈ చిత్రంలో ఉంటాయి' అని అన్నారు.



శ్రీ విష్ణు, మీరా జాస్మిన్

స్వచ్ఛమైన ప్రేమను తెలిపే నీలో.. నాలో

'రాజా రాజా చోర' సూపర్ హిట్ తర్వాత శ్రీవిష్ణు, హసిత్ గోలి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టిజి విశ్వ ప్రసాద్ మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ 'శ్వాగ్'తో అలరించడానికి రెడీ అవుతున్నారు. ఈనెల 4న థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. గ్లింప్స్, టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. వివేక్ సాగర్ కంపోజ్ చేసిన ఫస్ట్ సింగిల్ 'సింగరో సింగ', సెకండ్ సింగిల్- 'గువ్వ గూటి', థర్డ్ సింగిల్ 'ఇంగ్లాండు రాణి..' సాంగ్స్ చార్ట్‌బస్టర్ హిట్ అయ్యాయి. తాజాగా మేకర్స్ నాస్టాల్జిక్ మెలోడీ 'నీలో నాలో' సాంగ్‌ని రిలీజ్ చేశారు.
వివేక్ సాగర్ ఈ సాంగ్‌ని సోల్‌ఫుల్, నాస్టాల్జిక్ మెలోడీగా స్కోర్ చేశారు. భువన చంద్ర మీనింగ్ ఫుల్ అండ్ క్యాచీ లిరిక్స్‌తో సాంగ్ ఇన్‌స్టంట్ చార్ట్ బస్టర్‌గా నిలిచింది. రాజేష్ కృష్ణన్, అంజనా సౌమ్య మెస్మరైజింగ్ ఓకల్స్‌తో పాడిన ఈ సాంగ్ సెటప్, కాస్ట్యూమ్స్, కంపోజిషన్‌తో ఆడియన్స్‌ని 80, 90లోకి తీసుకెళ్ళింది. పాటలో లీడ్ పెయిర్ శ్రీవిష్ణు, మీరా జాస్మిన్ కెమిస్ట్రీ అద్భుతంగా ఉంది. ఈ మెలోడీ ట్రాక్ వారి ప్రేమకథని బ్యూటీఫుల్‌గా ప్రజెంట్ చేస్తోంది. రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదరామన్ శంకరన్ సినిమాటోగ్రాఫర్ కాగా, జీఎం శేఖర్ ఆర్ట్ డైరెక్టర్, నందు మాస్టర్ స్టంట్స్ నిర్వహిస్తున్నారు.

బహిర్భూమి రిలీజ్‌కి రెడీ



నోయల్, రిషిత నెల్లూరు

నోయల్, రిషిత నెల్లూరు హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'బహిర్భూమి'. ఈ చిత్రాన్ని మహకాళి ప్రొడక్షన్ బ్యానర్ పై మచ్చ వేణుమాధవ్ నిర్మిస్తున్నారు. రాంప్రసాద్ కొండూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. తాజాగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. నిర్మాత మచ్చ వేణు మాధవ్ మాట్లాడుతూ, 'మా సినిమాకు సెట్ బాయ్ నుంచి హీరో వరకు ప్రతి ఒక్కరూ సపోర్ట్ చేశారు. ఇలాంటి మంచి మూవీ నిర్మించినందుకు ఆనందంగా ఉంది. అక్టోబర్ 4న ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నాం. మరికొద్ది రోజుల్లో ఇతర భాషల్లోనూ మా సినిమాను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. అలాగే నేడు (సోమవారం) న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్ బోర్డ్ పై మా మూవీ ట్రైలర్ డిస్ ప్లే చేస్తాం. హాష్ ట్యాగ్ 'బహిర్భూమి' అని సోషల్ మీడియా పోస్టులు చేసిన వారిలో ముగ్గురిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి 5 వేల రూపాయల బహుమతి అందిస్తాం. థియేటర్‌లో మా సినిమా చూస్తారని ఆశిస్తున్నా' అని అన్నారు. "'బహిర్భూమి' అనే మాటకు ఎంతో చరిత్ర ఉంది. అప్పట్లో రెండు ఊర్ల మధ్యలో బహిర్భూమి ప్లేస్ కోసం గొడవలు జరిగేవి. ఈ టైటిల్ సినిమాకు ఎందుకు పెట్టామో మూవీ చూస్తే తెలుస్తుంది. మా వేణు మాధవ్ మంచి ప్రొడ్యూసర్. అలాంటి మంచి ప్రొడ్యూసర్స్ ఇండస్ట్రీలో స్థిరపడాలి. మా సినిమాకు హీరో నోయెల్ ఎంతో సపోర్ట్ చేశారు. ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ ఇచ్చిన సపోర్ట్‌తో మీ అందరికీ నచ్చేలా సినిమా చేయగలిగాను. మా సినిమాను చూసి ఆదరిస్తారని కోరుకుంటున్నాను' అని దర్శకుడు రాంప్రసాద్ కొండూరు చెప్పారు. హీరో నోయెల్ మాట్లాడుతూ, 'ఇలాంటి మంచి చిత్రంలో నటించినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా' అని తెలిపారు.

మురికి బతుకులు



92 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలే

పట్టణాల్లో మురుగుకాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసేది వారే
అధికంగా 68 శాతం ఎస్సీ వర్గం నుంచే : కేంద్రం

న్యూఢిల్లీ : పట్టణాల్లోని మురికి పనుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలవారే 90 శాతానికి పైగా ఉన్నారు. మురుగుకాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసే కార్మికులుగా అధిక భాగం వారు ఉన్నారు. భారత్‌లోని నగరాలు, పట్టణాల నుంచి ప్రభుత్వం సేకరించిన సమాచారం ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీ) నుంచి 3 వేలకు పైగా పట్టణ, నగర పాలక సంస్థల్లో ఉన్న 38 వేల మంది కార్మికుల్లో 91.9 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నుంచి ఉన్నారు. వీరిలో ఎస్సీ వర్గం నుంచి అధికంగా 68.9 శాతం మంది, 14.7 శాతం మంది ఓబీసీలు, 8.3 శాతం మంది ఎస్టీలు ఉన్నారు. 8 శాతం మంది జనరల్ కేటగిరి నుంచి ఉన్నారు. దేశవ్యాప్తంగా 2019 నుంచి 2023 మధ్య ప్రమాదకర పరిస్థితుల్లో మురుగుకాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తూ కనీసం 377 మంది చనిపోయారని పార్లమెంటులో ప్రభుత్వం సమాచారాన్ని వెల్లడించిన విషయం విదితమే.

ప్రమాదకర పరిస్థితులు

దేశవ్యాప్తంగా మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికుల (ఎస్ఎస్‌డబ్ల్యూ) ప్రొఫైల్‌ను కేంద్ర సామాజిక, సాధికారత మంత్రిత్వ శాఖ తన 'నమస్తే' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నది. అన్ని మురుగు కాలువల పనిని యాంత్రీకీకరించటం, ప్రమాదకరమైన శుభ్రపరిచే పనుల కారణంగా నమోదయ్యే మరణాలను నివారించటం నమస్తే కార్యక్రమ ఉద్దేశం. మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం (ఎస్ఆర్ఎంఎస్) స్వయం ఉపాధి పథకం స్థానంలో 2023-24లో ఈ పథకాన్ని తీసుకొచ్చారు. అయితే, దేశంలో మాన్యువల్ స్కావెంజింగ్ ముగిసిందనీ, అయితే ఇప్పుడు పరిష్కరించాల్సింది మురుగుకాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రపర్చటంలో ప్రమాదకర పరిస్థితులను అని కేంద్రం భావిస్తున్నది.

నమస్తే కార్యక్రమనేది నేరుగా మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసే కార్మికులను లక్ష్యంగా చేసుకుంటుంది. ఇందులో వాహన డ్రైవర్లు, హెల్పర్లు, మెషిన్ ఆపరేటర్లు, క్లీనర్లు కూడా ఉంటారని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వారికి భద్రతా శిక్షణ, పరికరాలను అందించటం, మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులను శానిటేషన్ వ్యవస్థాపకులుగా మార్చగల మూలధన రాయితీలను అందించటం దీని లక్ష్యం. ఏడాది క్రితం ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి 3326 పట్టణ, నగర పాలక సంస్థలు (యూఎల్‌బీలు) ప్రక్రియను ప్రారంభించాయి. సుమారు 38 వేల ఎస్ఎస్‌డబ్ల్యూలను రూపొందించాయి. ఇప్పటి వరకు 283 యూఎల్‌బీలు సున్నా ఎస్ఎస్‌డబ్ల్యూలను నమోదు చేశాయి. అలాగే, 2364 యూఎల్‌బీలు పది కంటే తక్కువ చొప్పున నమోదు చేశాయి. కేరళ, రాజస్థాన్, జమ్మూకాశ్మీర్ వంటి 12 రాష్ట్రాలు, యూటీలు ప్రొఫైలింగ్ ప్రక్రియను రూపొందించాయి. ఏపీ, గుజరాత్, యూపీ, ఎంపీ, మహారాష్ట్ర వంటి 17 రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుండటం గమనార్హం. ఇక తమిళనాడు, ఒడిశా వంటి రాష్ట్రాలు ఎస్-ఎస్‌డబ్ల్యూల స్థానంలో స్వంతంగా కార్యక్రమాలను నడుపుతున్నాయి. అయితే, ఈ రెండు రాష్ట్రాల నుంచి కేంద్రానికి సమాచారం లేదు.

యువత సృజనాత్మకతకు అవకాశం ఇచ్చేందుకే యూత్ లిటరరీ

- తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఆనందాచారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యువతలో ఉన్న సృజనాత్మకశక్తిని వెలికి తీయటం, వారిలో ఉన్న వినూత్న భావాలను వారే స్వేచ్ఛగా ప్రకటించుకునే అవకాశాన్ని కల్పించటమే యూత్ లిటరరీ ఫెస్ట్ ప్రధాన లక్ష్యమని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఆనందాచారి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూత్ లిటరరీ ఫెస్ట్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. బుధ, గురువారాల్లో యూత్ లిటరరీ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనిలో యువత(40ఏండ్ల లోపు వారే)కు అవకాశం ఇస్తున్నట్టు తెలిపారు. స్వీయ నవలా విశ్లేషణ, స్వీయ కథా విశ్లేషణ, విమర్శ, కవిత్వం, పాటపై చర్చిస్తారని పేర్కొన్నారు.. బుధవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. యువ కవులు, రచయితలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్ కృష్ణ , డీవైఎఫ్ఐ హైదరాబాద్ నగర అధ్యక్ష,కార్యదర్శులు హస్మీబాబు, జావేద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఎఫ్‌డిలపై 7.50% వడ్డీ : ఉజ్జీవన్ బ్యాంక్

బెంగళూరు : ఫిక్స్‌డ్ డిపాజిట్లపై తొమ్మిది నెలల కాల వ్యవధికి గాను వడ్డీ రేటును 7 శాతం నుంచి 7.5 శాతానికి పెంచినట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. 12 నెలల కాల వ్యవధి ఎఫ్‌డిలపై 8.25 శాతం అందించనున్నట్లు పేర్కొంది. ఈ రెండింటిపైనా సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.50 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు పేర్కొంది. స్వల్ప కాలిక కాల వ్యవధి కోసం అధిక వడ్డీ రేటును కోరుకునే ఖాతాదారుల కోసం తాము ఎఫ్‌డి రేట్లను సవరించామని ఆ బ్యాంక్ సిఇఒ సంజీవ్ నౌటియాల్ పేర్కొన్నారు.

79 శాతం కరిగిన ట్విట్టర్ విలువ : ఫిడెలిటీ అంచనా

న్యూయార్క్ : ఎలన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సామాజిక దిగ్గజం ఎక్స్ (ట్విట్టర్) విలువ 78.7 శాతం పతనమయ్యిందని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఫిడెలిటీ అంచనా వేసింది. దీంతో ప్రస్తుత విలువ కేవలం 9.4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.79వేల కోట్లు) మాత్రమే ఉండొచ్చని పేర్కొంది. ఎలన్ మస్క్ దీనిని కొనుగోలు చేసిన సమయంలో 44 బిలియన్ డాలర్లు (రూ.3.68 లక్షల కోట్లు)గా ఉంది. దీని కొనుగోలుకు వెచ్చించిన మొత్తంలో ఆగస్టు నాటికి కేవలం నాలుగో వంతు విలువ మాత్రమే మిగిలిందని ఫిడెలిటీ తెలిపింది.

బ్లూక్లౌడ్ సాఫ్ట్‌టెక్‌కు ఐఎస్ఒ గుర్తింపు

హైదరాబాద్ : బ్లూక్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్‌కు ఐఎస్ఒ 9001-2015, 27001-2022 సర్టిఫికేషన్ గుర్తింపును సాధించినట్లు ప్రకటించింది. ఇది తమ సంస్థ సేవల నాణ్యత నిర్వహణ, సమాచార భద్రత నిబద్ధతకు నిదర్శనమని ఆ సంస్థ సిఎఫ్ఒ మనోజ్ శాండిల్య తెలకపల్లి పేర్కొన్నారు. ఇది తమ సంస్థకు ఒక ముఖ్యమైన మైలురాయి అన్నారు.

గ్రీన్ ఎనర్జీకి స్టాండర్ట్ కాపిటల్ మద్దతు

హైదరాబాద్ : బ్యాంకింగేతర విత్త సంస్థ స్టాండర్ట్ కాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ కొత్తగా పాఠశాలలు, నివాస సొసైటీలకు ఎలాంటి వడ్డీ లేకుండా గ్రీన్ ఎనర్జీకి నిధుల సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపింది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, ఎలక్ట్రిక్ వెహికల్ (ఇవి) మొబిలిటీ సొల్యూషన్‌లకు మద్దతునిచ్చే లక్ష్యంతో నిధులకు సహకరించనున్నట్లు పేర్కొంది. సౌర ఫలకాలను, ఇతర పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను వ్యవస్థాపించే ప్రాజెక్టులకు క్లిష్టమైన ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు పేర్కొంది.

ఎంఒఎస్ యుటిలిటీలో ఎఫ్‌ఐఐలకు వాటాలు

ముంబయి : ఫిన్‌టెక్ కంపెనీ ఎంఒఎస్ యుటిలిటీ లిమిటెడ్‌లో ఐదు విదేశీ సంస్థాగత మదుపర్ల సంస్థలు (ఎఫ్ఐఐ) వాటాలను కొనుగోలు చేశాయని ఆ సంస్థ వెల్లడించింది. స్టాక్స్ పొందిన వాటిలో సెయింట్ కాపిటల్ ఫండ్, ఎజి డైనమిక్ ఫండ్స్, మినెర్వ వెంచర్స్ ఫండ్, నెక్స్‌పాక్ట్ లిమిటెడ్, బ్రిడ్జ్ ఇండియా ఫండ్ సంస్థలు ఉన్నాయి. ఎస్ఎస్ఇ గణంకాల ప్రకారం.. ఎంఒఎస్ యుటిలిటీలో సెయింట్ కాపిటల్ ఫండ్ 15.40 లక్షల షేర్లు, ఎజి డైనమిక్ ఫండ్స్ 2,69,600 షేర్లు, బ్రిడ్జ్ ఇండియా 5,49,600 షేర్ల చొప్పున కొనుగోలు చేశాయి.

మార్కెట్లోకి గెలాక్సీ ఎస్24 ఎఫ్ఇ

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ భారత మార్కెట్లోకి గెలాక్సీ ఎస్ 24ఎఫ్ఇని విడుదల చేసినట్లు తెలిపింది. 6.7 అంగుళాల డైనమిక్ అమోలెడ్ 2ఎక్స్ డిస్ప్లే, 4,700 ఎంఎహెచ్ బ్యాటరీలో ఆవిష్కరించింది. 8జిబి ర్యామ్, 128జిబి స్టోరేజీ ధరను రూ.59,999గా, 8జిబి, 256 వేరియంట్ ధరను రూ.65,999గా నిర్ణయించింది. 50 ప్రైమరీ కెమెరా, 8ఎంపి, 12 ఎంపి కెమెరాలు సహా సెల్ఫీ కోసం 10 ఎంపి కెమెరాను అమర్చింది.

బుక్ మై షో సిఇఒకు మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ : బ్లాక్ టికెట్ల వ్యవహారంలో బుక్ మై షో సిఇఒ, సహ వ్యవస్థాపకుడు అశీష్ హేమరాజని కి ముంబయి పోలీసులు మరోమారు నోటీసులు జారీ చేశారు. బ్రిటిష్ రాక్ బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి బ్లాక్ టికెట్లు విక్రయించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై వివరణ కోరుతూ ముంబయి పోలీసు ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ శనివారం అశీష్‌తో పాటు కంపెనీ టెక్నికల్ హెడ్‌కు సమన్లు పంపిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని, విచారణ అధికారి ఎదుట హాజరు కావాలని తాజా నోటీసులో పేర్కొన్నారు.

ఫోన్‌పేలో పసిడి పొదుపు స్కీం

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్ పే కొత్తగా పసిడి పొదుపు స్కీంను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. డైలీ సేవింగ్స్ పేరుతో దీన్ని ఆవిష్కరించింది. ఇందుకోసం మైక్రో సేవింగ్స్ ప్లాట్‌ఫామ్ జార్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇది తమ ఖాతాదారులు రోజువారీ చిన్న పెట్టుబడి ద్వారా 24 క్యారెట్ల డిజిటల్ బంగారంలో డబ్బును ఆదా చేయడానికి వీలు కల్పిస్తుందని ఫోన్‌పే తెలిపింది. ఇందులో రోజుకు కనిష్టంగా రూ.10 నుంచి గరిష్టంగా రూ.5వేల వరకు పెట్టుబడి పెట్టచ్చని పేర్కొంది.

శుద్ధ నీరు లేదు... వసతుల్లేవు...



- ఆశ్రమ పాఠశాలల్లో మెరుగుపడని సౌకర్యాలు
- పనిచేయని సోలార్ వాటర్ హీటర్లు, శుద్ధినీటి పరికరాలు
- అరకొర సౌకర్యాల మధ్యనే 'గిరి' చదువులు
- పర్యవేక్షణ మరిచిన ఐటీడీఏ అధికారులు

ఆదివాసీ గిరిజన పిల్లలు చదివే ఆశ్రమ పాఠశాలల్లో సంక్షేమం కొరవడుతోంది.. ఏండ్లు గడుస్తున్నా వసతుల మెరుగుదలలో తీరు మారడం లేదు. అరకొర సౌకర్యాల మధ్యనే చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి పాఠశాలలోనూ శుద్ధనీటి పరికరాలు ఏడాది కాలంగా పనిచేయకపోయినా పట్టించుకున్న నాథులే లేరు. సోలార్ వాటర్ హీటర్లు పనిచేయక.. అలంకార ప్రాయంగా మారాయి. సౌకర్యాలపై అధికారులు, ఉపాధ్యాయులను అడగలేని ఆ పిల్లలు అరకొర వసతుల మధ్యనే చదువులు సాగిస్తున్నారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించడం వల్లే సౌకర్యాలు కరువయ్యాయన్న విమర్శలొస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. ఫలితంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, తలమడుగు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ గిరిజనులు అధికంగా ఉన్నాయి. వీరి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఏర్పాటు చేసింది. ప్రతి ఏటా రూ.కోట్లాది నిధులు అందజేస్తోంది. ఆశ్రమ పాఠశాలలు సైతం ఐటీడీఏ పరిధిలోనే కొనసాగుతున్నాయి. జిల్లాలో ఒకటి, రెండు తరగతుల కోసం ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయగా.. మూడో తరగతి నుంచి వసతితో కూడిన ఆశ్రమ పాఠశాలలను నెలకొల్పింది. ప్రస్తుతం 133 ఆశ్రమ పాఠశాలలు ఉండగా.. వీటిలో 33,071మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంత మంది పిల్లలు చదువుకుంటున్న ఈ పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాల కల్పన పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో రాకపోవడం.. వచ్చిన సమయంలో అధికారులు మౌలిక వసతులు మెరుగుపర్చకపోవడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఉట్నూర్‌లోని ఓ ఆశ్రమ పాఠశాలను సందర్శించగా.. అక్కడ వసతులు సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పూనగూడ ఆశ్రమ పాఠశాలలో 240మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ శుద్ధనీటి పరికరం మరమ్మతులకు గురై సుమారు ఏడాది గడిచినా బాగు చేయించడం లేదు. విద్యార్థులు భగీరథ నీటితో పాటు పాఠశాల ఆవరణలో ఉండే బోరు నీటిని తాగాల్సిన దుస్థితి నెలకొంది. సోలార్ వాటర్ హీటర్ కూడా పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు రోజూ చన్నీటితోనే స్నానం చేయాల్సి వస్తోంది. సిరికొండ మండలంలోని రాయిగూడ ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్డి తలుపులు విరిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లతో పాటు పరిసరాలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయి. నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు.

భగీరథ నీరు.. చన్నీటితోనే స్నానం..!

మనిషికి అనేక వ్యాధులకు కలుషిత నీరే కారణమని వైద్యులు చెబుతుంటారు. కానీ గిరి విద్యార్థులు మాత్రం వాటికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో రూ.లక్షలు వెచ్చించి శుద్ధనీటి పరికరాలు అందుబాటులో ఉంచినా.. అవి పనిచేయకపోతే మరమ్మతులు చేయించడం లేదు. ఈ పరికరాలు బిగించిన కంపెనీ కూడా పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు భగీరథ నీటితో పాటు స్థానికంగా ఉండే బోరునీటిని తాగాల్సి వస్తోంది. మరోపక్క ఈ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్లు పనిచేయడం లేదు. వేడి నీటి పరికరాలు పనిచేయకపోవడం మూలంగా చన్నీటితోనే స్నానం చేయాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. మరోపక్క కొన్ని పాఠశాలల్లో మెనూ సైతం సక్రమంగా పాటించడం లేదనే ఆరోపణలున్నాయి.

నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పాఠశాలల్లో స్థితిగతులు తెలుసుకోవాల్సిన అధికారులు నెలల తరబడి అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేటీఆర్ వ్యాఖ్యలతో.. 'నాయిని' సవాల్..

బీఆర్ఎస్ నేతల హల్‌చల్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

'నయీమ్‌నగర్ బ్రిడ్జి మేం కడితే ఎమ్మెల్యే ఎంజాయ్ చేస్తున్నాడని..' బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడం రాజకీయ దుమారానికి తెరలేపింది. దీనిపై వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందిస్తూ.. 'నయీమ్‌నగర్ బ్రిడ్జి ఎవరు నిర్మించారో తెలుసుకోవాలంటే ఆ బ్రిడ్జి వద్దకు రావాలని..' సవాల్ విసిరారు. దీనిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్‌గాని, ఆ పార్టీ నేతలు గాని స్పందించలేదు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. నయీమ్‌నగర్ బ్రిడ్జి వద్దకు చేరుకొని 'నయీమ్‌నగర్ బ్రిడ్జి ఎవరు నిర్మించారు' అని బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న వాహనదారులను అడగడంతో వారందరూ కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నిర్మించారని అన్నారు. 'నాయిని', మాజీ మంత్రి కేటీఆర్‌కు సవాల్ విసిరిన నేపథ్యంలో బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కార్యకర్తలతో సోమవారం నయీమ్‌నగర్ బ్రిడ్జి వద్దకు వచ్చి ఎమ్మెల్యే 'నాయిని' విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు సైతం అక్కడికి చేరుకోవడం తో ఇరు పార్టీల శ్రేణుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వినయ్‌భాస్కర్ డౌన్‌డౌన్ అంటూ, వినయ్‌భాస్కర్ భూ కబ్జాదారుడు, చెన్నైకి తరిమికొడుతాం అంటూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ శ్రేణులు రాజేందర్‌రెడ్డి ఖబడ్దార్ అంటూ ప్రతినినాదాలు చేశారు. దాంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి 'దాస్యం'ను అదుపులోకి తీసుకొని పార్టీ కార్యాలయంలో వదిలేశారు.



గత ప్రభుత్వం నయీంనగర్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేసినా విడుదల చేయలేదు. హన్మకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.84 కోట్లు విడుదల చేయించారు. అంతే వేగంగా ఏప్రిల్ 9వ తేదీన పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపదికన నాలుగు నెలల్లో అంటే ఆగస్టులోపు పనులు పూర్తి చేయించడంతో 'నాయిని' క్రియాశీలతపై నగరవాసుల్లో హర్షం వ్యక్తమైంది. దాంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మరక్షణలో పడ్డాయి. ఇదిలావుంటే పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కాళోజీ కళాక్షేత్రాన్ని తమ హయాంలో పూర్తి చేసి ప్రారంభించలేకపోయింది. ఇది ఒకరకంగా ఆ పార్టీకి ఇబ్బందికరంగానే పరిణమించింది. దాంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మరక్షణలో పడ్డాయి. జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు ప్రేక్షకపాత్ర వహించడంతో మాజీ మంత్రి కేటీఆరే స్వయంగా దీనిపై వ్యాఖ్యలు చేయాల్సి రావడం గమనార్హం.

తెలంగాణలో బుల్డోజర్ పాలన నడుస్తోంది

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ లో బుల్డోజర్ పాలన నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుల్డోజర్ విధానం ఉండొద్దన్న సుప్రీంకోర్టు ఆర్డర్స్ తెలంగాణకు వర్తించవా? అని ప్రశ్నించారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కూల్చివేతలతో పేదలను రోడ్లపై పడేయడం న్యాయం కాదన్నారు. ఈ విషయంలో ప్రత్యమ్నాయాలపై ఆలోచన చేయాలని సూచించారు. ప్రజలు కట్టుకున్న చోట వారికి ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాటించుకోక పోతే కేంద్రం ఈ అంశంపై ఫోకస్ చేయాలని కోరారు. మొత్తం బుల్డోజర్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు.

సర్‌చార్జిపై ఈఆర్సీ ఉత్తర్వులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఓపెన్ యాక్సెస్ ద్వారా పరిశ్రమలు వినియోగించుకొనే కరెంటుపై అడిషనల్ సర్‌చార్జి విధిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఎస్‌ఈఆర్సీ) ఉత్తర్వులు జారీ చేసింది. డిస్కంలు యూనిట్‌కు రూ.1.60 పైసలు ప్రతిపాదించగా, ఈఆర్సీ దాన్ని రూ.1.09 పైసలకు ఖరారు చేసింది. పరిశ్రమలు చెల్లించే ఫిక్సెడ్ చార్జీలకు అదనంగా ప్రతి యూనిట్‌కు పై మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై జరిగిన బహిరంగ విచారణలో ఫిక్సెడ్ చార్జీలు ఎత్తేయాలని పారిశ్రామిక సంఘాలు కోరారు. దాన్ని ఈఆర్సీ పరిగణనలోకి తీసుకోలేదు.

అంగన్‌వాడీలు దేశానికే ఆదర్శంగా నిలవాలి

నాణ్యమైన విద్య, భోజనంలో రాజీ పడొద్దు

- ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి
- క్షేత్రస్థాయి సందర్శనలు తప్పనిసరి..
- ఎందరికో ఆదర్శంగా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / మానకొండూర్ / తిమ్మాపూర్

'అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన సిలబస్ విధానం ద్వారా పూర్వ ప్రాథమిక విద్యాబోధనతో విజయం సాధిస్తూ.. తెలంగాణ అంగన్వాడీలు దేశంలోనే ఆదర్శంగా నిలవాలి. నాణ్యమైన విద్యాబోధన, భోజనం అందించడంలో రాజీ పడొద్దు. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టపరచాలి' అని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లాలో పర్యటించిన ఆమె రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మానకొండూర్ మండల కేంద్రంలో నిర్వహించిన 'పోషణ ఆరోగ్య జాతర'లో పాల్గొన్నారు. కరీంనగర్ ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న ఎల్ఎమ్‌డీలోని కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ మానసిక వికాలంగుల పాఠశాల, వృత్తి విద్యా శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.

మానకొండూర్ మాదిరిగానే రాష్ట్రంలోని అన్ని చోట్ల పోషణ ఆరోగ్య జాతరలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట' పేరుతో నిత్యం కార్యక్రమాలు నిర్వహించాలని, కలెక్టర్లు, ఇతర అధికారులు వారంలో 2-3 రోజులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. అంగన్వాడీల్లో అధునాతన సిలబస్‌తో కూడిన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అంగన్వాడీ టీచర్లు బోధనా పద్ధతులను అవలంబించాలన్నారు. పిల్లల ఎత్తుల, బరువు తూచాలని, బరువు తక్కువ ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీలకు కల్తీ సరుకులు పంపిణీ చేసినా, నాణ్యత కొరవడినా కాంట్రాక్టర్ల అనుమతులు వెంటనే రద్దు చేయాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేసిన అంగన్వాడీ కేంద్రాల పెయింటింగ్స్, నూతన ప్రాథమిక విద్యా విధానం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

తెలంగాణలోని ప్రతి పల్లె ఆదర్శ గ్రామంగా నిలవాలని ఆ దిశగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖలో పెండింగ్ బిల్లుల అంశం ముఖ్యమంత్రి దృష్టిలో ఉందని, త్వరలో సమస్య పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించాలని, స్థానిక ప్రజాప్రతినిధులు వీటిని పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పనులు ఈసారి ఎక్కువ మొత్తంలో సాగాయని, మొన్నటి వరకు వర్షాలు లేకపోవడంతో రైతు కూలీలు పెద్దఎత్తున ఉపాధి హామీ పనులకు వచ్చారని తెలిపారు.

మంచి సేవ గొప్ప ఆలోచన

స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల పాఠశాల, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు నిర్వహించడమనేది మంచి సేవ, గొప్ప ఆలోచనని సీతక్క అన్నారు. విద్యా బుద్ధులతో పాటు వృత్తి నైపుణ్యం కింద పేపర్ ప్లేట్స్ తయారీ, ఫిజియో తెరపీ, మానసిక అంశాలపై వారికి శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. మానసిక వికలాంగుల శాఖ తన దగ్గరే ఉందని, స్కూల్‌కి బస్సు ఏర్పాటు చేసి ప్రభుత్వమే నిర్వహించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీ, మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మెన్ బండ్రు శోభారాణి, కలెక్టర్ ప్రమేల సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మునిసిపల్ కమిషనర్ ఛాహత్ భాజ్ పెయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా గాంధీ జయంతి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాంధీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం జీవో 1293ను జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ జన్మదినమైన అక్టోబర్ 2న వేడుకలను నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇందు కోసం చేసే వ్యయాన్ని సంబంధిత శాఖల బడ్జెట్ నుంచి వాడుకోవాలని పేర్కొన్నారు.

కాంటాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచండి

- కార్మిక శాఖ కమిషనర్, సింగరేణి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కు ఎస్‌సీకేఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సింగరేణిలో పనిచేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలనీ, ఈఎస్ఐ సౌకర్యాన్ని అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(ఎస్‌సీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఎస్‌సీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనర్, సింగరేణి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కనీస వేతన జీవోలను తక్షణమే విడుదల చేయాలనీ, 26 వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాభాల బోనస్ రూ. 5వేలు ఇవ్వాలని కోరారు. ఓబీ, నర్సరీలో కోల్ ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు అందజేయాలని కోరారు. ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని విన్నవించారు. కన్వెయన్స్ డ్రైవర్లకు యాజమాన్యం చెల్లిస్తున్న వేతనాలను నేరుగా అందించాలనీ, నర్సరీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎండీ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని భాస్కర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గట్టు మహేందర్, నాయకులు రవివర్మ రాజేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దసరా తర్వాతే వీసీల నియామకం...

- 3 నుంచి సెర్చ్ కమిటీల భేటీ
- వారంలో ఇంటర్ బోర్డుకు కొత్త కార్యదర్శి! : విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విశ్వవిద్యాలయల ఉపకులపతుల (వీసీ) నియామకం ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశమున్నదని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ఈనెల మూడో తేదీ నుంచి సెర్చ్ కమిటీల సమావేశాలు ప్రారంభమవుతున్నాయని చెప్పారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కొన్ని విశ్వవిద్యాలయాలకు సంబంధించిన సెర్చ్ కమిటీల సభ్యులు విదేశాల్లో ఉన్నారని వివరించారు. వారు వర్చువల్‌గా పాల్గొనే అవకాశముందన్నారు. మరికొన్ని వర్సిటీల సెర్చ్ కమిటీ సభ్యులు నేరుగా పాల్గొనేందుకు ఆలస్యమయ్యే అవకాశముందని అన్నారు. దీంతో వీసీల నియామకాల ప్రక్రియ దసరా తర్వాతే ఉండే అవకాశముందన్నారు. వీసీల నియామకాల్లో సామాజిక తరగతులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఇంటర్ బోర్డుకు కొత్త కార్యదర్శిని వారం, పది రోజుల్లోనే నియమిస్తామని వివరించారు. కళాశాల విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్న శ్రీదేవసేన ఇంటర్ బోర్డు ఇన్‌చార్జీ కార్యదర్శిగా పనిచేస్తున్నారని అన్నారు. అయితే ఇంటర్ పరీక్షల నిర్వహణ ఎంతో కీలకమనీ, విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉందని అన్నారు. ఇన్‌చార్జీ బాధ్యతలు కాకుండా రెగ్యులర్ పద్ధతిలోనే ఇంటర్ బోర్డుకు కార్యదర్శిని నియమిస్తామని చెప్పారు. విద్యాకమిషన్ సభ్యులపై కసరత్తు జరుగుతోందనీ, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.

గవర్నర్‌తో టర్కియే కాన్సుల్ జనరల్

నవతెలంగామ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో టర్కియే కాన్సుల్ జనరల్ ఒర్హన్ యల్మన్ ఒకాన్ భేటీ అయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజభవన్ లో ఒకాన్, రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ జె.స్నేహజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో వారు భారతదేశం-టర్కియే సంబంధాలు, తెలంగాణ భాగస్వామ్యం తదితర విషయాలపై చర్చించారు.

లక్ష ఎకరాల్లో మూసీ నీటితో వ్యవసాయం

- విషతుల్యమవుతున్న కూరగాయలు : ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లక్ష ఎకరాల్లో మూసీ నీటితో వ్యవసాయం చేస్తున్నారనీ, దీంతో పండించిన కూరగాయలు విషతుల్యంగా మారుతున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూసీ పక్కన ఉంటున్న వారు తరచుగా అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని స్పష్టం చేశారు. గత పాలకులకు వీరిని కాపాడే చిత్తశుద్ధి లేకపోయిందని చెప్పారు. స్వచ్ఛమైన నీరు, గాలి అందివ్వడం ఈ ప్రభుత్వం చేసిన తప్పా? అని ప్రశ్నించారు. ప్రపంచ విషపూరిత నదుల్లో మూసీ 23వ స్థానంలో ఉందని తెలిపారు.

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో.... కోర్టు ముందు కవిత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో విచారణను రౌస్ ఎవెన్యూ కోర్టు వాయిదా వేసింది. ఈ స్కాంలో పెద్ద ఎత్తున డబ్బులు హవాల రూపంలో చేతులు మారాయని, పలువురు ముఖ్యమైన రాజకీయ వేత్తలు ఇందులో కింగ్ పిన్ గా ఉన్నారని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అభియోగాలు మోపింది. ఇందుకు సంబంధించి దాఖలు చేసిన కేసులో సోమవారం సీబీఐ కోర్టు ప్రత్యేక జడ్జ్ కావేరి భవేజా విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఢీల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సహా ఇతర నిందితులు వర్చువల్ మోడ్ లో కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసులో ఈ ఏడాది మార్చి 15న ఈడీ అధికారులు కవితను అరెస్ట్ చేశారు. అనంతరం ట్రయల్ కోర్టు ఆమెకు జ్యుడీషియల్ కస్టడీ విధించగా... దాదాపు 5 నెలల తర్వాత ఆగస్టు 27న సుప్రీంకోర్టు ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ బెయిల్ తో జైల్ నుంచి రిలీజ్ అయిన కవిత... అప్పటి నుంచి దర్యాప్తు సంస్థలు తనపై దాఖలు చేసిన కేసుల్లో వర్చువల్ మోడ్ లో విచారణకు హాజరవుతున్నారు. కవిత తరపున అడ్వొకేట్ మోహిత్ రావు వర్చువల్ గా హాజరై వాదనలు వినిపించారు. విచారణ, అరెస్ట్, కవితపై దాఖలు చేసిన చార్జిషీట్లపై వాదనలు వినిపించారు. అలాగే మిగిలిన నిందితుల తరపు అడ్వకేట్లు దర్యాప్తుల తీరును తప్పుబట్టారు. అన్ని వైపుల వాదనలపై తర్వాత... తదుపరి విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి కావేరి భవేజా స్పష్టం చేశారు. మరోవైపు ఇదే కేసులో సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్ పై అక్టోబర్ 4న ట్రయల్ కోర్టు విచారణ జరపనుంది.